ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్టం	కనిష్టం
నెల్లూరు	37	28
కావలి	34	26
ఆత్మకూరు	36	25
ఉదయగిరి	38	25
కందుకూరు	36	27

విద్యారంగ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన సమగ్రశిక్షా అభియాన్(ఎస్‌ఎస్‌ఏ)లో అసలేం జరుగుతోందో కూడా తెలియని పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయి.. సెక్టోరియల్ అధికారులు, ప్రాజెక్ట్ పర్యవేక్షించే అధికారులు ఎవరికివారు ఇష్టానుసారంగా అందినంత దోచుకుంటుండడంతో ఈ శాఖ అవినీతికి అడ్డాగా మారిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సమగ్రశిక్షలో ఏం జరుగుతోంది!?

- అక్రమార్జనకు అడ్డాగా ఎస్‌ఎస్‌ఏ
- కొందరు అధికారుల తీరుపై విమర్శల వెల్లువ
- అన్నీ తెలిసినా ఉన్నతాధికారుల కునుకు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : అందరికీ విద్య అందించడం, విద్యాహక్కు చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడం సమగ్రశిక్ష ఉద్దేశం. ఇందులోని విభాగాలకు సెక్టోరియల్ అధికారులుగా గెజిటెడ్ హోదా ఉన్న సీనియర్ ఉపాధ్యాయులను డిప్యుటేషన్‌పై రాత పరీక్ష ద్వారా నియమిస్తారు. అయితే, గత వైసీపీ ప్రభుత్వంలో లాబీయింగ్‌లకు పాల్పడే వారికి, రాజకీయ పలుకుబడి ఉన్న వారే ఈ పోస్టులకు వచ్చారన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యామ్నాయ పాఠశాలల విభాగం, ఐఈఆర్‌టీ (విలీన విద్య, పాఠశాల ఆరోగ్య విద్య)లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నారని, ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని కార్యాలయంలో తీవ్ర చర్చలు జరుగుతున్నాయి. విలీన విద్య విభాగంలోని భవిత కేంద్రాల నిర్వహణకు వచ్చే నిధులు, ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు వచ్చే అలవెన్స్‌లు, ఎస్కార్ట్ అలవెన్స్‌లు బాధితులకు సక్రమంగా అందడం లేదన్న గుసగుసలు వినిపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ పాఠశాలల్లో అక్రమాలు

పొరుగు ప్రాంతాలకు వలస వెళ్లే వారి పిల్లల కోసం ఏర్పాటు చేస్తున్న ప్రత్యామ్నాయ పాఠశాలల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అవుట్ సోర్సింగ్ నియామకాల దగ్గర నుంచి వారి బదిలీలు, వేతనాలు ఇవ్వడంలోనూ భారీగా అక్రమాలు చోటు చేసుకుంటున్నట్లు సమాచారం. ఆ స్కూళ్ల నిర్వాహకులతో ఒప్పందం చేసుకుని వచ్చిన ఆదాయంలో నిర్వాహకులు, సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ అధికారులు వాటాలు పంచుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే బడిబయట పిల్లలను బడిలో చేర్పించినట్లు లెక్కలు చూపించడం, నామమాత్రంగా తనిఖీలు చేయడం, ఎక్కడా తిరగకుండానే బిల్లులు పెట్టుకోవడం ఆనవాయితీగా మారింది. నగరంలో ఓ పోలీసు ఉన్నతాధికారి ఏర్పాటు చేసిన కేంద్రాన్ని కూడా ఎస్‌ఎస్‌ఏకు అప్పగించడంతో దీన్ని కూడా ఎస్‌ఎస్‌ఏ అధికారులు తమ ఆదాయవనరుగా మార్చుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ కేంద్రానికి విడుదల చేసే నిధులు సంబంధిత శాఖ సిబ్బంది జేబుల్లోకి వెళుతున్నాయన్న ఆరోపణలూ వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అయినా ఈ శాఖను ప్రక్షాళన చేస్తారనుకున్నా నేటికీ ఎవరూ దృష్టి సారించక పోవడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా పాలనాధికారి దృష్టి సారించాలని విద్యా ప్రముఖులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

పీఎం ఈ-బస్ సేవ కింద జిల్లాకు కేటాయింపు

2027 చివరికల్లా రానున్న బస్సులు

నెల్లూరు-2వ డిపోలో భారీ చార్జింగ్ పాయింట్లు

ఎలక్ట్రిక్ బస్సులు.. మనకు 100



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం పీఎం ఈ-బస్ సేవ కింద మొదటి దశలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి 750 ఎలక్ట్రికల్ బస్సులు మంజూరు చేసింది. ఈ క్రమంలో నెల్లూరు ఆర్టీసీ-2వ డిపోకు 100 బస్సులను రాష్ట్రం కేటాయించింది. మొదటి విడత టెండర్లలో పూణెకు చెందిన పిన్నాకిల్ మొబిలిటీ సొల్యూషన్స్ అనే సంస్థ బస్సుల కాంట్రాక్టు దక్కించు కుంది. 2027 సంవత్సరం చివరికల్లా ఈ ఎలక్ట్రికల్ బస్సులు పూర్తిస్థాయిలో జిల్లాకు చేరుకోనున్నాయి. నెల్లూరు నగరంతో పాటు చెన్నై, తిరుపతి ఇతర ప్రాంతాలకు కూడా ఎలక్ట్రికల్ ఏసీ బస్సులను నడపనున్నారు. కాగా, నెల్లూరు-2వ డిపోకు బస్సులను కేటాయించినా జిల్లావ్యాప్తంగా పది డిపోలకు ఈ బస్సులను కేటాయించి ఆయా ప్రాంతాల్లో తిప్పేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

రూ.1.5 కోట్లతో చార్జింగ్ స్టేషన్

ఇప్పటిదాకా నెల్లూరు-2వ డిపో ఆధ్వర్యంలో తిరుపతి డిపోకు చెందిన ఎలక్ట్రికల్ బస్సులను నెల్లూరు-తిరుపతి మధ్య నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతున్నారు. ఈ బస్సుల కోసం రెండవ డిపోలోని గ్యారేజ్‌లో చార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు రానున్న 100 ఎలక్ట్రికల్ బస్సుల కోసం రెండవ డిపో గ్యారేజీలోనే 25 చార్జింగ్ పాయింట్లతో భారీ చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుకు ఆర్టీసీ అధికారులు అడుగులు ముందుకు వేస్తున్నారు. 25 చార్జింగ్ పాయింట్లతో ఏర్పాటు చేసే ఈ భారీ చార్జింగ్ స్టేషన్‌కు రూ.1.50 కోట్లు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు వేస్తున్నారు. త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయి.

బండ భారం రూ.3.9 కోట్లు

- ఏడాది తర్వాత సిలిండర్‌పై రూ.50 పెంపు
- రేపు నగరంలో సీపీఎం భారీ నిరసన

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సరిగ్గా ఏడాది తర్వాత గ్యాస్ వినియోగదారులపై కేంద్రప్రభుత్వం ధరల మోత మోగించింది. 14.2 కిలోల సబ్సిడీయేతర సిలిండర్‌పై రూ.50 పెంచగా, మంగళవారం నుంచే అమలులోకి వెచ్చింది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్నంటిన తరుణంలో గ్యాస్ ధర పెంపు సామాన్యులకు పెనుభారంగా మారింది. 2024, ఫిబ్రవరిలో సిలిండర్ ధర రూ.940 ఉండగా, మార్చిలో రూ.100 తగ్గించింది. దీంతో సిలిండర్ ధర రూ.840లకు చేరింది. అప్పటి నుంచి అదే ధర కొనసాగుతోంది. ప్రతినెలా వంట గ్యాస్ ధర పెంపుదలపై చర్చించే గ్యాస్ కంపెనీలు ఒకటో తేదీనే పెంపు నిర్ణయం తీసుకుంటుంటాయి. ఈసారి 7వ తేదీన ఆ నిర్ణయం తీసుకున్నాయి. జిల్లాలో ఎల్‌పీజీ వినియోగదారులకు ఇండేన్, హెచ్‌పీ, భారత్ గ్యాస్ ఏజెన్సీల ద్వారా సిలిండర్లు సరఫరా అవుతున్నాయి. రూ.50 పెరగడంతో సిలిండర్ ధర రూ.890లకు చేరింది. ప్రభుత్వం మాత్రం ఒక్కో సిలిండర్‌కు రూ.18.74 సబ్సిడీ ఇస్తోంది.

జిల్లాలో 7.87 లక్షల కనెక్షన్లు

జిల్లావ్యాప్తంగా 7,87,484 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో 2616 వాణిజ్య కనెక్షన్లు ఉన్నాయి. ఇవిపోనూ జిల్లాలో సబ్సిడీయేతర సిలిండర్లు 7,84,867 ఉన్నాయి. ఒక్కో సిలిండర్‌పై రూ.50 పెరగడం వల్ల వినియోగదారులపై నెలకు రూ.39.24కోట్ల అదనపు భారం పడింది. ఇదిగాక డెలివరీ డెలివరీ బాయ్‌కు రూ.30 నుంచి 50 చెల్లించాల్సి వస్తోంది.

భగ్గుమన్న సీపీఎం

నెల్లూరు (వైద్యం) : వంటగ్యాస్ ధర పెంపుపై సీపీఎం శ్రేణులు భగ్గుమన్నాయి. మంగళవారం నగరంలోని 23, 24, 30, 36వ డివిజన్లలో మహిళలతో కలిసి సీపీఎం నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై సిలిండర్లు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పెంచల నర్సయ్య మాట్లాడుతూ ఇప్పటికే ప్రజల్లో కొనుగోలు శక్తి కోల్పోతున్న స్థితిలో గ్యాస్ ధర పెంపు సామాన్యుల నెత్తిన బండ మోపడమేనని మండిపడ్డారు. అంతర్జాతీయ ముడిచమురు ధరలు తగ్గుతున్నా కేంద్ర ప్రభుత్వం ఇలాంటి భారాలు మోపటం ఏమిటని ప్రశ్నించారు. వంటగ్యాస్ ధరల పెరుగుదలకు నిరసనగా 10వ తేదీన గాంధీబొమ్మ వద్ద భారీ నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ ఆందోళనలో సీపీఎం నాయకులు అజీజ్, కండె కోటేశ్వరరావు, మాలకొండయ్య, సుధీర్, షాహినాబేగం, వీర్ల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



నగరంలో రోడ్డుపై సిలిండర్లు ఉంచి మహిళలతో కలిసి ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

పీఎంజేఏవై వైద్యకార్డులకు పేరు నమోదు చేసుకోండి

70 ఏళ్ల పైబడిన వారికి మంజూరు

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కోఆర్డినేటర్ సుధీర్‌కుమార్

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి జన ఆరోగ్య యోజన (పీఎంజేఏవై) కార్డుద్వారా దేశంలో ఏ నెట్‌వర్క్ ఆసుపత్రులలో అయినా వైద్యసేవలు పొందే అవకాశం ఉందని ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్ వెల్లడించారు. మంగళవారం నెల్లూరు జీజీహెచ్‌లోని ఆరోగ్యశ్రీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 70 ఏళ్లపైడిన వృద్ధులు ఈ కార్డు పొందేందుకు అర్హులని తెలిపారు. ఈ కార్డు కలిగిన వృద్ధుడి కుటుంబ సభ్యులకు కూడా రూ.5 లక్షల వరకు వైద్యసేవలు పొందే అవకాశం ఉంటుందని వెల్లడించారు. ప్రస్తుతం సచివాలయాల్లోని ఏఎన్‌ఎంలు వృద్ధుల పేర్లు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. తెల్లరేషన్ కార్డు ఉండాలని, ప్రభుత్వ ఉద్యోగ పెన్షనర్లు అనర్హులుగా తెలిపారు. జిల్లాలో 1,40,846 మంది వృద్ధులు ఉండగా ఇప్పటికే 10,064 మందిని ఈ పీఎంజేఏవై కార్డు కోసం నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం జిల్లా మేనేజర్ వెంకట మురళి పాల్గొన్నారు.

భూసార పరీక్ష కేంద్రానికి జాతీయ గుర్తింపు

నెల్లూరు (వ్యవసాయం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని భూసార పరీక్ష కేంద్రానికి (ఎస్‌టీఎల్) జాతీయ స్థాయి ప్రయోగశాలగా గుర్తింపు లభించిందని ఆ కేంద్రం ఏడీఏ కన్నయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ సంస్థ అయిన బోర్డ్ ఆఫ్ టెస్టింగ్, కాలిబ్రేషన్ ప్రయోగశాల సంస్థ నెల్లూరు భూసార పరీక్షా కేంద్రంలో జరుగుతున్న ప్రయోగ పరీక్షలు, వాడే పరికరాలు, పరీక్షలు చేసే విధానం వంటి వివిధ రకాల పరిశీలనలు జరిపి జాతీయస్థాయి ప్రమాణాలు కలిగిన ప్రయోగశాలగా గుర్తింపు ధ్రువీకరణ పత్రం అందించినట్లు పేర్కొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక

రూ.51.81 కోట్లతో 1,240 యూనిట్లు

ఈ నెల 14 నుంచి దరఖాస్తుల స్వీకరణ

నెల్లూరు(హరనాథపురం), (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్‌తో ఈ ఏడాది రూ.51.81 కోట్లతో 1240 మంది లబ్ధిదారులకు పలు యూనిట్లు మంజూరు చేయడానికి కార్యాచరణ రూపొందించినట్లు కలెక్టర్ ఆనంద్ ప్రకటనలో తెలిపారు. మంజూరైన యూనిట్లలో రూ.20.46 కోట్లు సబ్సిడీగా, రూ.28.75 కోట్లు బ్యాంకు రుణాలుగా, రూ.2.59 కోట్లు లబ్ధిదారుల వాటాగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నెల 14 (అంబేడ్కర్ జయంతి) నుంచి మే 10వ తేదీలోగా ఆన్‌లైన్ (ఓబీఎంఎంఎస్) దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మే 11 నుంచి మే 20వ తేదీ వరకు మండల సెలక్షన్ కమిటీ ద్వారా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని వివరించారు. మే 21 నుంచి 27వ తేదీ వరకు లబ్ధిదారుల జాబితాను ఎమ్పీడీవోలు బ్యాంకులకు పంపుతారని తెలిపారు. మే 28 నుంచి జూన్ 12వ తేదీ వరకు బ్యాంకులో రెండు ఖాతాలు ఓపెన్ చేసుకోవాలని తెలిపారు. జూన్ 13 నుంచి 20వ తేదీ వరకు లబ్ధిదారులకు పరిపాలనాపరమైన ఉత్తర్వులు ఇస్తామని, ఆగస్టు 9 లోగా యూనిట్లు గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. రూ.3లక్షలలోపు యూనిట్లు 226, రూ.10లక్షలలోపు యూనిట్లు 628 ఉన్నట్లు వివరించారు.

ఇళ్ల క్రమబద్ధీకరణ అవకాశాన్ని వినియోగించుకోవాలి

నిరభ్యంతరం లేని భూముల్లో 2019 అక్టోబరు 10వ తేదీ కంటే ముందు ఇళ్లు నిర్మించుకున్న వారి ఇళ్లను క్రమబద్ధీకరించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఆయన అధికారులతో మాట్లాడారు. మీసేవ, సచివాలయాల్లో అన్ని ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరుతో జారీ చేసి రెండేళ్ల తరువాత యాజమాన్య హక్కులు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ప్రజా సమస్యల పరిష్కారవేదికలో వచ్చే అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జేసీ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



రెండేళ్ల తర్వాత ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రొయ్యల మార్కెట్‌కు ఎదురుదెబ్బ తగిలింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విదేశీ ఉత్పత్తులపై సుంకం విధించే క్రమంలో భారత్ నుంచి ఎగుమతయ్యే రొయ్యలపై సుంకాన్ని 26 శాతం చేశారు. ఈ నిర్ణయంతో ఆక్వారంగం కుదేలవుతోంది. ఇదేఅదునుగా దళారులు ధరలు తగ్గించేసి చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వాస్తవంగా 16 దేశాలకు భారత్ నుంచి రొయ్యలు ఎగుమతి అవుతుండగా అమెరికా మినహా ఎక్కడ సమస్య లేకున్నా అమెరికా బూచిని చూపుతున్నారు. దీంతో ధరలు పతనమై వంద కౌంట్ రొయ్యలను కొనుగోలు చేసే వారే కరువయ్యారు. అయితే, రొయ్యల సాగుదారుల పరిస్థితిని గమనించిన సీఎం చంద్రబాబు కేంద్రమంత్రులకు లేఖలు రాయడంతో ధరలు కొంతమేర పెరిగి స్థిరత్వాన్ని చూపాయి.

- అల్లూరు, (ఆంధ్రజ్యోతి)

తగ్గని మేత ధర

రోజులో మూడు దఫాలు రొయ్య పిల్లలకు మేతను అందించాల్సి ఉంటుంది. ఈ మేత కిలో రూ.84 వరకు ధర పలుకుతోంది. ముడిసరుకులు కొనాలంటే కిలోకు రూ.35 నుంచి 45 వరకు ఖర్చవుతుండగా రైతులకు మాత్రం రూ.84 నగదు చెల్లింపుతోనూ రూ.92 వరకు అప్పుగానూ ఇవ్వడం పరిపాటిగా మారింది. దీనిని ప్రభుత్వాలు ఎందుకు నిలువరించలేకున్నాయంటూ రైతులు ప్రశ్నిస్తున్నారు.



గుంతల్లో పట్టిన వెనామీ రకం రొయ్యలు

ట్రంప్ బూచి.. దళారులు దోచి!

- సుంకం పెంపు పేరుతో ధరల పతనం
- వంద కౌంట్ రొయ్యలు కొనేవారే కరువు
- రాష్ట్ర ప్రభుత్వ చొరవతో స్థిరపడిన రేట్లు

జిల్లాలో తీరప్రాంతంలో కావలి నుంచి మనుబోలు వరకు ఆక్వా రంగం ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ రంగంలో రాష్ట్రంలోనే జిల్లా ప్రత్యేక స్థానం కలిగి ఉంది. రెండేళ్ల క్రితం వరకు ధరలు పతనం కావడంతో సాగుదారులు ఆర్థికూబి లో కూరుకుపోయారు. అయితే, ఆ తర్వాత నుంచి కొంతమేర ధరలు స్థిరత్వాన్ని సంతరించుకోవడంతో ఈ దఫా అత్యధికమంది రైతులు రొయ్యల సాగు చేపట్టారు. ఈసారి దాదాపు 23 వేల హెక్టార్లకుపైగా రొయ్యల గుంతలు ఉన్నాయి. అప్పులు చేసి రేయింబవళ్లు చెపటోడ్చి సాగు చేసిన రొయ్యలపై డొనాల్డ్ ట్రంప్ నూతన విధి విధానాల్లో భాగంగా సుంకం వేయడంతో సాగుదారులకు మరో దెబ్బ తగిలింది.

విదేశీ నగదు జిల్లాకు

జిల్లాలో చేపట్టే రొయ్యల పెంపకం ద్వారా దాదాపు రూ.వెయ్యి నుంచి రజా.1500 కోట్ల వరకు ఆదాయాన్ని తెచ్చిపెడుతుంది. ఇంత మొత్తంలో అంతర్జాతీయస్థాయిలో రొయ్యల ద్వారా విదేశీ నగదును మన దేశానికి రప్పించే రంగంగా ఆక్వా రంగం ప్రత్యేకతను సంతరించుకుంది. ఈ క్రమంలో అమెరికాలో జరిగిన మార్పుల కారణంగా దళారీ వ్యవస్థ ఇదే అదునుగా వారి పనితనాన్ని చూపుతోంది.

ధరలు ఇలా

జిల్లాలో అత్యధికంగా వెనామీ రకం రొయ్యలు సాగులో ఉన్నాయి. 100 కౌంట్‌కు తక్కువగా ఉన్న రొయ్యలకు మాత్ర మే జాతీయ మార్కెట్లో ఎగుమతికి అవకాశం ఉంటుంది. 100 కౌంట్ నుంచి 20 కౌంట్ వరకు రొయ్యలకు గిరాకీ కూడా ఉంటుంది. ఈ క్రమంలో సైజులను బట్టి ధరలు పెరుగుతూ ఉండటంతో 30 కౌంట్ రొయ్యలు గతంలో రూ.460 ఉండగా ప్రస్తుతం రూ.360లకు, 40 కౌంట్ ధర రూ.405 నుంచి రూ.340లకు, 50 కౌంట్ రూ.370 నుంచి రూ.320లకు, 60 కౌంట్ రొయ్యలు రూ.340 నుంచి రూ.290లకు, 70 కౌంట్ రూ.320, 70 కౌంట్ రూ.285 నుంచి 260లకు పలుకుతోంది. అదేవిధంగా 100 కౌంట్ రొయ్యల గతంలో రూ.260 ఉండగా ప్రస్తుతం తీసుకునే నాథుడు కరువయ్యాడు. 100 కౌంట్ సైజుకు రొయ్యల పెంపకం చేపట్టాలంటే రూ.220 ఖర్చు కాగా మార్కెట్లో వీటి ధర రూ.240 మాత్రమే ఉంటోంది. అంటే రైతుకు రూ.20 మిగులుతుంది.



అమెరికా బూచీ.. దళారుల దోపిడీ

అమెరికాలో సుంకం చెల్లించాలనే ఒకే ఒక్క కారణంతో దళారులు రైతులను దోచుకునేందుకు సిద్ధపడుతు న్నారు. అమెరికానే కాకుండా భారత్‌లోని రొయ్యలు దాదాపు 16 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అక్కడ ఇటువంటి సమస్యలు లేకున్నా అమెరికా బూచిని చూపించి దళారులు ఎంచక్కా రైతులను తీవ్రంగా దోచుకుంటున్నారు. దీనినే మార్కెట్ మాఫియా అని కూడా అంటుంటారు.



సంపద ఉత్పత్తి సమయంలోనే సమస్యలు

నలువైపులా రొయ్యల సంపద ఉత్పత్తి అయ్యే సమయంలోనే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ధరలను దిగజార్చి కృత్రిమ మార్కెట్‌ను సృష్టిస్తున్నారు. రైతులు అంటేనే మార్కెట్ మాఫియాకి పిల్లికి చెలగాటం ఎలుకకు ప్రాణసంకటం అన్న చందంగా మారిపోయింది

- చిరంజీవి, ఆక్వారైతు, అల్లూరు పేట, అల్లూరు మండలం



సీఎం చొరవతో నిలకడగా ధరలు

ధరలు పతనమైన క్రమంలో వెంటనే అప్రమత్తమైన రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకున్న చర్యలతో నేడు ధరలు నిలకడగా మారాయి. 100 కౌంట్ ధర రూ.220 ఉండటంతో అనుకున్న మేర నష్టం వాటిల్లే పరిస్థితి లేదు కానీ రైతులకు ఆదాయం మాత్రం ఉండదు. మేత ధరలు తగ్గితే రైతులను ఆదుకునే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ముఖ్యమంత్రి, ఆక్వా రంగ ప్రభుత్వ సంస్థలు పనిచేస్తే మరింత మేలు చేకూరుతుంది.

- నీలపరెడ్డి హరీష్‌రెడ్డి, ఆక్వారైతు, అల్లూరు



దళారులు దోచేస్తున్నారు

అమెరికాలో సుంకం విధిస్తున్నారంటూ ధరలు తగ్గించి దళారులు దోచుకుంటున్నారు. ఒక్క అమెరికాకే కాకుండా ఇతర దేశాలకు కూడా ఎగుమతులు జరుగుతుండగా కేవలం అమెరికాలో సుంకం అనే పేరుతో దళారీ వ్యవస్థ ధరలు తగ్గించడం దారుణం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పకడ్బందీగా చర్యలు తీసుకొని విదేశాల్లోని కొనుగోలుదారులను పిలిపించి చర్చలు జరిపి నేరుగా విక్రయిస్తే రైతులకు, కొనుగోలుదారులకు మేలు చేకూరుతుంది. ఈ దిశగా ప్రభుత్వాలు ఆలోచించాలి.

- బిట్రగుంట రమేష్‌రెడ్డి, ఆక్వారైతు, అల్లూరు



కష్టపడి పెంపకం చేపడితే నష్టాలు

కష్టపడి పెంచిన రొయ్యలకు విదేశీ మార్కెట్లో గిరాకీ ఉన్నా స్థానికంగా తక్కువ ధరలుకు కొనుగోలు చేస్తున్నారు. దళారులకే మా ఆదాయాన్ని దోచిపెట్టాల్సి వస్తోంది. ఈ పరిస్థితి నుంచి రైతులకు విముక్తి ఎప్పుడు లభిస్తుందో అర్థం కాకుండా పోయింది. అమెరికాలో సుంకం అనే పేరుతో దళారులు తమ ఇష్టానికి ధరలు తగ్గించేసి సాగుదారులను దోచుకుంటున్నారు. ఈ పద్ధతిని మార్చే విధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకొని నూతన ఒరవడిని తీసుకురావాలి.

- కత్తుల విజయ్ కుమార్, ఆక్వారైతు, అల్లూరు.

నలుగురు సబ్ రిజిస్ట్రార్లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం

వివరాలు 8లో..

రేపు అబీద్‌బాబా గంధమహోత్సవం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనకాలువ దగ్గర వెలసిఉన్న హజరత్ సూఫీ మొహమ్మద్ జైనుల్లాబీదీన్ ఖాదరివుల్ చిస్తిబాబా (అబీద్‌బాబా) 22వ గంధమహోత్సవం గురువారం జరగనుంది. శుక్రవారం హక్కుదారుడైన సయ్యద్ అన్ సారిహుసేని ఇంటి వద్ద నుంచి ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగింపుగా గంధం దర్గాకు చేరుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు గంధాన్ని పంచి పెట్టనున్నారు. శనివారం తహలీల్ ఫాతెహాతో గంధోత్సవం ముగుస్తుందన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8506
వెండి కిలో ధర	రూ. 92,500
వెండి ఒక గ్రాము	రూ.95.50

న్యూస్ బాక్స్

అశ్వవాహనంపై సంగమేశ్వరుడు



సంగం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో సోమవారం అర్ధరాత్రి నుంచి మంగళవారం తెల్లవారుజాము వరకు అశ్వవాహనంపై సంగమేశ్వరుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కోట సులోచనమ్మ, ఆమె కుమారులు వంశీకృష్ణ, సుధీర్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. ప్రధాన అర్చకులు గోపాలకృష్ణమూర్తి గర్భగుడిలో స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లకు పూలంగిసేవ నిర్వహించారు.

సీతారాములకు పొన్నవాహన సేవ



పొన్నచెట్టుపై ఊరేగుతున్న స్వామివారు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండరామస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీసీతారాములు పొన్నవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. యాదవుల ఉభయం సందర్భంగా తొలుత ఉభయదాత దాసరి మహేష్ నివాసం నుంచి నైవేద్యాలను ఆలయానికి చేర్చారు. అనంతరం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు.

ఇళ్ల వద్దకు చేరని సరుకులు

అనంతసాగరం ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): రేషన్ సరుకులు గ్రామంఒని ఇళ్లవద్ద అందక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈనెల సరుకులు వాహనం ద్వారా సరఫరా చేయలేదు. దీంతో గ్రామంలోని మూడు చౌకదుకాణాలు ఉండగా అక్కడకు వెళ్లి లబ్ధిదారులు సరుకులు తెచ్చుకోవాల్సి వచ్చింది.

వ్యాయామంతో మానసిక ప్రశాంతత



అవగాహన కల్పిస్తున్న వైద్యుడు రమేష్

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రతినిత్యం కొంత సమయం వ్యాయామానికి కేటాయిస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందని హైదారాబాదుకి చెందిన నిజామ్ మెడికల్ కళాశాల వైద్యులు రమేష్, సంతోష్ కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. విధులు నిర్వహించే క్రమంలో ఉద్యోగులు మానసిక ఒత్తిడికి గురై తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటారని, ప్రధానంగా క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు తీవ్రమైన పని ఒత్తిడిని తట్టుకోలేక ఆత్మహత్యలు, గుండెపోటుతో ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. అలాంటి ఉద్యోగులు సమయానుకూలంగా చేయాల్సిన వ్యాయామంపై అవగాహన కల్పించారు. అనంతరం రాయితీపై పరికరాలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఈవోపీఆర్డీ నాగూర్‌వలి, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



వింజమూరులో ఇరిగేషన్ స్థలాల కబ్జా

● పట్టించుకోని అధికారులు

వింజమూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున ఆర్టీసీ రోడ్డులోని విలువైన ఇరిగేషన్ స్థలాలు ఆక్రమణకు గురయ్యాయి. వింజమూరులో స్థలాలకు మంచి డిమాండ్ ఉండడంతో ప్రభుత్వ స్థలాలను ఆక్రమించడం, వాటిని అద్దెకు ఇవ్వడం పరిపాటిగా మారింది. ఇలాంటి విలువైన స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, వాణిజ్య సముదాయాలుగా మారిస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందని స్థానికులు తెలిపారు. పట్టణంలో మరుగుదొడ్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ స్థలాల ముందు భాగం వాణిజ్య సముదాయయానికి, వెనుక భాగం మురుగుదొడ్లకు ఉపయోగించుకోవచ్చని పలువురు పేర్కొన్నారు. దీంతో పంచాయతీకి ఆదాయం వస్తుందని, ప్రజలకు ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికైనా ప్ర భుత్వం ఇరిగేషన్ స్థలాలను స్వాధీనం చేసుకో వాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా ఇరిగేషన్ స్థలాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, ఆర్డీవో పరిశీలనకు కూడా తీసుకువెళ్లామని, ఆయన ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.



ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఆక్రమణకు గురైన ఇరిగేషన్ స్థలం

ప్రజల దాహార్తి తీరేదెలా ?

● సీతారామపురం మండలంలో కానరాని చలివేంద్రాలు

సీతారామపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి 120 కిలోమీటర్ల దూరంలో సీతారామపురం మండలం ఉంది. ఈ మండలం నెల్లూరు, కడప, ప్రకాశం జిల్లాలకు సరిహద్దున ఉంటుంది. ఎలాంటి తాగునీటి ప్రాజెక్టులు లేని దుర్భర ప్రాంతం ఇది. అంతేకాక శింగరాయకొండ- మైదుకూరు హైవే 167బీ, కావలి - సీతారామపురం హైవే 167బిజీ, బెంగళూరు, విజయవాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ హైవేల కూడలి ప్రాంతం. ప్రతి రోజూ ఈ మండలం గుండా అధిక సంఖ్యలో ప్రయాణికులు కడప, ప్రకాశం జిల్లాలకు రాకపోకలు కొనసాగిస్తున్నారు. అలాగే భైరవకోన, సిద్దేశ్వరం తదిర పుణ్యక్షేత్రాలను దర్శించుకుంటున్నారు. అలాంటి వారి సౌకర్యార్థం గతంలో దాతలు చలివేంద్రాలు ఏర్పాటు చేసేవారు. మరి ఈ సంవత్సరం ఎందుకో ఏదాత కూడా ముందుకువచ్చి ఒక్క చలివేంద్రం కూడా ఏర్పాటు చేయలేదు. చిన్న కుటుంబం మంచి నీరు తాగాలంటే రూ. 40లు పెట్టి కొనాలి. సీఎం చంద్రబాబు ప్రజాప్రయోజనార్థం పి-4 విధానాన్ని తెచ్చారు. పేదప్రజల అవసరాలు తీర్చే కార్యక్రమాన్ని ముమ్మరంగా ప్రచారం చేస్తున్న సమయంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం కూడా పి-4లో భాగమే అని గ్రహించాలి. ఇప్పటికైనా దాతలు, రాజకీయ పార్టీల నాయకులు స్పందించి చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సీతారామపురం బస్టాండ్‌లో కనిపించని చలివేంద్రాలు

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి



ఉదయగిరి : కార్యక్రమంలో మాట్లాడుతున్న వైద్యాధికారిణి శివకల్పన



సంగం : ఫైలేరియా కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి



వరికుంటపాడు : వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పిస్తున్న నౌషాద్‌బాబు

ఉదయగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా వైద్య ఆరోగ్య సిబ్బంది ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని వైద్యాధికారిణి శివకల్పన పేర్కొన్నారు. మంగళవారం పాత సీహెచ్‌సీ భవనంలో వైద్యఆరోగ్య సిబ్బంది, ఆశ వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు.ఆమె మాట్లాడుతూ ప్రతి ఆశ కార్యకర్త వద్ద 200, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 500 ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉంచుకోవాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు వడదెబ్బపై అవగాహన కల్పించాలన్నారు. అనంతరం 18 మంది ఫైలేరియా రోగులకు కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌వో శివకుమారి, హెచ్‌ఈ వెంకటసుబ్బయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● సంగం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 20 పంచాయతీల్లో 115 మంది ఫైలేరియా వ్యాధిగ్రస్తులు ఉన్నట్లు గుర్తించామని వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో వ్యాధిగ్రస్థులకు ఫైలేరియా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కిట్లను వినియోగించే విధానంపై వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నిర్లక్ష్య వైఖరిని వీడి తొలిదశలోనే జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులు దూరమవుతాయని ఉదయగిరి సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ఫైలేరియాపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. దోమల నుంచి వ్యాప్తించే వ్యాధి కావడంతో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిశుభ్రత పాటిస్తూ తప్పనిసరిగా దోమ తెరలను వినియోగించుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే చికిత్స పొందితే వ్యాధిని పూర్తిగా నయం చేసుకోవచ్చన్నారు. అనంతరం వ్యాధిగస్థులకు మెడికల్ కిట్లను అందజేసి వినియోగించే తీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి కరిష్మా, సీహెచ్‌వో రాజశేఖరరాజు, వైద్య, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాయితీపై పవర్ స్ప్రేయర్లు



పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు అందుకున్న రైతులు

సంగం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం రైతులకు రాయతీపై పవర్ స్ప్రేయర్లు కల్టివేటర్లను పంపిణీ చేశారు. మండలంలోని పెరమన, మర్రిపాడు, దువ్వూరు, తలుపూరుపాడు, తరుణవాయి, పడమటిపాళెం గ్రామాల రైతులకు 50 శాతం రాయితీపై 11 పవరు స్ప్రేయర్లు, 7 కల్టివేటర్లను పంపిణీ చేశారు. ఈ కార్యక మంలో టీడీపీ నేతలు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, వ్యవసాయాధికారి శ్రీహరి, వీఏఏలు పాల్గొన్నారు.

ఆలస్యం చేస్తే నాణ్యత తగ్గుదల



అరబెట్టిన పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారిణి జయశ్రీ

ఉదయగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పసుపు కొమ్ములను తవ్విన వెంటనే త్వరితగతిన ఉడికించి అరబెట్టాలని, ఆలస్యం చేస్తే నాణ్యత తగ్గుతుందని ఉద్యాన శాఖాధికారిణి జయశ్రీ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కృష్ణారెడ్డిపల్లి, కొట్టాలు, కొత్తపల్లి, లింగంనేనిపల్లి, జీ.చెరువుపల్లి, బండగానిపల్లి గ్రామాలను సందర్శించి పసుపు తవ్వకం, అరబెట్టే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది దిగుబడులు బాగారావడంతోపాటు ధరలు సైతం ఆశాజనకంగా ఉన్నాయన్నారు. రైతులు పసుపు ఉడకబెట్టే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌ఏ పూజిత, వీఏఏ కనిష్క, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా మరుగుదొడ్లు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్); మార్చి 8 (ఆంధ్రజ్యోతి): నిత్యం అధికారులు, ఉద్యోగులు, ప్రజలతో రద్దీగా ఉండే ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలోని హౌసింగ్ కార్యాలయంలో మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టినప్పటికీ నీటి వసతి లేక నిరుపయోగంగానే ఉన్నాయి. ఉద్యోగులతోపాటు పనులపై కార్యాలయానికి వెళ్లిన ప్రజలు అత్యవసర సమయంలో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అవి నిరుపయోగంగా ఉండడంతో శిథిలావస్థకు చేరి తలుపులు సైతం ధ్వంసమవుతున్నాయి. అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి.

15 ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు



టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న దేవదాయశాఖ డీఈ శ్రీనివాసులురెడ్డి

సంగం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్సీ ఎస్టీ, బీసీ కాలనీల్లో ఉన్న 15 ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపనున్నట్లు దేవదాయశాఖ డీఈ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక టీడీపీ నాయకులతో కలిసి మండలంలోని పెరమన, సంగం, తరుణవాయి, వంగల్లు, పడమటిపాళెం, ఉడ్‌హౌస్‌పేట, మర్రిపాడు, జంగాలకండ్రిక, సిద్దీపురం, వెంగారెడ్డిపాళెం, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లోని ఎస్సీ ఎస్టీ, బీసీ కాలనీల్లో ఉన్న ఆలయాలను పరిశీలించారు. 15 ఆలయాలు అభివృద్ధి చేసేందుకు గుర్తించి, ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు గుండ్లపల్లి శ్రీనివాసులు యాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, పిట్టు పట్టాభిరెడ్డి, బీజేపీ నేత మాఘం గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆగని బస్సుతో విద్యార్థుల ఇక్కట్లు



బస్సు కోసం ఎదురు చూస్తున్న విద్యార్థులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అసలే ఎండకాలం, ఆపై బస్సు కోసం గంటల తరబడి విద్యార్థుల ఎదురు చూపులు... అయినా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డ్రైవర్... బస్సును ఆపకుండా పరుగులు తీయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ఈ సంఘటన మంగళవారం వరికుంటపాడులో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే, ప్రతినిత్యం తూర్పుబోయమడగల, జడదేవి, గువ్వాడి, కాంచెరువు తదితర గ్రామాలకు చెందిన విద్యారులు విద్యాభ్యాసం కోసం స్థానిక ఉన్నత పాఠశాలకు పరుగులు తీస్తుంటారు. ఈ క్రమంలో రోజూ మాదిరిగా పాఠశాలకు వెళ్లిన విద్యార్థులు మధ్యాహ్నం 12:30 గంటలకు పాఠశాల సమయం ముగియడంతో సుమారు 2గంటల వరకు బస్సు కోసం బస్టాండ్ సెంటర్‌లో ఎదురు చూడాల్సి వచ్చింది. తీరా అక్కడకు వచ్చిన ఉదయగిరి డిపో బస్సు ఆగకుండానే వెళ్లిపోయింది. ఆ సమయంలో విద్యార్థులు కేకలు వేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో మధ్యాహ్న సమయంలో ఆ మార్గంలో ఉన్న ఒక్క బస్సు వెళ్లిపోవడంతో మరి కొంత సేపు ఎండలో ఎదురు చూసిన విద్యార్థులు చేసేదేమిలేక అటుగా వెళ్లే ఆటోలు, మోటారుబైకులపై స్వగ్రామాలకు చేరుకున్నారు. ఆర్టీసీ తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

CRIME NEWS

అడవిలో అగ్నికీలలు



దగ్ధమవుతున్న అటవీ ప్రాంతం

ఉదయగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డులోని అడవులు మంగళవారం అగ్నికి అహుతయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పుపెట్టడంతో విలువైన వృక్ష సంపద దగ్ధమవడంతోపాటు వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉంది. రహదారి అగ్నికీలలు ఎగసిపడడంతో వాహనదారులు సైతం ఇబ్బందులు పడ్డారు. వేసవి కావడంతో ఉదయగిరి రేంజ్ పరిధిలో ప్రతిరోజూ ఏదో ఒక బీట్‌లో అడువులు అగ్నికి అహుతవుతున్నాయి. ఇటీవల అటవీ శాఖాధికారులు అడువులకు నిప్పు పెట్టరాదని, అడువుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని కళాజాతా కార్యక్రమం నిర్వహించినా ప్రయోజనం కరువైంది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

సీతారామపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం సీతారామపురంలోని పోస్టాఫీసు వీధిలో ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు, పోస్టాఫీసు వీధికి చెందిన గుజ్జుల శ్రీనివాసులు- రత్తమ్మ ఇటీవల జీవనోధారం కోసం తిరుపతికి వెళ్లారు. వారి పిల్లలిద్దరూ సోమవారం రాత్రి ఇంటిబయట బంధువులతో కలిసి నిద్రపోతుండగా, తెల్లవారుజామున ఇంట్లోని ఫ్రిడ్జ్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. ఆ తర్వాత ఇంట్లోని విద్యుత్ తీగలన్నీ కాలిపోయాయి.ఆ సమయంలో ఇంట్లోని వస్తువులు సైతం కాలి బూడిదయ్యాయి.స్థానికులు వచ్చి మంటలను ఆర్పారు.అప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయింది.

లాడ్జిలో ఉరేసుకుని యువకుడి మృతి

● మృతుడు ప్రకాశం జిల్లా పునుగోడు వాసి

కందుకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు కందుకూరు పట్టణంలోని ఓ లాడ్జిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పునుగోడుకు చెందిన కల్లూరి శివనాగరాజు (26)గా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు.. బేల్దారి పనిచేసుకొంటూ జీవనం సాగించే శివనాగరాజు తండ్రి ఏడేళ్ల క్రితం మృతి చెందగా ఆ తర్వాత దుర్వసనాలు, బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడిన తన స్థోమతకు మించి అప్పులు చేశాడు. గత కొన్నేళ్లుగా పనికి కూడా సక్రమంగా వెళ్లకుండా మేస్త్రీల వద్ద అడ్వాన్సులు తీసుకుని వారికి కనిపించకుండా తప్పించుకుని తిరగడం, బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలతో కాలం గడిపేవాడు. ఈ నేపథ్యంలో ఇటీవలి కాలంలో బె ట్టింగ్‌లలో మరికొంత సొమ్ము పోవడంతో మనస్థాపానికి గురై ఆత్మ హత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి ఫోన్ పరిశీలించగా అనేక బెట్టింగ్ యాప్‌లు ఉన్నట్లు గుర్తించామని, క్రికెట్ బెట్టింగ్‌లతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లు ఆడటం, ఇతర దుర్వసనాలు ఉన్నట్లు కుటుంబసభ్యుల ద్వారా తెలిసిందని పట్టణ ఎస్ఐ సాంబశివయ్య తెలిపారు.

బంగారం చేయిస్తానని టోకరా

● డబ్బులు తీసుకుని ఉడాయించిన వ్యాపారి

● కందుకూరులో పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కందుకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని మారెమ్మమిట్ట ప్రాంతంలో బంగారు ఆభరణాలు తయారు చేసిస్తానని నమ్మబలికి మహిళల వద్ద నగదు తీసుకుని సలీం అనే వ్యక్తి ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బూడిదపాలెంలో ఉంటున్న సలీం బంగారు ఆభరణాలు తయారు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో తన ఇంటి యజమానితోపాటు మరికొందరు మహిళల వద్ద రమారమి 20 లక్షల రూపాయలకుపైగా ఆభరణాలు చేయిస్తానని చెప్పి అడ్వాన్సులు తీసుకుని నెలక్రితం పరారయ్యాడు. 10, 15 రోజులు సలీం కోసం ఎదురుచూసిన మహిళలు ఆ తర్వాత ఫోనులో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు. దీంతో ఒంగోలులో ఉంటున్న సలీం కుమారుడికి ఫోన్ చేయగా ఆభరణాలు తయారు చేస్తున్నాడని, త్వరలో వస్తాడంటూ కొన్నిరోజులు నమ్మబలికి ఆ తర్వాత చేతులెత్తేశాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన మహిళలు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ సాంబశివయ్యను వివరణ అడగ్గా సలీం కోసం గాలిస్తున్నామని త్వరలోనే పట్టుకుని సొమ్ము రికవరీ చేస్తామని తెలిపారు.

మిద్దె పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం



ఓబయ్య మృతదేహం

సీతారామపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మిద్దెపై నుంచి కింద పడి మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన మేడిపోయిన చిన్న ఓబయ్య(45) మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిన్న ఓబయ్య రోజులాగే సోమవారం మిద్దెమీద నిద్రపోయాడు.తెల్లవారుజామున మూత్రం పోయడానికి మిద్దె అంచుకు రాగా జారి కింద పడి మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పంచనామాల కోసం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మోటారుసైకిల్ అదుపుతప్పి పడి..



ఎరుకలయ్య మృతదేహం

కొండాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ అదుపుతప్పి పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని సాయిపేట పంచాయతీ కొమ్ముపాలెంలో జరిగింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొంకుముడుసు ఎరుకలయ్య(39) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజులాగా పనికి వెళ్లి లింగసముద్రం మండలం పెద్దపవని గ్రామం నుంచి మోటారుసైకిల్‌పై వస్తూ చిన్నపవని గ్రామ పెట్రోల్ బంకు సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో కావలికి తరలించారు. ఎరుకలయ్య అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 440

సీతారాములకు ఏకాంత సేవ

కావలిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా మంగళవారం పట్టణంలోని రామాలయాల్లో నవమి వేడుకలు వైభవంగా జరిగాయి. దక్షిణంపేట కోదండరామ స్వామి ఆలయంలో సీతారాములకు ఏకాంత సేవలు, వైకుంఠ దర్బార్ అలంకారం పూజలు కనుల పండువగా జరిగాయి. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. ఏకాంత సేవకు ఉభయదాతలుగా సువర్ణహోమ్‌నీడ్స్ శ్రీనివాసులు, సువర్ణ దంపతులు వ్యవహరించారు. జనతాపేట బ్రిడ్జిడౌన్‌లోని సీతారామస్వామి దేవస్థానంలో మధ్యాహ్నం వసంతోత్సవం రాత్రి ఏకాంత సేవ తదితర పూజాకార్యక్రమాలు జరిగాయి. ఐదు లాంతర్ల సెంటర్‌లోని పట్టాభిరామస్వామి దేవస్థానంలో విశేష పూజలు, గరుడ సేవలు జరగగా మహిళా భక్తులు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు షరాబు సుబ్రహ్మణ్యం, కోశాధికారి అమరా వేదగిరి, మాజీ కౌన్సిలర్ అమర విజయలక్ష్మి పాల్గొన్నారు.

క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షలు వేగవంతం చేయాలి



కిట్లు అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ బ్రిజిత

కలిగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో ఏప్రిల్ నెల చివరికల్లా ప్రజలందరికీ క్యాన్సర్ స్ర్కీనింగ్ పరీక్షల ప్రక్రియ పూర్తిచేయాలని కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ బ్రిజిత సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలతో ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మండల పరిధిలో ఉన్న లింఫాటిక్ ఫైలేరియాసిస్(ఎలిఫెంట్ యాసిస్) వ్యాధిగ్రస్థులకు ఎంఎండీపీ కిట్స్ (మార్బిడిటి మేనేజ్‌మెంట్ అండ్ డిజేబిలిటి ప్రివెన్షన్‌కిట్స్)ను అందజేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ సునీల్ కుమార్, జిల్లా అసిస్టెంట్ మలేరియా అధికారి వి నాగార్జున, సబ్‌యూనిట్ అధికారి లక్ష్మీనరసయ్య సీహెచ్‌వో సాయిలక్ష్మీ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా ఉన్న ఫ్లైవోవర్ బ్రిడ్జిని పరిశీలించిన మంత్రి



కలుగోళశాంభవి ఆలయం వద్ద అసంపూర్తిగా నిలిచిన ఫ్లైవోవర్ బ్రిడ్జిని పరిశీలిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ పెద్దపవని రోడ్డులో కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద అసంపూర్తిగా ఉన్న ఫ్లైవోవర్ బ్రిడ్జిని మంగళవారం రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖా మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. సుమారు 18 ఏళ్ల కిందట ఆ మార్గంలో ఫ్లైవోవర్ బ్రిడ్జి నిర్మాణం కోసం కలుగోళ్ల శాంభవి ఆలయం వద్ద ఉన్న రైల్వే గేట్‌ను శాశ్వతంగా మూసివేశారు. రైల్వే స్థలం వరకు రైల్వేశాఖ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేసి వదిలేసింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్మించాల్సిన బ్రిడ్జి పనులు చేపట్టలేదు. అప్పటి నుంచి ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని మంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఆ మార్గంలో ఫ్లైవోవర్ నిర్మాణం కన్నా అండర్ పాస్ వంతెన నిర్మాణం చేపడితే పట్టణ ప్రజలకు అనుకూలంగా ఉండడమే కాక రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థిక భారం తగ్గుతుందని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి ప్రతిపాదనలు పంపితే పరిశీలిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు మలిశెట్టి వెంకటేశ్వర్లు, గుత్తికొండ కిషోర్, పోతుగంటి అలేఖ్య, పోట్లూరు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

చెరువులను కుళ్లబొడుస్తున్న

మట్టి మాఫియా!

- రామన్నచెరువులో యథేచ్ఛగా తవ్వకాలు
- అక్రమంగా ప్రైవేట్ వెంచర్లకు తరలింపు
- చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు
- రూపురేఖలు మారుతున్న ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, గుట్టలు

వలేటివారిపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వలేటివారిపాలెంలో మట్టి మాఫియా దందా జోరుగా సాగుతోంది. ప్రభుత్వ భూములు, చెరువులు, కొండలు, గుట్టలను ఇష్టనుసారంగా కుళ్లబొడుస్తుండడంతో రూపురేఖలు మారిపోతోన్నాయి. అక్రమంగా తవ్విన మట్టిని లేఅవుట్లకు తరలిస్తూ రియల్టర్లు లక్షలు గడిస్తుంటే సంబంధిత రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ శాఖల అధికారులు చోద్యం చూస్తున్నారు. దీంతో మట్టి అక్రమ రవాణాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. గత 15 రోజులుగా రేయింబవళ్లు తేడా లేకుండా వలేటివారిపాలెం రామన్న చెరువులోని మట్టిని రెండు ఎక్స్‌కవేటర్లుతో తవ్వి 30కి పైగా ట్రాక్టర్లతో యథేచ్ఛగా జాతీయ రహదారి పక్కన ఉన్న ఓ ప్రైవేట్ వెంచరుకు తరలిస్తున్నారు. రోజూ వందల యూనిట్లు లెక్కన ఇప్పటి వరకు సుమారు 3 వేల యూనిట్లుకు పైగా మట్టి తరలించినట్లు సమాచారం. జమీన్‌ఉప్పలపాడు రెవెన్యూలో హైవే పక్కన వేస్తున్న వెంచరుకు ఈ మట్టి తోలి జాతీయ రహదారికి సమానంగా ఎత్తు పెంచేందుకు శ్రీకారం చుట్టారు. అంతే కాకుండా వెంచరులో అంతర్గత రహదారుల ఏర్పాటుకు అవసరమైన మట్టిని వెంచరుకు అతి సమీపంలో ఉన్న రామన్నచెరువులోని గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. స్థానికులు ఎవరైనా ప్రశ్నిస్తే అధికారులకు ఆమ్యామ్యాలు ముట్టజెప్పామని బుకాయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండిపడుతోంది. చెరువుల్లో, ప్రభుత్వ భూముల్లో మట్టి తీసుకెళ్లాలంటే రెవెన్యూ, ఇరిగేషన్, మైనింగ్ అధికారులు అనుమతులు తప్పనిసరి. చెరువుల్లో గ్రావెల్ కావాలంటే క్యూబిక్ మీటర్లు చొప్పున ప్రభుత్వానికి రుసుం చెల్లించి ఇరిగేషన్ అధికారులు అనుమతులు తీసుకోవాలి. ఇరిగేషన్ అధికారులు మార్కింగ్ ఇచ్చిన ప్రదేశంలోనే మట్టిని తీసుకెళ్లాలి. అయితే అలాంటి నిబంధనలను తుంగలో తొక్కి ప్రభుత్వానికి పైసా కూడా రుసుం చెల్లించకుండానే అక్రమంగా మట్టి తరలించుకుపోతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు. రామన్నచెరువులో నిబంధనలకు విరుద్ధంగా చెరువుకట్ట ఆనుకొని మట్టిని తరలిస్తున్నారు. దీంతో చెరువు కట్ట మన్నిక కోల్పోయి దెబ్బతినే అవకాశాలు ఉన్నాయని ఆయకట్టుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రామన్నచెరువులోని అక్రమ మట్టి తవ్వకాలను నిలిపివేయాలని స్థానికులు కోరుతున్నారు.



హైవే పక్కన వెంచరుకు తోలిన చెరువు మట్టి



వలేటివారిపాలెం రామన్న చెరువులో చేపట్టిన మట్టి తవ్వకాలు

పరిశీలించి చర్యలు తీసుకుంటాం

రామన్నచెరువులో మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు లేవు. అక్రమంగా మట్టి తవ్వకాలు చేస్తునట్లు నా దృష్టికి వచ్చింది. దీంతో గత వారం దాడులు చేసి జరిమానా వేశాం. అయినప్పటికీ మట్టి తవ్వకాలు ఆపలేదు. వెంటనే పరిశీలించి తవ్విన మట్టిని కొలతలు తీసి రికవరీ చేయిస్తాం.

- త్రివిక్రమ్, ఇరిగేషన్ ఏఈ, వలేటివారిపాలెం

మా ఆస్తికి, ప్రాణాలకు రక్షణ కల్పించండి

- తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించిన తల్లీకూతుళ్లు



తహసీల్దారు కార్యాలయం వద్ద బైఠాయించిన లక్ష్మీకుమారి, గాయత్రి

ఉలవపాడు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పూర్వీకుల కాలం నాటి ఆస్తికి, తమ ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరుతూ ఉలవపాడుకు చెందిన తల్లీకూతుళ్లు బాపనపల్లి లక్ష్మీకుమారి, గాయత్రి మంగళవారం తహసీల్దారు కార్యాలయం వద్ద సుమారు 3 గంటలపైగా బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు విలేకర్లతో మాట్లాడుతూ ఉలవపాడు ప్రధాన రహదారి పక్కన సర్వే నెంబరు 88లో సుమారు 130 గదుల ఖాళీ స్థలం తాతల కాలం నుంచి మా కుటుంబ సభ్యుల అనుభవంలో ఉందన్నారు. భీమవరం పంచాయతీ ఎల్ రాజుపాలెంకు చెందిన ఓ వ్యక్తి సర్వే నెంబరు 92లో 56 గదులకు సంబంధించి ఆ స్థలం వారసుల్లో ఒకరైన బాపనపల్లి సత్యనారాయణ తనకు రిజిస్ట్రేషన్ చేశారంటూ ఆయన మరణాంతరం 2021లో నకిలీ పత్రాలతో తమ ఆస్తిని కాజేయాలని కుట్రపన్నారన్నారు. స్థానిక ఓ మాజీ రౌడీ షీటర్ వెంటపెట్టుకొని స్థలం వద్దకు వచ్చి మమ్ములి ద్దరిని కొట్టి, చంపేందుకు ప్రయత్నించి తిరిగి మామీదనే అట్రాసిటీ కేసు నమోదు చేయించారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో మావద్ద ఉన్న స్థల ధ్రువీకరణ పత్రాలతో రెవెన్యూ, పోలీసు అధికారులకు రాత పూర్వక ఫిర్యాదు చేశామని, మాస్థలం సర్వే నెంబరు 88కి, ఆ వ్యక్తి చెప్తున్న సర్వే నెంబరు 92కు పొంతన లేక పోవడంతో అప్పటి తహసీల్దారు వివాద స్థలంగా ఇరువురు ఆ స్థలంలోకి వెళ్లవద్దని 145 సెక్షన్ జారీ చేశారన్నారు. ఈనిపై కందుకూరు కోర్టులో కేసు వేశామన్నారు. మళ్లీ గత నెల 28వ తేదీన మందీమార్బలంతో అదే మాజీ రౌడీ షీటర్ సహకారంతో స్థలంలో మట్టిని తోలించాడని, దీనిపై రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీంతో ఈనెల 1వ తేదీన కందుకూరు సబ్‌కలెక్టర్ శ్రీపూజకు ఫిర్యాదు చేశామని, ఆమె ఉలవపాడు తహసీల్దారును కలవమని చెప్పారన్నారు. అప్పటి నుంచి తహసీల్దారు కార్యాలయం, పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్నా కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై తహసీల్దారు శ్రీనివాసులు వివరణ కోరగా ఎస్‌ఐ అంకమ్మకు 145 సెక్షన్ విధించే విషయంపై అవకాశాలను పరిశీలించాలని ఆదేశించామని, నివేదిక వచ్చాక ఎలాంటి సంఘటనలు జరగకుండా చూస్తామని, దీనికి కొంత సమయం పడుతుందని బాధితులకు వివరించామని తెలిపారు.

గ్రంధి సేవలకు శాశ్వత గుర్తింపు





గ్రంధి యానాదిశెట్టి విగ్రహం ఆవిష్కరణలో పాల్గొన్న రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ రవిచంద్ర, ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, అలేఖ్య తదితరులు, కార్యక్రమానికి హాజరైన ప్రజలు

- కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మంత్రులు

కావలి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ మాజీ చైర్మన్, టీడీపీ నేత గ్రంధి యానాదిశెట్టి పార్టీలకు అతీతంగా ప్రజలకు అందించిన సేవలకు శాశ్వత గుర్తింపు ఆయన కాంస్య విగ్రహాన్ని కావలిలో ఏర్పాటు చేయడమేనని రాష్ట్ర మంత్రుల బీసీ జనార్దన్‌రెడ్డి, అనగాని సత్యప్రసాద్‌లు పేర్కొన్నారు. పట్టణంలోని ట్రంకురోడ్డు పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో కావలి ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటకృష్ణారెడ్డి సౌజన్యంతో ఏర్పాటు చేసిన గ్రంధి కాంస్య విగ్రహాన్ని మంగళవారం సాయంత్రం ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యే కృష్ణారెడ్డిలతో కలిసి మంత్రులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ జోనల్, పార్లమెంట్ ఇన్‌చార్జిలుగా కావలి నియోజకవర్గానికి వచ్చినప్పుడు గ్రంధిని కలిశామని, పార్టీ పటిష్టతకు ఆయన మాకు ఎన్నో సలహాలు, సూచనలు ఇచ్చారన్నారు. 30 ఏళ్లుగా కావలి రాజకీయాలలో ఉండిన ఆయన కుల, మత, పార్టీలకతీతంగా ప్రజలకు సేవలందించి ప్రజా మన్ననలను పొందారన్నారు. ఎమ్మెల్యే వెంకట కృష్ణారెడ్డి, గ్రంధి మంచి స్నేహితులు కావడంతో ఆయన మరణానంతరం తన సొంత నిధులతో కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రంధి తన రాజకీయ వారసత్వం తన కూతురు అలేఖ్యకు ఇచ్చారని, ఆమె కూడా తండ్రి బాటలో మున్సిపల్ చైర్‌పర్సన్‌గా పనిచేసి సేవలు అందించిందన్నారు. కావలి పట్టణ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆర్యవైశ్యులకు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీ బీద రవిచంద్ర మాట్లాడుతూ గ్రంధి 2014 వరకు తమకు రాజకీయ ప్రత్యర్థిగా ఉన్నారని, ఆయనను ఓడించేందుకు తాము ఎన్ని ప్రయత్నాలు చేసినా కావలి పట్టణంలో మెజార్టీ తేలేకపోయామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీగా టీడీపీ అభ్యర్థులు గెలిచినా మున్సిపల్ చైర్మన్‌గా ఆయనే గెలిచారన్నారు. ప్రజలతో ఆయనకు ఉన్న బాంధవ్యం అలాంటిదన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ తాను జలదంకి సొసైటీ అధ్యక్షుడిగా తొలుత రాజకీయ రంగ ప్రవేశానికి ఆయనే కారణమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధి తనయ పోతుగంటి అలేఖ్య, టీడీపీ నాయకులు గుత్తికొండ కిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, జనసేన నేత అళహరి సుధాకర్, బీజేపీ నేత జీ.భరత్‌కుమార్, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు తటవర్తి రమేష్, గ్రంధి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

వ్యవసాయ పరికరాలకు దరఖాస్తుల స్వీకరణ

కలిగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతుల నుంచి ప్రభుత్వం రాయితీపై అందించే వ్యవసాయ యాంత్రీకరణ పరికరాల కోసం రైతు సేవాకేంద్రాల్లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఎం సురేష్‌బాబు ఒ ప్రకటనలో తెలిపారు. అవసరమైన రైతులు తమ పట్టాదారు పాసుపుస్తకం, బ్యాంకు ఖాతా పుస్తకం, ట్రాక్టర్ ఆర్‌సీ పుస్తకం, సంబంధిత పత్రాలు, ఆధార్‌కార్డు జెరాక్స్ కాపీలతో రైతు సేవాకేంద్రంలో రిజిస్ట్రేషన్ ప్రకియ పూర్తి చేయించుకోవాలని పేర్కొన్నారు. యాంత్రీకరణ పరికరాలు మంజూరైన రైతులు రాయితీ నగదు పోను మిగిలిన సొమ్ము రైతు తన వాటాగా చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. మండలంలోని అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రాయితీలను పొందాలని ఆయన తెలిపారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలి : సీపీఎం

కావలిటౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఒకే సారి గ్యాస్‌పై రూ.50, పెంచడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే నిత్యావసరాల ధరలు, విద్యుత్ చార్జీలు, రకరకాల పన్నులు కట్టలేక ప్రజలు అల్లాడిపోతుంటే మళ్లీ ప్రజలపై అదనపు భారం మోపడం ఎంతవరకు సమంజసమన్నారు. పాలకులు ఎన్నికల హామీలు గద్దెనెక్కాక తుంగలో తొక్కి పేద, మధ్య తరగతి ప్రజలను మోసం చేస్తూ ఆర్థికంగా దెబ్బతీస్తున్నారన్నారు. ప్రధాని మోదీ చెప్పే వికసిత్ భారత్ ఇదేనా అని ప్రశ్నించారు. పెంచిన గ్యాస్ ధర తగ్గించకపోతే ప్రజాపోరాటాలు తప్పవన్నారు. సమావేశంలో కృష్ణప్రసాద్, మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో రైల్వే అభివృద్ధికి ఆటంకం



స్టేషన్ మాస్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

కావలిటౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టర్ల నిర్లక్షంతో కావలి రైల్వే స్టేషన్‌లో అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. మంగళవారం బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ సందర్శించి పలు సమస్యలను అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి. పనులను పరిశీలించి స్టేషన్ మాస్టర్ కు వినతిపత్రం అందించారు. నేతలు మాట్లాడు తూ తాము అనేక పర్యాయాలు కావలి రైల్వే స్టేషన్‌లో లిఫ్ట్ ఏర్పాటు చేయాలని బీజేపీ నేతల ద్వారా ఉన్నతాధికారులను కోరగా మంజూరైన లిఫ్ట్ పనులు ప్రారంభించి కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో అసంపూర్తిగా మిగిలిపోవడంతో పిల్లలు వృద్ధులు, దివ్యాంగులకు తీవ్ర ఇబ్బందిగా మారిందన్నారు. జనతాపేట వైపు బుకింగ్ కౌంటర్ ఏర్పాటు కలగానే మిగిలిందని వాపోయారు. స్టేషన్‌లో మంచి నీటి సౌకర్యం కల్పించాలని కోరినప్పటికీ ఆచరణకు నోచుకోలేదన్నారు. స్టేషన్‌లో లైట్లు, ఫ్యాన్లు, డిస్ప్లే బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మంద కిరణ్, జిల్లా నాయకులు కె బ్రహ్మానందం. సుజి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్ష


వలేటివారిపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని కందుకూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శర్మిష్ట తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం నుంచి మంగళవారం 7వ జాతీయ పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు పోషక విలువలు కలిగిన పౌష్టికాహారం తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నరేంద్రదేవ్, సీహెచ్‌వో శివరామయ్య, సూపర్‌వైజర్ సునీత, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



పౌష్టికాహార పక్షోత్సవాల అవగాహన ర్యాలీలో మాట్లాడుతున్న సీడీపీవో శర్మిష్ట

మ్యుటేషన్ విధానంలో మార్పులు!

- పట్టాదారు పాసుపుస్తకం జారీలో ఇబ్బందులు



కలిగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత నుంచి మ్యుటేషన్ విధానంలోని మార్పులు రైతులకు ఇబ్బందికరంగా మారాయి. దీంతో భూహక్కు(పట్టాదారు పాసుపుస్తకం)పత్రాల కోసం రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ రైతు తాను కొనుగోలు చేసిన భూమికి సంబంధించిన రిజిస్టర్ డ్యాకుమెంట్లతో మీసేవా కేంద్రాల ద్వారా పట్టాదారు పాసుపుస్తకానికి దరఖాస్తు చేసుకుంటే నిర్ణీత కాలంలో వెబ్‌ల్యాండ్‌లో భూమి కొనుగోలు చేసిన రైతు పేరుతో 1బి, అడంగల్ కాపీలు నమోదు కావడం, కొద్దిరోజులకు సంబంధిత రైతుకు పట్టాదారు పాసుపుస్తకం పోస్టాఫీసు ద్వారా నేరుగా ఇంటికి వచ్చేది. అదేవిధంగా రైతువారి కుటుంబంలో భూయజమాని చనిపోయినప్పుడు ఆ కుటుంబంలోని వారసులు చనిపోయిన వ్యక్తి మరణ ధ్రువీకరణ పత్రంతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ తీసుకొని మీసేవలో మ్యుటేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటే పట్టాదారు పాసుపుస్తకం వచ్చేది. అయితే గత రెండేళ్ల క్రితం వైసీపీ ప్రభుత్వం భూములు కొనుగోలు చేసే సమయంలో రిజిస్ట్రేషన్ పూర్తవగానే ఆటో మ్యుటేషన్ విధానం ప్రవేశపెట్టింది. ఈ విధానంలో భూమి కొనుగోలు చేసిన వ్యక్తిపేరు వెబ్‌ల్యాండ్‌లో ఇంగ్లీషు భాషలో 1బి, అడంగల్ వస్తోంది. ఈ కారణంతో పట్టాదారు పాసుపుస్తకం కోసం మళ్లీ గ్రామ సచివాలయం లేదా మీ సేవ కేంద్రాల వద్దకు వెళ్లి తిరిగి మ్యుటేషన్ ద్వారా దరఖాస్తు చేసుకుంటేనే పట్టాదారు పాసుపుస్తకం వచ్చేది. దీంతో ఆటో మ్యుటేషన్‌తో అడంగల్, 1బిలు వచ్చినా తిరిగి పట్టాదారు పాసుపుస్తకం కోసం తహసీల్దారు కార్యాలయంకు వెళ్లి సొమ్ములు ముట్టజెప్పడంతోపాటు రెవెన్యూ సిబ్బంది చుట్టూరా తిరగాల్సివస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత రెండు నెలల కాలం నుంచి ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ద్వారా మ్యుటేషన్ చేస్తుంటే ఎర్రర్ మెసేజ్ వస్తోంది. నూతనంగా సచివాలయ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్న ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ ఉంటేనే మ్యుటేషన్ ప్రక్రియ జరిగితోంది. దీనివలన గతంలో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కలిగి ఉన్నా అది చెల్లుబాటు కాకపోవడంతో తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సి వస్తుందని వాపోతున్నారు. రెవెన్యూ కార్యాలయంలో మ్యుటేషన్ ప్రక్రియ సజావుగా పూర్తయితే వెబ్‌ల్యాండ్‌లో 1బి, అడంగల్‌లో పేరు నమోదైనప్పటికీ పట్టాదారు పాసుపుస్తకం రావడానికి రెండు, మూడు నెలలకుపైగా కాలం పడుతోంది. పట్టాదారు పాసుపుస్తకం ఉంటేనే తప్ప బ్యాంకుల్లో రైతు రుణాలు ఇవ్వరు. భూమిని నమ్ముకున్న రైతుకు ఆ భూమి హక్కుతో కూడిన వివరాలతో పట్టాదారు పాసుపుస్తకం పొందాలంటే నెలల కాలం ఎదురుచూపులు చూడాల్సివస్తోందని, మ్యుటేషన్ ప్రక్రియ పూర్తయిన వెంటనే పాసుపుస్తకం వచ్చే లాగున ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె ధ్వంసం!

- పొంచిఉన్న ప్రమాదం



వలేటివారిపాలెం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెంలోని విద్యుత్ కార్యాలయానికి అతి సమీపంలోని పొలాలకు వెళ్లే దారిలో పొలం గట్టుపై ఉన్న విద్యుత్ ట్రాన్స్‌పారం దిమ్మె ధ్వంసం అయింది. దీంతో ఏ క్షణంలోనైనా ట్రాన్స్‌ఫార్మర్ కిందపడిపోయే పరిస్థితి నెలకొంది. దీంతో అటు వైపు పొలాలకు వెళ్లే కూలీలకు ప్రమాదం పొంచి ఉంది. ధ్వంసం అయిన దిమ్మెపైన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ విషయం సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని రైతు పరిటాల శ్రీనివాసులు ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రతినిత్యం ఆ దారిలో పొలాలకు రైతులు, కూలీలు వ్యవసాయ పనుల నిమ్మితం వెళ్తూనే ఉంటారని అలాంటి సమయాల్లో ట్రాన్స్‌ఫార్మర్ కింద పడి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని ఆ రైతు చెబుతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సిబ్బంది స్పందించి ఒరిగిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేసి విద్యుత్ ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.





నాడిలా... మంచాలపల్లి వద్ద గతంలో రోడ్డు దుస్థితి

నేడిలా !

మరమ్మతులు పూర్తయ్యాక ఇలా..

ఆత్మకూరు- సోమశిల రోడ్డు వైసీపీ హయాంలో అధ్వానంగా ఉండేది. చిరుజల్లులు కురిసినా ఈ రహదారిపై గుంతలు ఏర్పడి, ప్రమాదాలు జరిగేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్డు మరమ్మతులకు చర్యలు చేపట్టారు. మరమ్మతులకు రూ.20 లక్షలు మంజూరు చేయడంతో ప్యాచ్ పనులు పూర్తి చేశారు. దీంతో ప్రజలకు గత నెలరోజులుగా ప్రయాణ కష్టాలు తీరాయి.

- అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి)

నలుగురు సబ్‌రిజిస్ట్రార్లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశం

కోవూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో గతంలో వేర్వేరు కాలాల్లో పనిచేసిన నలుగురు సబ్ రిజిస్ట్రార్లపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్య దర్శి ఆర్పీ సిసోడియా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. గతంలో కోవూరులో సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేసిన లలితమ్మ రూ.14.91లక్షలు, సయ్యద్ సిరాజ్ రూ.64వేలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టారు. టీఎల్ కాంతారావు రూ.7.11లక్షలు, సయ్యద్ మహబూబ్‌బాష రూ 22.75లక్షల ఆదాయాన్ని ప్రభుత్వం కోల్పోయింది. న్యాయవాది కేవీ పెంచలరెడ్డి ఫిర్యాదు మేరకు విషయం వెలుగులోకి వచ్చింది. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.

ఓటరు నమోదుకు సహకరించండి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో 18 ఏళ్ల వయసు నిండిన ప్రతీ ఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలని, ఈ క్రమంలో యువత ఓటరు నమోదుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా రెవెన్యూ అధికారి జే ఉదయ భాస్కర్ రావు కోరారు. మంగళవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. పెండింగ్ లో ఉన్న ఫారం-6లను త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. మరణించిన వారి పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగించేందుకు సదరు కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో టీడీపీ నుంచి రసూల్, వైసీపీ నుంచి కోటేశ్వరరెడ్డి, కాంగ్రెస్ నుంచి బాలసుధాకర్, బీజేపీ నుంచి శ్రీనివాస్, బీఎస్పీ నుంచి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్ రావు

పలారమేస్తే పనుండదు !

- చేనేత కుటుంబాల్లో ప్రత్యేక ఆచారం
- శుభాకార్యాల్లో చేదోడుగా పనులు
- నేత కార్మికుల ఐక్యతకు నిదర్శనం

- సొత్‌మోపూరు, ములుముడి గ్రామాల్లో అమలు
- వందల ఏళ్లుగా కొనసాగింపు

నెల్లూరు రూరల్లోని సొత్‌మోపూరు గ్రామంలో పిచ్చయ్య (పేరు మార్పు)ది చేనేత కుటుంబం. ఆయన ఒక్కగానొక్క కూతురు రమణమ్మ (పేరు మార్పు)కు పెళ్లి నిశ్చయ మైంది. పెళ్లిరోజుకు ముందు రోజు రాత్రి చౌడేశ్వరీదేవికి పూజలు చేసి పద్యాల రూపంలో అమ్మవారిని శాంతింపచేసి పలారం వేస్తున్నట్లు మైక్‌లో ప్రకటించారు. అంతే గ్రామంలోని 150 చేనేత కుటుంబాలు మగ్గం నేయడం ఆపేశాయి. ఒకరోజంతా పనిజోలికి పోకుండా పిచ్చయ్యకు చేదోడుగా ఉంటూ రమణమ్మ పెళ్లి వేడుకను ఘనంగా జరిపించి అత్తారింటికి పంపారు. ఈ సంప్రదాయం వందల ఏళ్ల నుంచి సొత్‌మోపూరుతో పాటు పక్కనే ఉన్న ములుముడి గ్రామంలోనూ కొనసాగుతోంది. ఈ ఆచారం ఆసక్తికరంగా ఉన్నా నేత కార్మికుల ఐక్యతను చాటుతోందన్న ప్రశంసలు అందుకుంటోంది.

- నెల్లూరు రూరల్ (ఆంధ్రజ్యోతి)



సొత్‌మోపూరు గ్రామంలోని చౌడేశ్వరీ దేవీ ఆలయం

నెల్లూరు నగరానికి పడమర దిక్కున 24 కి.మీ. దూరాన సొత్‌మోపూరు, దానికి నాలుగు కి.మీ. ముందు ములుముడి గ్రామం ఉన్నాయి. ఇక్కడ వ్యవసాయం తరువాత చేనేత పరిశ్రమే పెద్దది. సొత్ మోపూరులో 150 కుటుంబాలు నేతపై ఆధారపడి జీవిస్తుం డగా, ములుముడిలో సుమారు 80 కుటుంబాలు మగ్గాలు నేస్తున్నాయి. వీళ్ల కుల దైవం చౌడేశ్వరీదేవి. ఏ శుభ కార్యం మొదలుపెట్టాలన్నా అమ్మవారిని పూజించాకే అడుగు ముందు కేస్తారు. పెళ్లి చేసినా ఇదే వరస. ముహూర్తానికి ముందు రోజు రాత్రి ఇంట్లో, గుడిలో అమ్మ వారికి ప్రత్యేక పూజ లు చేస్తారు. పద్యాల రూపంలో ఆ దేవిని కీర్తించి ప్రసన్నం చేసుకుంటారు. అనంతరం పొంగలి, పండ్లను పలారం(ఫల హారం)గా నివేదిస్తారు. ఈ విషయాన్ని మైక్‌లో ప్రకటిస్తారు. ఆ వెంటనే గ్రామంలో ఉన్న చేనేత కుటుంబాలన్నీ మగ్గం పనులకు సెలవు ప్రకటించేసి పెళ్లింట సందడి చేస్తారు. పెళ్లి పనుల్లో ఒకరికొకరు సహకరించు కుంటూ తమ ఐక్యతను చాటుతారు. సొత్‌మోపూరు లో చౌడే శ్వరీ దేవీ ఆలయాన్ని నిర్మించుకున్న చేనేత కార్మిక కుటుం బాలు అక్కడే పూజలు చేస్తాయి. ములుముడిలో మాత్రం అమ్మవారికి ప్రత్యేకించి ఆలయం లేకపోయినా ఎన్నో ఏళ్లుగా ఓ గదిలో ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాల వద్దే పూజలు చేస్తున్నారు.

పౌర్ణమికీ పనుండదు

చేనేత కార్మిక కుటుంబాలలో ప్రధానంగా రెండు తెగలు న్నాయి. ఇందు లో దేవాంగులు, పద్మశాలీ యులు. వీరిలో పద్మశాలీయులు ప్రతీనెల అమా వాస్య రోజు పని జోలికి వెళ్లరు. అదేవిధంగా దేవాం గులు పౌర్ణమి రోజు పని చేయరు. సొత్‌మోపూరు, ములుముడి గ్రామాల్లోని నేత కార్మిక కుటుం బాలన్నీ దేవాంగులే కావడంతో ప్రతీ నెల పౌర్ణమి నాడు వారు పని చేయరు. పౌర్ణమికి ముందు రోజు చౌడేశ్వరీ అమ్మవారి ఆలయం వద్ద పూజలు చేసి పలారం (ఫలహారం) వేస్తున్నట్లు కులపెద్దలు మైక్ ద్వారా ప్రకటిస్తారు. ఇక ఆ రోజు నేత పని ఆపేసి మరుసటి రోజు తిరిగి పనిలోకి వెళ్తారు. పూరాతన కాలం నుంచి వస్తున్న ఈ ఆచారాలను ఆ రెండు గ్రామాల్లోని చేనేత కార్మిక కుటుంబాలు ఇప్పటికీ అనుసరిస్తుండటం విశేషం.

కమ్యూనిస్టులు.. కట్టుబాట్లు

సొత్‌మోపూరు, ములుముడి గ్రామాలు కమ్యూనిస్టు భావాలున్న పల్లెలు. అలాగని అభ్యుదయమేకాదు ఇక్కడ కట్టు బాట్లు కూడా ఎక్కువే. ఒక నిర్ణయం తీసుకుంటే ఊరంతా దానికి కట్టుబడుతుంది. ధనిక, పేద తేడా లేకుండా ఆచారాలను ప్రతీ ఒక్కరు గౌరవిస్తారు, ఆచరిస్తారు.



ములుముడి గ్రామ వ్యూ

మా చేనేతల్లో గొప్పతనం



ఈ సంప్రదాయం మా చేనేతల్లో గొప్పతనాన్ని సమాజా నికి చూపుతుంది. అందరూ ఐక్యంగా ఉండటానికి దోహద పడుతోంది. మేమంతా ఉమ్మడిగానే నిర్ణయాలు తీసుకుంటాము.

- పముజుల హరి, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు

ఫలహారమేస్తే పని జోలికి వెళ్లం



మా కుటుంబాల్లో పెళ్లిళ్లకు ముందు ఫలహారమేస్తారు. అప్పుడిక పనిచేయం. శుభకార్యం జరిగే కుటుంబానికి సహా యంగా అందరం అండగా నిలిచి కార్యం గట్టెక్కిస్తాం. బయట ఊర్లకు వెళ్లినప్పుడు ఈ ఆచారం గురించి గొప్పగా చెప్తుంటారు. చాలా సంతోష మేస్తుంది.

- జక్కల సుబ్బయ్య, నేత కార్మికుడు, సొత్‌మోపూరు

చాలా గొప్పగా అనిపిస్తుంది



ఈ సంప్రదాయాన్ని నా చిన్నప్పట్నుంచి చూస్తున్నాను. చాలా గొప్పగా అనిపిస్తుంది. పలారం వేశారని తెలియగానే పని ఆపేసి శుభకార్యం జరిగే ఇంటి వారికి సహాయం చేయడం సంతోషంగా ఉంటుంది. ఇప్పటికీ దీనిని పాటించడం గొప్ప విషయం.

- బొగ్గల నవనీత, నేత కార్మికురాలు, ములుముడి

'సోమశిల' నీటిమట్టం

అనంతసాగరం (ఆంధ్రజ్యోతి): సోమశిల డ్యాంలో మంగళవారం నాటికి 52.510 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు 100 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

టీడీపీలో అందరికీ మార్గదర్శకుడు బీద

- రవిచంద్రకు పౌరసన్మాన కార్యక్రమంలో మంత్రి సత్యప్రసాద్

కావలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కష్టాల్లో పార్టీకి అండగా ఉండి టీడీపీలో అందరి నేతలకు మార్గదర్శకుడిగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర నిలిచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. మంగళవారం రాత్రి పట్టణంలోని సెల్ఫీపాయింట్ వద్ద రెండవసారి ఎమ్మెల్సీగా బీద రవిచంద్రకు పౌరసన్మానం జరిగింది. ముందుగా మంత్రి అనగానితోపాటు మరో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి, ఎమ్మెల్సీ బీద, ఎమ్మెల్యే వెంకటకృష్ణారెడ్డి తదితరులు గ్రంధి యానాదిశెట్టి విగ్రహం నుంచి ర్యాలీగా సెల్ఫీ పాయింట్ వద్దకు చేరుకుని సెల్ఫీలు దిగారు. అనంతరం జరిగిన సభలో మంత్రి సత్యప్రసాద్ మాట్లాడుతూ ఎన్ని కష్టాలు ఉన్నా పార్టీ మారకుండా జెండా మార్చకుండా సూర్యచంద్రులులా పార్టీకి అండగా ఉన్నారంటూ కొనియాడారు. మరో మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వైసీపీ పాలనలో పరిశ్రమలు జగన్‌ను చూసి భయపడి పారిపోయాయని కూటమి పాలనలో తండ్రీకొడుకులైన చంద్రబాబు, లోకేష్‌లలను చూసి రాష్ట్రానికి పరుగుల పెడుతున్నాయన్నారు. కావలి ప్రాంతానికి బీపీసీఎల్, ఇండోసెల్ కంపెనీలు రావడమే ఇందుకు నిదర్శనమన్నారు. ట్రబుల్ షూటర్‌గా ఎక్కడ పార్టీకి ఇబ్బందులు ఉంటే అక్కడ వాలి వాటిని పరిష్కరించటంలో రవిచంద్ర ముందుంటారన్నారు.

- ఎవరికీ భయపడే వాడ్ని కాదు : బీద

గత ఎన్నికలలో పోటీ చేయనందుకు తనపై అనేక ఊహలు వచ్చాయని రాజకీయాలలో తాను ఎవరికి భయపడే వాడిని కాదని ఎమ్మెల్సీ రవిచంద్ర అన్నారు. చంద్రబాబుకు మాట ఇచ్చానని ఓపిక ఉన్నంత వరకు సైకిల్ తొక్కుతూ టీడీపీతోనే ఉంటానని స్పష్టం చేశారు. తనకు ఈ రోజు పౌరసన్మానం చేసినా, మంత్రులుగా సత్యప్రసాద్, జనార్దన్‌రెడ్డిలు పదవులు పొందినా చంద్రబాబు ఆదరణతోనే ఈ గౌరవం దక్కిందన్నారు. కావలి మున్సిపాల్టీకి త్వరలో జరుగబోయే ఎన్నికలలో 40కి 40 వార్డులు కూటమికి గెలిపించే బాధ్యత ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిపై ఉందన్నారు. ఎమ్మెల్యే కృష్ణారెడ్డి మాట్లాడుతూ బీద త్యాగం చేయటం వల్లే తాను ఎమ్మెల్యే అయ్యానన్నారు. అనంతరం సర్వమత ప్రార్థనలు నిర్వహించి రవిచంద్రను ఆశీర్వదించారు. బీద రవిచంద్రను సన్మానించి వెంకటేశ్వర స్వామి విగ్రహాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.



బీద రవిచంద్రను సత్కరిస్తున్న మంత్రులు అనగాని, బీసీ జనార్దన్, ఎమ్మెల్యే కావ్య తదితరులు

మే 15 నుంచి రెండో పంటకు నీరివ్వాలి

కలువాయి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టులో రెండో పంట సాగుకు మే 15 నుంచి సాగునీరు విడుదల చేయాలని కోరుతూ రైతు సంఘా లు ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు సోమశిల ప్రాజెక్టు కమిటీ చైర్మన్ వేలూరు కేశవ చౌదరి తెలిపారు. రెండో పంటకు సాగునీరు విడుదలపై మంగళవారం కలువాయిలో రైతు సంఘాల ప్రతినిధులు, రైతులతో సోమశిల ప్రాజెక్టు అధికారులు సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలువకు మే 15 నుంచి నీరిస్తే సకాలంలో రైతులకు పంట చేతికి వస్తుందన్నారు. కాలువకు నీరు విడుదల చేసేందుకు ఇప్పటి నుంచి నెల మాత్రమే సమయం ఉందని, వెంటనే అధికారులు చర్యలు తీసుకుని కాలువలను సిద్ధం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయకట్టు రైతులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సమా వేశంలో సోమశిల ఆరో డివిజన్ ఈఈ ఈ.మల్లికార్జునరావు, డీఈలు ఎన్.సురేష్ కుమార్, ఎన్.అంకమరావు, సీహెచ్.సుధీర్, నీటి సంఘాల ప్రతినిధులు చల్లా విజయభాస్కర్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, టీడీపీ నా యకులు జీ.వెంకటేశ్వర్లు నాయుడు, చల్లా రఘురామిరెడ్డి, గడ్డం కిషోర్ రెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వేలూరు కేశవచౌదరి

మాలకార్పొరేషన్ చైర్మన్ నేడు రాక

నెల్లూరు(హరనాథపురం) : రాష్ట్ర మాల కార్పొరేషన్ చైర్మన్ పెదపూడి విజయకుమా ర్ బుధవారం నెల్లూరుకు వస్తున్నారని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వా దనాల వెంకటరమణ, నగర అధ్యక్షుడు కమతం అశోక్ ఓ ప్రకటన లో పేర్కొన్నారు. అంబేడ్కర్

సారా రహిత రాష్ట్రం ప్రభుత్వ లక్ష్యం

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నితీష్‌కుమార్



ఎక్సైజ్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న కమిషనర్ నితీష్‌కుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

కావలిరూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకు సారా నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కమిషనర్ నితీష్‌కుమార్ పేర్కొన్నారు. కావలి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మతో కలిసి ఆయన అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారా తయారీ, అమ్మకాల నియంత్రణకు ప్రభుత్వం నవోదయం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిందని, ఆ మేరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం స్టేషన్‌లోని రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ టీ.శ్రీనివాస రావు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, జిల్లా ఎక్సైజ్ అధికారి శ్రీనివాసు లునాయుడు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ రమేష్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జగదీశ్వర్‌రెడ్డి, కావలి ఎక్సైజ్ సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ దేవిక, సబ్ ఇన్స్‌పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్ ఫారంపై మహిళ మృతదేహం

కావలి రూరల్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కావలి రైల్వే స్టేషన్‌లోని 2-3 నెంబరు పాట్ ఫారంపై మంగళవారం సుమారు 35 ఏళ్ల గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని జీఆర్పీ పోలీసులు గుర్తించారు. ఎస్‌ఐ రమాదేవి తెలిపిన వివరాల మేరకు.. మృతురాలి వద్ద ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో యాచకురాలిగా అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. ఎస్‌ఐ రమాదేవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



మహిళ మృతదేహం

'ఉపాధి హామీ'లో రూ.91.46 లక్షల స్వాహా

- సామాజిక తనిఖీలో బహిర్గతం
- రూ.1.18 లక్షల రికవరీకి డ్వామా పీడీ ఆదేశం

లింగసముద్రం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : మండలంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పథకం పనుల్లో రూ.91.46 లక్షల స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీలో బహిర్గతం అయ్యింది. అయితే కేవలం రూ.1.18 లక్షల రికవరీకి ఉన్నతాధికారులు ఆదేశించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. వివరాల మేరకు... మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 2023 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2024 మార్చి 31వ తేదీ వరకు ఉపాధి పథకం కింద రూ.11.50 కోట్లతో పనులు చేశారు. అలాగే పంచాయతీరాజ్ పరిధిలో రూ.2 కోట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో రూ.16 లక్షలతో పనులు చేశారు. ఈ పనులపై గత నెల 18వ తేదీ నుంచి 31వ తేదీ వరకు సామాజిక తనిఖీ అధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేశారు. సదరు విచారణ నివేదికను మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో కే.శ్రీనివాసులు అధ్యక్షతన జరిగిన సామాజిక తనిఖీ బహిరంగ ప్రజావేదికలో డీఆర్‌పీలు వివరించారు. బోగస్ మస్టర్లు, భార్యాభర్తలకు, వివాహం కాని వారికి జాబ్ కార్డులు, పనుల కొలతల్లో తేడాలు, గ్రామాల్లో లేని వారి పేర్లతో నిధులు స్వాహా చేశారని గుర్తించి బహిర్గతం చేశారు. ఈ విధంగా సుమారు రూ.91,46,342 స్వాహా చేశారని తనిఖీ అధికారులు తేల్చారు.

- పంచాయతీల వారీగా అక్రమాలు

మండలంలోని ఎర్రారెడ్డిపాలెంలో రూ.19,45,897, చినపవనిలో రూ.18,60,758, మొగిలిచెర్లలో రూ.11,97,369, లింగసముద్రంలో రూ.8,67,589, పెదపవనిలో రూ.5,33,188 అక్రమాలు జరగ్గా, మిగిలిన పంచాయతీల్లో రూ.1.50 లక్షల నుంచి నాలుగు లక్షల వరకు అవకతవకలు ఉన్నట్లు తేల్చారు. అలాగే చినపవనిలో ఫ్లడ్ బండు వేయకుండానే 3 పనులకు రూ.13 లక్షల చెల్లించనట్లు గుర్తించారు. అక్కడ జామాయిల్ తోట ఉన్నట్లు తేల్చారు. ఇదే గ్రామంలో ఒక ఫీడర్ చానల్‌లో 892 మీటర్ల పనులు చేయకుండానే పనులు చేసినట్లు సృష్టించి రూ.94,367 చెల్లించినట్లు గుర్తించారు. అలాగే లింగసముద్రంలో లలిత, సుభద్రమ్మ, శ్రీనివాసులు, సుశీలమ్మలకు పనులకు వెళ్లకుండానే 24 రోజులకు రూ.10 వేలు చెల్లించినట్లు గుర్తించారు. అలాగే ఎర్రారెడ్డిపాలెంలో కూడా 6 పనులకు కొలతల్లో తేడాలతో సుమారు రూ.15 లక్షల వరకు అక్రమాలు జరిగినట్లు తేల్చారు. ఇంకా పలు గ్రామాల్లో బోగస్ మస్టర్లతో నిధులు స్వాహా చేసిన ఘటనలు కోకొల్లలుగా వెలుగు చూశాయి. లింగసముద్రంలో రూ.1,15,691 ఖర్చు చేసి వేసిన మొక్కలు చనిపోయాయి. వీటన్నింటిపై స్పందించిన డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని చనిపోయిన మొక్కలను తిరిగి నాటాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందుకు గాను వారికి రూ.65,700 జరిమానా విధించారు.



ప్రజా వేదికలో ఉపాధి హామీ సిబ్బందిని విచారిస్తున్న డ్వామా పీడీ గంగాభవాని, ఇతర అధికారులు

- రూ.1,18,450 రికవరీకి ఆదేశం

సామాజిక తనిఖీ విచారణ అనంతరం పీడీ గంగాభవానీ ఉపాధి హామీ అక్రమాలకు సంబంధించి సిబ్బంది నుంచి రూ.1,18,450 రికవరీ చేయాలని అధికారులను ఆదేశించారు. సక్రమంగా లేవని రికార్డులు వారం రోజుల్లో సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. రోజుకు రూ.5 వేల మంది కూలీలు పనులకు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విజిలెన్స్ అధికారి విజయలక్ష్మి, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఏపీడీ బాబూరావు, ఎస్ఆర్పీ బుజ్జి, ఏపీ వోలు అబ్దుల్లా, సమీర్‌బాషా సిబ్బంది పాల్గొన్నారు.

మల్లూరు భూవివాదంపై విచారణ

ముత్తుకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):మల్లూరులో గత ప్రభుత్వహయాంలో జరిగిన రీసర్వేలో ఇద్దరి మధ్య తలెత్తిన భూ వివాదంపై మంగళవారం తహశీల్దారు స్వప్న కార్యాలయంలో విచారణ చేపట్టారు. మేకల శ్రీలక్ష్మికి చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన భూమిలేని వేల్పుల సునందమ్మ పేరుతో రికార్డు చేశారన్నారు. విచారణలో వేల్పుల సునందరమ్మ తన పేరుతో ఉన్న 27సెంట్లు తనది కాదని, తన పేరుతో రికార్డుల్లో తప్పుగా వచ్చిందని స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ భూమి మేకల శ్రీలక్ష్మికి చెందుతుందని ఆ మేకు రికార్డుల్లో పేరు నమోదు చేస్తామన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8506
వెండి కిలో ధర	రూ. 92,500
వెండి ఒక గ్రాము	రూ.95.50

ఎడగారు సాగుకు సన్నద్ధం

● వచ్చే నెలలో రెండో కారుకు ప్రయత్నాలు
● దుక్కి చేసే పనిలో రైతుల బిజీ

కోవూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):ఎడగారు పంట పండించేందుకు కనిగిరి రిజర్వాయర్ పరిధిలోని రైతులు సిద్ధం అవుతున్నారు. రాష్ట్రంలో మామూలుగా జూన్ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతుంది. కానీ జిల్లాలోని సోమశిల జలాలు వినియోగించే రైతులు ఏప్రిల్ రెండోవారం లేదా మే మొదటివారంలోగా రెండోపంట సాగుచేసేందుకు సన్నద్ధం అవుతారు. వ్యవసాయశాఖ పరిభాషలో దీన్ని ముందస్తు ఖరీఫ్ ఖరీఫ్ సాగు అంటారు. వర్షాల ఆధారంగా నాలుగునెలల పంటకు ప్రాధాన్యతనిస్తారు. మే నెల మొదటివారానికి ప్రా రంభమైన ఈ పంట సాగు ఆగస్టు నెలాఖరులోగా పంటల దిగుబడులు చేతికందుతాయి. ఆగస్టు నెలాఖరు నుంచి జిల్లాలోవర్షాలు పడతాయి. ఈ సీజన్‌లో కేఎన్‌ఎం 1638, 1010రకాల వరి సాగుచేసేందుకు రైతులు దృష్టిపెట్టారు. అధిక ఉష్ణోగ్రతల్ని తట్టుకుని నిలబడాల్సిన పంటను పండించాల్సి ఉన్నా రైతులు కేఎన్‌ఎం 1638 రకానికే మొదటి ప్రాధాన్యత ఇస్తారు. గత సీజన్‌లో ఈ రకానికే ప్రాధాన్యతనిచ్చారు.

శ్వేత ఎన్‌ఎల్‌ఆర్ 40024 ఎంచుకోండి

ఎడగారులో అధిక ఉష్ణోగ్రతల్ని తట్టుకు నేందుకు శ్వేత ఎన్‌ఎల్‌ఆర్ 40024 ను ఎంపిక చేసుకోవాలి. వ్యవసాయశాఖ 91లావులు, 91సన్నాలు వేసుకోమని సూచిస్తోంది. రైతులు కే ఎన్ ఎం 1638 వేసేందుకు సిద్ధపడుతున్నారు. గత సీజన్‌లో కేఎన్‌ఎం 1638బీపీటీ రకం బాగా పండాయి. కేఎన్ ఎం 1638 రకానికి పుట్టి ధర రూ.19వేలు పలకడంతో ఇదే రకాన్ని పండిస్తామని చెబుతు న్నారు.



\- ఇందిరావతి, వ్యవసాయాధికారి, కోవూరు



పొలాన్ని దున్నుతున్న అన్నదాత

క్రీడాకారుల కల నేరవేరేనా?

● గొలగమూడి సమీపంలో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు చర్యలు
● 50ఎకరాలను క్రికెట్ బోర్డుకు అప్పగింత
● వివిధ సమస్యలతో ఇప్పటికీ ప్రారంభం కాని పనులు



క్రికెట్ స్టేడియం కోసం గొలగమూడి వద్ద సేకరించిన భూములు

వెంకటాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని గొలగమూడి సమీపంలో క్రికెట్ స్టేడియం నిర్మిస్తున్నట్లు గత టీడీపీ ప్రభుత్వం ప్రకటించడమే కాకుండా అందుకు అవసరమైన స్థలాన్ని సేకరించింది. కానీ ఇప్పటివరకు ఈ స్టేడియం నిర్మాణ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. ఆరేళ్ల క్రితం స్టేడియం నిర్మాణానికి ప్రభుత్వం 50ఎకరాలను రాష్ట్ర క్రికెట్ బోర్డుకు అప్పగించింది. అయితే ఆ భూములను ప్రభుత్వం గతంలో తమకు ఇచ్చిందంటూ గ్రామానికి చెందిన కొందరు భూసేకరణను అడ్డుకుని కోర్టును ఆశ్రయించారు. అయితే ప్రభుత్వం ఇచ్చిన భూములను లబ్ధిదారులు సాగు చేయనందున తిరిగి తీసుకోవడానికి ప్రభుత్వానికి అధికారం ఉంటుందని కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో భూసేకరణకు అడ్డంకి తొలగిపోయింది. స్థల సేకరణ పూర్తయింది. ఈ క్రమంలో స్టేడియం నిర్మాణం త్వరలో పూర్తవుతుందని క్రీడాభిమానులు ఆశించారు. కానీ ఆ భూముల వద్ద బోర్డును ఏర్పా టు చేసిన అధికారులు నిర్మాణ విషయాన్ని మాత్రం విస్మరించారు. ఈ క్రమంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం స్టేడియం నిర్మాణం చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్రీడాకారుల కలలు మళ్లీ చిగురించాయి. కూటమి ప్రభుత్వంలోనైనా తమ కల నేరవేరుతుందని వారు ఆశాభవం వ్యక్తం చేస్తున్నారు.

కోదండరాముడికి యాళీవాహన సేవ

బుచ్చిరెడ్డిపాళెం,ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):పెద్దూరులోని సీతా స మేత కోదండరాముడు మంగళవారం యాళివాహనసేవలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గ్రామోత్సవంలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త దొడ్ల మురళికృష్ణారెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మహిళలకు 'శక్తి' యాప్ రక్షణ కవచం

● డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మహిళలకు "శక్తి"యాప్ రక్షణ కవచమని రూరల్ సబ్ డివిజన్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు మంగళవారం బుచ్చిరెడ్డిపాళెం సిదార్థ జూనియర్ కాలేజీలో విద్యార్థినులు టౌన్‌లోని స్థానిక ప్రజలకు డీఎస్పీ "శక్తి" యాప్‌పైన అవగాహన సదస్సు నిర్వహించి యాప్ ప్రయోజనాలను వివరించారు. మహిళలు, యువతులు, బాలికలు యాప్‌ను ఫోన్లలోకి డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీసుల తక్షణ సహాయం పొందాలని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విద్యాసాగర్, శక్తి టీమ్ ఎఎస్ఐ సుబ్బరాజు, హెచ్‌సీ. శ్యామ్యూల్, పీసీలు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల్లో అవినీతి

పొదలకూరు,ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):పేదల కు పనులు కల్పించేందుకు కేంద్రం ప్రతిష్టాత్మ కంగా తీసుకొచ్చిన ఉపాధిహామీ పథకం అక్ర మార్కులకు ఉపాధివనరుగా మారింది. మండల ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు అధికారులతో కు మ్మక్కై రూ.కోట్లు, అవినీతికి పాల్పడి సొమ్మును మెక్కేశారు. ఈ పథకం పనుల్లో నకిలీ మస్టర్లు.. కొలతల్లో వ్యత్యాసాలు..వాలంటీర్లతో నగదు పం పిణీ ఇలా విధుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహ రించిన ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఆరుగురు ఫీల్డ్ అసిస్టెంట్లపై డ్వా మా పీడీ గంగాభవానీ వేటు వేశారు. 2023 ఏ ప్రిల్ నుంచి 2024 మార్చి వరకు రూ.18.95కో ట్లతో మండలంలోని గ్రామాల్లో 1,707పనులు జరిగాయన్నారు. పలు గ్రామాల్లో అవకతవకల పై రూ.74,08,805 అక్రమాలకు పాల్పడిన వారి నుంచి రికవరీకి ఆదేశించారు. వీటిలో ఉపాధి హామీ పథకం ద్వారా 1,451పనులు, పంచా య తీ రాజ్‌శాఖ ద్వారా 190, ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా 64పనులు, సామాజిక అటవీశాఖ ద్వారా రెండు పనుల్లో భారీ అక్రమాలకు పాల్పడ్డారు. నాహూరుపల్లి, విరువూరు గ్రామాల్లో అవినీతి చోటుచేసుకున్న ట్లు ఇటీవల జరిగిన సామాజిక తనిఖీల్లో వెలుగు చూసింది.

మండల మీట్‌కు అధికారుల డుమ్మా!

● ఆవేదన వ్యక్తం చేసిన ప్రజాప్రతినిధులు

నెల్లూరు (సైదాపురం),ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): మూడు నెలలకు ఓసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశానికి పలు కీలక శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. దీంతో అధికారుల తీరుపై ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ పలుగోటి పెంచలమ్మ అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై అధికారులతో ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. వేసవితో ప్రజలు తాగునీరు, సీజనల్ వ్యాధుల వల్ల ఇబ్బందులు పడకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. మూడు నెలలకు ఒక్కసారి జరిగే సమావేశానికి రెవెన్యూ, ఇరిగేషన్, అటవీ, పశుసంవర్ధక శాఖల అధికారులు గైర్హాజరుపై జడ్పీటీసీ పోలయ్య, సర్పంచులు మండిపడ్డారు. అధికారులు, సిబ్బంది లేనందున సమస్యలు ఎవరికి చెప్పాలన్నారు. తరచుగా మండలస మావేశానికి గైర్హాజరు అవుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఫైనింగ్ విషయంలో రెవెన్యూ అధికారులు సెలవుదినాల్లో కూడా పనిచేస్తున్నారని, గ్రామాల్లో భూసమస్యలపై రెవెన్యూశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని కలిచేడు సర్పంచు ఎస్. సురేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. ఊటుకూరులో విద్యుత్ సమస్య కోసం ఎన్నిసార్లు విన్నవించుకున్నా పట్టించు కోవడం లేదని వైస్ ఎంపీపీ భాస్కర్ తెలిపారు. ఎంపీడీవో శివకుమార్ మాట్లాడుతూ గైర్హాజరు అయిన అధికారులకు నోటీస్‌లు జారీ చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల శాఖాధికారులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు,ఎంపీటీసీలు, సచివాలయ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.



అధికారుల గైర్హాజరుపై ఆవేదన వ్యక్తం చేస్తున్న కలిచేడు సర్పంచు సురేష్‌బాబు

పునరుద్ధరణకు నోచుకునేనా!?

● నిరుపయోగంగా పున్నమి రెస్టారెంటు
● కసుమూరు భక్తుల కోసం

ఉపయోగంలోకి తేవాలంటున్న ప్రజలు

వెంకటాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని కసుమూరు సమీపంలో పర్యా టకశాఖకు చెందిన పున్నమి రెస్టారెంటును ఉపయోగంలో లేక నిరుపయోగంగా ఉన్నది. 2004 లో కేంద్రమంత్రిగా పనిచేసిన సమయంలో ముప్పవరపు వెంకయ్యానాయుడు దీని నిర్మాణానికి రూ.20లక్షలు మంజూరు చేయించారు. భవనంలో హోటల్‌తో పాటు వివాహాలు జరిపించేందుకు వీలుగా ఫంక్షన్ హాలు, అద్దె గదులను ఏర్పాటు చేశారు. పనులు పూర్తయిన అనంతరం కొంతకాలం ప్రైవేటు వ్యక్తులకు ఈ రెస్టారెంటును లీజుకు ఇచ్చారు. వారు పర్యవేక్షణ చేయలేక వదిలేయడంతో అప్పటినుంచి ఇది మూతపడింది. అప్పటినుంచి పట్టించుకునే అధికారులు లేరు. దీన్ని ఉపయోగంలోకి తీసు కొస్తే కసుమూరు మస్తాన్ వలి దర్గాకు వచ్చే భక్తులకు కూడా సౌకర్యవంతంగా ఉంటుంది. కాబట్టి అధికారులు ఈ హోటల్‌ను వినియోగంలోకి తీసుకురావాలని మండల ప్రజలు, కసుమూరు దర్గాకు వచ్చే భక్తులు కోరుతున్నారు.



నిరుపయోగంగా ఉన్న పున్నమి రెస్టారెంటు

● వినియోగంలోకి తీసుకరావాలి

కసుమూరు దర్గాకు భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. అందుకనుగుణంగా గ్రామంలో మంచి రెస్టారెంట్లు, హోటల్‌లు లేవు. అద్దె గదుల ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో లేవు. ఈ విషయంపై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పున్నమి రెస్టారెంటును వినియోగంలోకి తెస్తే భక్తులకు ఉపయోగకరంగా ఉంటుంది.

\- షేక్ మస్తాన్ బాషు, కసుమూరు

రూ.కోటితో అభివృద్ధి పనులు

● సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలో కోటిరూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. నియోజకవర్గంలో తెలుగుదేశం సభ్యత్వ నమోదును విస్తృతంగా చేపట్టాలని నాయకులకు సూచించారు. ఇప్పటికే సభ్యత్వం పొందిన వారికి మంగళవారం నగరంలోని ఆయన నివాసంలో ఐడీ కార్డులు పంపిణీ చేశారు. బూత్‌ల వారీగా క్లస్టర్, యూనిట్ బూత్ ఇన్‌చార్జులకు సభ్యత్వ కార్డులు అందచేశారు.



సభ్యత్వ కార్డుల బాక్సును అందచేస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

గడ్డివామి దగ్ధం : రూ.లక్ష ఆస్తి నష్టం

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి):స్థానిక దుర్గానగర్ దుర్గమ్మ ఆలయ సమీపంలోని ఓ గడ్డివామి మంగళవారం దగ్ధంఅయ్యింది. గడ్డివామి ఎలా తగలబడిందో తెలియరాలేదు. చూస్తుండగానే ఒక్కసారిగా మంటలు చుట్టుముట్టేసి తగలబడడంతో అదుపు చేసే వీలు లేకపోయిందని స్థానికులు చెప్పారు. తనకు సెంటు పొలం కూడా లేదని, 6ఎకరాలకుపైగా ఎండగడ్డిని కొని వేసిన గడ్డివామి తగలబడడంతో మూగజీవాలకు పశుగ్రాసంకు ఇబ్బందులు తప్పవంటూ పాడిరైతు సంపతి మురళి ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసకున్న టీడీపీ నాయకుడు బత్తల హరికృష్ణ ఘటనా స్థలానికి వచ్చి ఎకరం ఎండుగడ్డిని బాధిత పాడి రైతుకు ఇస్తామన్నారు. సమాచారం మేరకు వచ్చిన అగ్నిమాపక అధికారి అదనపు ఫైర్ అధికారి వేణుగోపాలరావు, హరిబాబు సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు.

పాముకాటుతో వార్డు సభ్యురాలి మృతి

● నివాళులర్పించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి):కొమ్మలపూడి వార్డుసభ్యురాలు కుదురు వెంకటరమణమ్మ(45) మంగళవారం పాముకాటుతో మరణించింది. గ్రామంలోని దళితవాడకు చెందిన ఈమె పొలంకు భర్త ఆదిశేషయ్యతో కలిసి వెళ్లింది. గడ్డికోసే సమయంలో నాగుపాము కాటేయడంతో గుర్తించి వెంకటరమణమ్మ కేకలు వేసింది. భర్త ఆదిశేషయ్య హుటాహుటిన స్థానికుల సహాయంతో ఆమె చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వెంకటరమణమ్మ మృతితో దళితవాడలో విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొమ్మలపూడికి చేరుకుని వార్డు సభ్యురాలి పార్థివదేహానికి నివాళులర్పించారు. భర్త, కుటుంబసభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, రామకృష్ణయ్య, మస్తాన్‌నాయుడు, మన్నెమాల భాస్కర్‌రెడ్డి, శ్రీనువాసులురెడ్డి, ఆదినారాయణరెడ్డి, సర్పంచు వేణుగోపాల్ పాల్గొన్నారు.

అందంగా ఆలయాల ముస్తాబు

మనుబోలు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): నేటినుంచి జరగబోయే శ్రీ కామాక్షితాయి సంగమేశ్వర బ్రహ్మోత్సవాలకు మంగళవారం మనుబోలులోని శివాలయం, బద్దెవోలు క్రాస్‌రోడ్డులోని సంగమేశ్వరాలయం ఆలయాలకు వెల్లవేసి అందంగా తీర్చిదిద్దారు. పరిసరాలను శుభ్రం చేసి విద్యుత్ దీపాలు వెలిగించేందుకు ఏర్పాట్లు చేయించారు. ఉత్సవాల నిర్వహణకు కావాలసిన సామగ్రిని సమకూర్చారు. శూలప్ప పయనం కార్యక్రమానికి గ్రామస్థులంతా బుధవారం సాయంత్రం శివాలయం వద్దకు రావాలని ఉత్సవాల పర్యవేక్షకుడు పచ్చిపాల రామిరెడ్డి కోరారు.

న్యూస్ బాక్స్

డిగ్రీ పరీక్షలో ఇద్దరి డీబార్

వెంకటాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధి లోని అనుబంధ కళాశాలలో మంగళవారం జరిగిన డిగ్రీ రెండవ సెమిస్టర్ పరీక్షలో ఇద్దరు విద్యార్థులు డీబార్ అయినట్లు వర్సిటీ పరీక్షల నిర్వాహణాధికారి ఆర్. మధుమతి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం జరిగిన పరీక్షలో 7,961 మంది విద్యార్థుల్లో 7,410మంది హాజరై 551మంది గైర్హాజరయ్యారు.నాయుడుపేట డిగ్రీ కళాశాలలో ఇద్దరు డీబార్ అయినట్లు తెలిపారు.

ఎమ్మెల్యే సోమిరెడ్డితో వీఎస్‌యూ వీసీ భేటీ

వెంకటాచలం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డితో మంగళవారం విక్రమ సిం హపురి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు భేటీ అయ్యారు. యూనివర్సిటీ ప్రాంగణంలో తాగునీటి సమస్య పరిష్కారంపై చర్చించారు. అనంతరం ఏప్రిల్ 30 నుంచి యూనివర్సిటీలో జరగబోతున్న జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల ఏర్పాట్లపై మాట్లాడారు. వీసీ వెంట వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఇందుకూరుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డేవిస్‌పేట, రాజేంద్రనగర్, జైన్ ఆలయంలో మెడికల్ ఆఫీసర్ కిషోర్‌కుమార్, బ్రహ్మేశ్వర్ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. జైన్ ఆలయానికి ఇతరరాష్ట్రాల నుంచి వచ్చే భక్తులకు వారంరోజులు ఉచిత వైద్య సేవలందిస్తారని హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్‌రావు తెలిపారు. కార్యక్రమంలో జైన్ ఆలయ మేనేజ్మెంట్ దీపక్ జైన్, ఏఎన్ఎం కెరోలిన్, సీహెచ్‌ఓ కమల, హెల్త్ అసిస్టెంట్ మాధవ పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

పొదలకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఆగ్నేష్ మల్టీపర్పస్ డెవలప్‌మెంట్ సొసైటీ, ఫ్రెండ్స్ ఆఫ్ ఆగ్నేష్ ఫౌండేషన్ నిర్వాహకులు నర్సింగు ప్రసాద్, మైఖేల్ సౌజన్యంతో పొదలకూరు పరిధిలోని లింగంపల్లి సంస్థ భవన పరిసర ప్రాంతాల్లోని 150మంది వృద్ధులు, పేద మహిళలకు మంగళవారం దుప్పట్లు, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా శివాజీ యూత్ ఫౌండేషన్ ఛైర్మన్ మోషూరు భాస్కర్‌నాయుడు మాట్లాడారు. 2018లో ట్రస్ట్‌ను మొదలుపెట్టి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గోల్డ్ అసోసియేషన్ అధ్యక్షుడు అంబూరు సీతారామయ్య, కైకపల్లి కుమార్, ఈవీఆర్ సీఫుడ్స్ అధినేత రవిచంద్ర, వాసు, శ్రీకాంత్, లక్ష్మణ్, యశ్వంత్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అవగాహన కల్పిస్తున్నాం

● సీహెచ్‌సతీష్, డీఈఈ, బుచ్చి



బుచ్చిరెడ్డి పాళెం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక సబ్ డివిజన్‌లో పరిధిలో స్మార్ట్‌మీటర్ల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని బుచ్చి డీఈఈ, సీహెచ్.సతీష్ తెలిపారు.

? స్మార్ట్ మీటర్లు ఎప్పటి నుంచి ఏర్పాటు చేస్తున్నారు..?

! 2024జూన్ నుంచి సంగం మండలంలో మొదలైంది. గతేడాది డిసెంబర్ నుంచి బుచ్చి టౌన్, బుచ్చి రూరల్, దామరమడుగు సబ్‌స్టేషన్ల పరిధిలో ప్రైవేటు కాంట్రాక్టర్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్నాం.

? ఇండస్ట్రియల్ వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నారా...?

! పాత మీటర్ల మాదిరిగానే స్మార్ట్ మీటర్ల పనితీరు ఉంటుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తాం.

? అధిక బిల్లులొస్తాయన్న ఆరోపణలపై ఏ చర్యలు తీసుకున్నారు.

! స్మార్ట్ మీటర్లతో అధిక బిల్లులు రావు. వినియోగదారులు ఎంత వాడితే అంత మాత్రమే బిల్లులు వస్తాయి. ఇండస్ట్రియల్ సర్వీసుదారులు ఐఎస్ఐ లాంటి నాణ్యమైన ఆటోమేటిక్ కెపాసిటర్లు ఉపయోగిస్తే ఆ మేరకు బిల్లులు వస్తాయి. కెపాసిటర్లు ఉపయోగించకుంటే రేయింబవళ్లు, విద్యుత్ వినియోగం మేరకు బిల్లులు అధికంగా వస్తాయి. విద్యుత్ అధికారులతో మెళకువలు తెలుసుకోవాలి.

C.R.I.M.E N.E.W.S

అడవిలో అగ్నికీలలు



దగ్ధమవుతున్న అటవీ ప్రాంతం

ఉదయగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి-బండగానిపల్లి ఘాట్ రోడ్డులోని అడవులు మంగళవారం అగ్నికి అహుతయ్యాయి. గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పుపెట్టడంతో విలువైన వృక్ష సంపద దగ్ధమవడంతోపాటు వన్యప్రాణులకు ప్రమాదం పొంచి ఉంది. రహదారి అగ్నికీలలు ఎగసిపడడంతో వాహనదారులు సైతం ఇబ్బందులు పడ్డారు. వేసవి కావడంతో ఉదయగిరి రేంజ్ పరిధిలో ప్రతిరోజూ ఏదో ఒక బీట్‌లో అడువులు అగ్నికి అహుతవుతున్నాయి. ఇటీవల అటవీ శాఖాధికారులు అడువులకు నిప్పు పెట్టరాదని, అడువుల సంరక్షణ ప్రతిఒక్కరి బాధ్యతని కళాజాతా కార్యక్రమం నిర్వహించినా ప్రయోజనం కరువైంది.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

సీతారామపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మంగళవారం సీతారామపురంలోని పోస్టాఫీసు వీధిలో ఓ ఇల్లు దగ్ధమైంది. స్థానికుల కథనం మేరకు, పోస్టాఫీసు వీధికి చెందిన గుజ్జుల శ్రీనివాసులు- రత్నమ్మ ఇటీవల జీవనోదారం కోసం తిరుపతికి వెళ్లారు. వారి పిల్లలిద్దరూ సోమవారం రాత్రి ఇంటిబయట బంధువులతో కలిసి నిద్రపోతుండగా, తెల్లవారుజామున ఇంట్లోని ఫ్రిడ్జ్ వద్ద షార్ట్ సర్క్యూట్ ఏర్పడి ఒక్కసారిగా మంటలంటుకున్నాయి. ఆ తర్వాత ఇంట్లోని విద్యుత్ తీగలన్నీ కాలిపోయాయి.ఆ సమయంలో ఇంట్లోని వస్తువులు సైతం కాలి బూడిదయ్యాయి.స్థానికులు వచ్చి మంటలను ఆర్పారు.అప్పటికే ఇల్లు మొత్తం కాలిపోయింది.

లాడ్జీలో ఉరేసుకుని యువకుడి మృతి

● మృతుడు ప్రకాశం జిల్లా పునుగోడు వాసి

కందుకూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలకు బానిసైన ఓ యువకుడు కందుకూరు పట్టణంలోని ఓ లాడ్జీలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు ప్రకాశం జిల్లా కనిగిరి నియోజకవర్గంలోని పునుగోడుకు చెందిన కల్లూరి శివనాగరాజు (26)గా పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పోలీసుల కథనం మేరకు.. బేల్దారి పనిచేసుకొంటూ జీవనం సాగించే శివనాగరాజు తండ్రి ఏడేళ్ల క్రితం మృతి చెందగా ఆ తర్వాత దుర్వసనాలు, బెట్టింగ్‌లు, ఆన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడిన తన స్థోమతకు మించి అప్పులు చేశాడు. గత కొన్నేళ్లుగా పనికి కూడా సక్రమంగా వెళ్లకుండా మేస్త్రీల వద్ద అడ్వాన్సులు తీసుకుని వారికి కనిపించకుండా తప్పించుకుని తిరగడం, బెట్టింగ్‌లు, ఇతర వ్యసనాలతో కాలం గడిపేవాడు. ఈ నేపథ్యంలో ఇటీవలి కాలంలో బె ట్టింగ్‌లలో మరికొంత సొమ్ము పోవడంతో మనస్థాపానికి గురై ఆత్మ హత్య చేసుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి ఫోన్ పరిశీలించగా అనేక బెట్టింగ్ యాప్‌లు ఉన్నట్లు గుర్తించామని, క్రికెట్ బెట్టింగ్‌లతో పాటు ఆన్‌లైన్ బెట్టింగ్ గేమ్‌లు ఆడటం, ఇతర దుర్వసనాలు ఉన్నట్లు కుటుంబసభ్యుల ద్వారా తెలిసిందని పట్టణ ఎస్ఐ సాంబశివయ్య తెలిపారు.

బంగారం చేయిస్తానని టోకరా

● డబ్బులు తీసుకుని ఉడాయించిన వ్యాపారి
● కందుకూరులో పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కందుకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కందుకూరులోని మారెమ్మమిట్ట ప్రాంతంలో బంగారు ఆభరణాలు తయారు చేసిస్తానని నమ్మబలికి మహిళల వద్ద నగదు తీసుకుని సలీం అనే వ్యక్తి ఉడాయించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. బూడిదపాలెంలో ఉంటున్న సలీం బంగారు ఆభరణాలు తయారు చేస్తుంటాడు. ఈ నేపథ్యంలో తన ఇంటి యజమానితోపాటు మరికొందరు మహిళల వద్ద రమారమి 20 లక్షల రూపాయలకుపైగా ఆభరణాలు చేయిస్తానని చెప్పి అడ్వాన్సులు తీసుకుని నెలక్రితం పరారయ్యాడు. 10, 15 రోజులు సలీం కోసం ఎదురుచూసిన మహిళలు ఆ తర్వాత ఫోనులో సంప్రదించినా అందుబాటులోకి రాలేదు. దీంతో ఒంగోలులో ఉంటున్న సలీం కుమారుడికి ఫోన్ చేయగా ఆభరణాలు తయారు చేస్తున్నాడని, త్వరలో వస్తాడంటూ కొన్నిరోజులు నమ్మబలికి ఆ తర్వాత చేతులెత్తేశాడు. దీంతో తాము మోసపోయామని గ్రహించిన మహిళలు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు కేసు నమోదుచేశారు. ఈ విషయమై పట్టణ ఎస్ఐ సాంబశివయ్యను వివరణ అడగ్గా సలీం కోసం గాలిస్తున్నామని త్వరలోనే పట్టుకుని సొమ్ము రికవరీ చేస్తామని తెలిపారు.

మిద్దె పైనుంచి పడి వ్యక్తి దుర్మరణం

సీతారామపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : మిద్దెపై నుంచి కింద పడి మండల పరిధిలోని గంగవరం గ్రామానికి చెందిన మేడిపోయిన చిన్న ఓబయ్య(45) మృతి చెందాడు. గ్రామానికి చెందిన చిన్న ఓబయ్య రోజులాగే సోమవారం మిద్దెమీద నిద్రపోయాడు.తెల్లవారుజామున మూత్రం పోయడానికి మిద్దె అంచుకు రాగా జారి కింద పడి మృతి చెందాడు.పోలీసులు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పంచనామాల కోసం ఉదయగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



ఓబయ్య మృతదేహం

మోటారుసైకిల్ అదుపుతప్పి..

కొండాపురం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్ అదుపుతప్పి పడి ఓ యువకుడు మృతి చెందిన ఘటన మంగళవారం మండలంలోని సాయిపేట పంచాయతీ కొమ్ముపాలెంలో జరిగింది. వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొంకుముడుసు ఎరుకలయ్య(39) కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. రోజులాగా పనికి వెళ్లి లింగసముద్రం మండలం పెద్దపవని గ్రామం నుంచి మోటారుసైకిల్‌పై వస్తూ చిన్నపవని గ్రామ పెట్రోల్ బంకు సమీపంలో మలుపు వద్ద అదుపుతప్పి రోడ్డుపై పడి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో కావలికి తరలించారు. ఎరుకలయ్య అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.



ఎరుకలయ్య మృతదేహం

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	110
స్కిన్ చికెన్	198
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 440

న్యూస్ బాక్స్

పాత పింఛను విధానాన్ని కొనసాగించాలి

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులకు పాత పింఛను విధానాన్ని కొనసాగించాలని విశ్రాంత ఏఎస్‌డబ్ల్యువో, భారత సేవా ఫౌండేషన్ జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం ఓ ప్రకటనలో కోరారు. కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులకు ప్రతీ ఐదేళ్లకు ఒక సారి పీఆర్సీ వేసి, ధరల పెరుగుదలకు అనుగుణంగా పెన్షన్ పెంపు, డీఏ చెల్లిస్తుందన్నారు. అయితే ఇటీవల ఏలాంటి పెంపులేని కొత్తపెన్షన్ విధానానికి ప్రభుత్వం పార్లమెంటులో ఆమోదం తెలిపిందన్నారు. దీనిని ఉపసంహరించుకోవాలని కోరారు.

వైసీపీ ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : సీతారాముల కల్యాణంలో సీతాదేవి ప్రతిమకు కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి మాంగల్య ధారణ చేయడాన్ని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ ఓ ప్రకటనలో ఆక్షేపించారు. ఎమ్మెల్యే స్వగ్రామమైన చిప్పగిరిలో రామ నవమి రోజు జరిగిన కల్యాణంలో పూజారి చేతిలోని మాంగల్యం తీసుకుని సీతమ్మ విగ్రహానికి కట్టి క్షమించరాని తప్పు చేశారని విమర్శించారు. దీనిని పోలీసులు సుమోటోగా స్వీకరించి ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్టు చేసి కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

తక్కువ ధరకు ఏసీ ఇప్పిస్తానంటూ మోసం

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : తక్కువ ధరకే ఏసీ ఇప్పిస్తానంటూ మోసం చేసిన వ్యక్తిపై చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. జెండావీధికి చెందిన షేక్ జాకీర్ ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఆన్‌లైన్‌లో దుర్గా నాయుడు అనే వ్యక్తి పరిచయం అయ్యాడు. రెండు నెలలు వాడిన ఏసీలు తక్కువ ధరకు ఇప్పిస్తానని నాయుడు నమ్మించాడు. దీంతో ఈ నెల 6వ తేదీన జాకీర్ ఐదు ఏసీలకు సంబంధించి రూ.65 వేలు నాయుడుకు ఫోన్‌పే చేశారు. కొద్దిసేపటి తర్వాత దుర్గా నాయుడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. దీంతో మోసపోయానని గ్రహించిన జాకీర్ మంగళవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ అయ్యప్ప కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఫోన్ చూడొద్దన్నందుకు వెళ్లిపోయింది

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ఎక్కువసేపు చూడొద్దంటూ తల్లిదండ్రులు మందలించడంతో ఓ యువతి అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయింది. పోలీసుల సమాచారం మేరకు... నగరంలోని కిసాన్ నగర్‌లో సురేష్ కుటుంబం నివసిస్తోంది. ఆయన కుమార్తె నగరంలోని ఓ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె ఎక్కువ సమయం ఫోన్ చూస్తుండటంతో ఇటీవల తల్లిదండ్రులు మందలించారు. మనస్థాపానికి గురైన యువతి ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గాలించినా కనిపించకపోవడంతో నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు దర్యాప్తు చేస్తున్నారు.

పవన్ కుమారుడి కోసం పూజలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రెండో కుమారుడు మార్క్ శంకర్ ప్రమాద గాయాల నుంచి త్వరగా కోలుకోవాలని కోరుతూ జనసేన పార్టీ నాయకులు మంగళవారం చిల్డ్రన్స్‌పార్క్ సమీపంలోని ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేశారు. పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్, నూనె మల్లికార్జున యాదవ్, ఈగి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో రాష్ట్ర గీతాన్ని పాడించాలి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల్లో మన రాష్ట్ర గీతం 'మా తెలుగుతల్లికి మల్లెపూదండ'ను విద్యార్థులతో ప్రతీరోజూ పాడించాలని మురుగపూడి ట్రస్ట్ అధ్యక్షుడు ఎం సతీష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం ట్రస్ట్ అధ్వర్యంలో రాష్ట్ర గీత రచయిత శంకరంబాడి సుందరాచారి వర్ధంతిని నగరంలోని ఆర్ఎస్ఆర్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మా తెలుగు తల్లికి మల్లెపూదండ గీతాలాపన పోటీలు నిర్వహించారు. ఆ గీతాన్ని పూర్తిగా ఆలపించిన ముగ్గురు విద్యార్థులకు బహుమతులిచ్చారు.

విజయకుమార్‌కు నివాళి

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : బలిజ సంఘం రాష్ట్ర నాయకుడు, మాధవయ్య అండ్ సన్స్ షోరూం అధినేత పసుపులేటి విజయ్‌కుమార్ 28వ వర్ధంతిని మంగళవారం నగరంలో నిర్వహించారు. పలువురు నాయకులు ఆయనకు నివాళులర్పించారు. గీతామయి వృద్ధుల ఆశ్రమంలో అన్నదానం చేశారు.





బాలాజీనగర్‌లో శేషవాహనంపై రామయ్య



హంస వాహనంపై సంతపేట హనుమాన్

త్యాగరాజ మందిరంలో హనుమంత వాహనంపై శ్రీరామచంద్రుడు

బంటుపై రామభద్రుడు

- కొనసాగుతున్న శ్రీరామ నవమి ఉత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పలు రామాలయాలు, ఆంజనేయ స్వామి ఆలయాల్లో శ్రీరామ నవమి ఉత్సవాలు, వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం కొనసాగాయి. ఈ సందర్భంగా విశేష పూజలు, అలంకరణలు జరిగాయి.

- వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరంలో హనుమంతసేవ, ప్రాకారోత్సవం కన్నుల పండువగా జరిగాయి. ఉదయం తిరుమంజనం సేవ, సాయంత్రం ఊంజల్‌సేవ నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
- బాలాజీనగర్ సీతారామ మందిరంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో మంగళవారం ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, పూలంగిసేవ జరిగా యి. రాత్రి శేష వాహన అలంకారంలో పేట ఉత్సవం భక్తులకు కనువిందు చేసింది. ఉభయకర్తలుగా తాతా వెంకట కిషోర్, హేమలత వ్యవహరించా రు.
- సంతపేట ఆంజనేయ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో స్వామి వారికి హంస వాహనంలో నగరోత్సవం జరిగింది. ఉదయం అభిషేకాలు, విశేష పూజలు, రాత్రి పూలంగిసేవ జరిగాయి.
- ఉస్మాన్‌సాహెబ్‌పేట కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో ఉదయం ధ్వజారోహణం శాస్త్రోక్తంగా జరిగింది. సంతానం లేనివారికి కొడిముద్దలు పంపిణీ చేశారు. సాయంత్రం విశేష పూజలు, పూలంగిసేవ, శేషవాహనంపై పేట ఉత్సవం జరిగాయి.

కాంట్రాక్టర్లకు బిల్లులివ్వండి

- కమిషనర్‌కు మంత్రి నారాయణ ఆదేశం



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి) : పనులు చేసిన కాంట్రాక్టర్లకు వెంటనే బిల్లులు చెల్లించాలని నెల్లూరు నగర పాలక సంస్థ కమిషనర్ సూర్య తేజను పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. మంగళవారం ఆయన క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. పనులు చేస్తున్న వారిని గుర్తించి వెంటనే బిల్లులు క్లియర్ చేయాలన్నారు. బిల్లులు పొందిన కాంట్రాక్టర్లు మిగిలిన పనులను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేసే బాధ్యతనూ తీసుకోవాలని సూచించారు. తల్లి. తండ్రిలేని పేద పిల్లలను గుర్తించి, ఆదర్శవంతంగా తయారు చేస్తున్న వీఆర్ హైస్కూల్లో వారికి అడ్మిషన్లు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థుల కోసమే ఎలక్ట్రిక్ బ స్సును కూడా త్వరలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు మంత్రి చెప్పా రు. వీధి కుక్కలకు ఏబీసీ వ్యాక్సిన్లను 200 రోజుల కార్యక్రమంగా చేపట్టాల న్నారు. ప్రభుత్వ భూముల జోలికి ఎవరూ వెళ్లవద్దని పార్టీ నాయకులకు సూచించారు. నగరంలో ఎవరైనా అవినీతికి పాల్పడితే ఊరుకునే ప్రసక్తేలేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ టీ అనురాధ, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్‌తో కరెంటు బిల్లుల చెల్లింపు

- విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్

నెల్లూరు (జడ్పీ), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : కరెంటు బిల్లులో ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆ బిల్లు మొత్తాన్ని చెల్లించవచ్చని విద్యుత్ శాఖ ఎస్ఈ విజయన్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నెల్లూరు నగర వినియోగదారులకు మాత్రమే ఈ అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఫోన్ పే, గూగుల్ పే, పేటియం ద్వారా క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఈ పద్ధతిని త్వరలో జిల్లా అంతటా అమలు చేస్తామని తెలిపారు. ఆన్‌లైన్‌లో బిల్లుల చెల్లింపుతో కొన్ని మోసాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టి సులభతరంగా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు నూతన పద్ధతిని ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అలాగే అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు 50 శాతం రాయితీ ఉన్నందున, దీనిని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నగరంలోని ములుముడి బస్టాండ్ ఫీడర్‌లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్నందున బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ ఎం శ్రీధర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండపాల వీధి, సుందరగిరి వారి వీధి, వేముగుంట వారి వీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదని తెలిపారు.

వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలకు ధ్వజారోహణ



ధ్వజారోహణ చేస్తున్న అర్చక బృందం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. రెండోరోజు మంగళవారం ధ్వజారోహణం, విశేష పూజలు, కోడిముద్దల వితరణ జరిగాయి. సాయంత్రం పూలంగిసేవ, విశేష పూజలు జరిగాయి. రాత్రి స్వామివార్లకు శేషవాహన అలంకారంలో పేట ఉత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, తుమ్మల సుమన్ తేజరెడ్డి, ఆనం చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెం లక్ష్మీనాథ్‌రెడ్డి, ఆలయ సహాయ కమిషనర్ జే శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

ఘనంగా పంగున్యోత్తర ఉత్సవాలు

నగరంలోని తల్పగిరి రంగనాథ స్వామి ఆలయంలో పంగున్యోత్తర కల్యాణ ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం తాయార్లకు తిరుమంజనం, విశేష పూజలు జరిగాయి. సాయంత్రం స్థల పురాణం పఠనం, రంగనాథ స్వామికి, తాయార్లకు ప్రాకారోత్సవం, ఊంజల్‌సేవ నిర్వహించారు. ఈవో ఏవీ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

హోరాహోరీగా ఎస్‌పీఎల్

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, నెల్లూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ సహకారంతో బుజబుజ నెల్లూరులోని సీఏ క్రీడా మైదానంలో జరుగుతున్న సింహపురి ప్రీమియర్ లీగ్ (ఎస్‌పీఎల్) టీ-20 క్రికెట్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో కావలి సన్‌రైజర్స్, నెల్లూరు రూరల్ కింగ్స్ తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్ చేసిన కావలి జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 207 పరుగులు సాధించింది. అనంతరం రూరల్ టీం 19.2 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ జట్టులోని ఐపీఎల్ క్రీడాకారుడు అశ్విన్ హెబ్బార్ 99 పరుగులతో నాటౌట్ గా నిలిచి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు దక్కించుకున్నాడు. రెండవ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన ఆత్మకూరు రేంజర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 126 పరుగులు సాధించింది. అనంతరం సర్వేపల్లి సూపర్‌జైంట్స్ జట్టు 16 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 130 పరుగులు చేసి విజేతగా నిలిచింది. ఈ మ్యాచ్‌లను ఎన్‌డీసీఏ సంయుక్త కార్యదర్శి కే మునిగిరీష, కోశాధికారి ఎస్‌కే అబుబాకర్, కేర్‌టేకర్ డీ శ్రీనివాసరెడ్డి, ఏసీఏ సభ్యుడు పీ భానుప్రకాష్‌రెడ్డి, టోర్నీ నిర్వాహక కమిటీ చైర్మన్ కే వంశీకుమార్ తదితరులు పర్యవేక్షించారు.

పాలిసెట్ పుస్తకాల పంపిణీ

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : వెంకటేశ్వరపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ పరీక్షకు శిక్షణ పొందుతున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ రామారావు మంగళవారం ఉచితంగా పుస్తకాలను అందచేశారు. పాలిటెక్నిక్‌తో ఎన్నో ఉపాధి, ఉద్యోగావకాశాలు అందుబాటులో ఉన్నాయని, సాంకేతిక విద్యతో ఉజ్వల భవిత ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సుజాత, మురళి, సోమశేఖర్, చంద్రకళ పాల్గొన్నారు.



పుస్తకాలు అందచేస్తున్న ప్రిన్సిపాల్ రామారావు

రేపు అబీద్‌బాబా గంధమహోత్సవం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): స్థానిక కొనకాలువ దగ్గర వెలసిఉన్న హజరత్ సూఫీ మొహమ్మద్ జైనుల్లాబిదీన్ ఖాదరివుల్ చిస్తిబాబా (అబీద్ బాబా) 22వ గంధమహోత్సవం గురువారం జరగనుంది. శుక్రవారం హక్కుదారుడైన సయ్యద్ అన్ సారిహుసేని ఇంటి వద్ద నుంచి ఫకీరు జరుబులు, బాణసంచా పేలుళ్ల మధ్య ఊరేగింపుగా గంధం దర్గాకు చేరుతుందని నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం భక్తులకు గంధాన్ని పంచి పెట్టనున్నారు.

ఇంత మందున్నారు.. ఎందుకు?

- రోడ్లపై చెత్త, కాలువల్లో పూడిక అలాగే ఉన్నాయి
- ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలపై కమిషనర్ ఆగ్రహం

నెల్లూరు(సిటీ), ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య విభాగంలో ఇంతమందున్నారు ఎందుకు..? రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే ఉంది. కాలువల్లో పూడిక అలాగే ఉంది. ఏం చేస్తున్నారు మీరంతా..? అంటూ కార్పొరేషన్ కమిషనర్ సూర్యతేజ పారిశుధ్య విభాగం ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీల పై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం 29వ డివిజన్ పరిధిలోని గాంధీనగర్, సుభాష్‌చంద్రబోస్ నగర్, రామచంద్రారెడ్డి నగర్ తదితర ప్రాంతాల్లో ఆయన ఆకస్మికంగా పర్యటించారు. పారిశుధ్య పనులను పరిశీలించారు. రోడ్లపై చెత్త, కాలువల్లో పేరుకుపోయిన పూడికను చూసి మండిపడ్డారు. ఎక్కడెక్కడ చెత్త, పూడిక ఉందో తాను ఫొటోలు తీసుకున్నా నని, మళ్లీ రేపు వచ్చి చూస్తానని, అప్పటికీ ఇలాగే ఉంటే మీ అందర్నీ సస్పెండ్ చేయాల్సి ఉంటుందని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు.

ఎంఆర్పీ వైన్స్‌కు రూ. 20 వేలు జరిమానా

నగరంలోని 45, 18, 5 డివిజన్లలో పారిశుధ్య పనులను ఎంహెచ్‌వో చైతన్య పరిశీలించారు. మైపాడురోడ్డు ప్రాంతంలోని ఎంఆర్పీ వైన్స్ వద్ద నిషేధిత ప్లాస్టిక్ గ్లాసులు, వాటర్ ప్యాకెట్లను గమనించి సదరు దుకాణం యజమానికి రూ. 20 వేలు జరిమానా విధించారు. ఆత్మకూరు బస్టాండ్ వద్ద రోడ్డుమీద పూల వ్యాపారం చేస్తున్నవారు చెత్త అక్కడే వేయడం, నార అధికంగా ఉండటంపై మండిపడ్డారు. వారందరికీ జరిమానా విధించాలని శానిటేషన్ సెక్రటరీని ఆదేశించారు. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో ఏడీసీ నందన్ పారిశుధ్య పనులను పరిశీలించారు.



29వ డివిజన్‌లోని డ్రైనేజీ కాలువలో పూడికను పరిశీలిస్తున్న నగర కమిషనర్ సూర్యతేజ

50వ రోజుకు చేరిన 'గడప గడపకు'



కొత్తకాలువ సెంటర్లో భారీ కేక్ కట్ చేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 8, (ఆంధ్రజ్యోతి) : రూరల్ నియోజకవర్గంలో స్థానిక సమస్యలు తెలుసుకుని పరిష్కరించడమే లక్ష్యంగా టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి చేపట్టిన గడప గడపకు కార్యక్రమం మంగళవారం 50వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నగరంలోని కొత్త కాలువ కూడలి వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి 50 కేజీల కేక్‌ను గరిధర్‌రెడ్డి కట్‌చేశారు. ప్రస్తుతం ఎలాంటి ఎన్నికలు లేకపోయినప్పటికీ గతేడాది ఎన్నికల్లో ఓట్లేసి తన సోదరుడు శ్రీధర్‌రెడ్డిని మూడవ సారి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలను పలకరించి వారి సమస్యలు పరిష్కరించడం తన బాధ్యతన్నారు. అనంతరం గడప గడప కార్యక్రమాన్ని కొనసాగించారు.

బైకుల చోరీపై కేసుల నమోదు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని దుండగలు బైకులు అపహరించుకు వెళ్లిన ఘటనలపై చిన్నబజారు పోలీసులు మంగళ వారం కేసులు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. ట్రంకురోడ్డు ఎంవీ అగ్రహారానికి చెందిన పట్టాభి శ్యామ్‌సుందర్ మెడికల్ రెప్‌గా పని చేస్తున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఆయన ఇంటిముందు బైక్ పార్క్‌చేసి ఉండగా గుర్తుతెలియని దుండగులు అపహరించుకొని వెళ్లారు. వెంకటేశ్వరపురానికి చెందిన వెంకట సుబ్బయ్య గతేడాది సెప్టెంబరులో ఆర్టీసీ బస్టాండు సమీంపలోని మీసేవా కేంద్రం వద్ద తన బైక్‌ను పార్క్‌చేసి పని నిమిత్తం బస్టాండులోకి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి బైక్ కనిపించలేదు. ఈ మేరకు బాధితులు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసులు నమోదు చేశారు.

మెరిట్ కమ్ రోస్టర్‌ను అమలు చేయాలి

- స్పాట్ కేంద్రం ఎదుట బీటీఏ నిరసన

నెల్లూరు(విద్య), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ పదోన్నతుల్లో మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్ని అమలు చేయాలని బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నగరంలోని దర్గామిట్ట జడ్పీ పాఠశాలలో జరుగుతున్న టెన్త్ స్పాట్ కేంద్రం ఎదుట మంగళవారం నిరసన తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్ మాట్లాడుతూ ఇప్పటి వరకు కొనసాగిస్తున్న మెరిట్ కమ్ రోస్టర్ విధానాన్నే కొనసాగించి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళా ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షం లో ఉద్యమిస్తామ ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర వ్యవస్థాపకుడు నూకలపాటి రమణయ్య, ఉపాధ్యక్షుడు మనోజ్‌కుమార్, జిల్లా అధ్యక్షకార్యద ర్శులు మణిసుబ్బు, మాసా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార వినియోగంపై అవగాహన కల్పించండి

- పోషకాహార పక్షోత్సవ ప్రారంభంలో సీడీపీవో



పోషకాహార పక్షోత్సవాల పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి, అంగన్‌వాడీ సిబ్బంది

నెల్లూరు (హరనాథపురం), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి) : పౌష్టికాహార వినియోగంపై గర్భిణులు, చిన్న పిల్లల తల్లులకు అవగాహన కల్పించి వారు పౌష్టికాహారం తీసుకునేలా కృషి చేయాలని అర్బన్ సీడీపీవో లక్ష్మీదేవి అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. మంగళవారం ఆమె కార్యాలయంలో పోషకాహార పక్షోత్సవాన్ని ప్రారంభించారు. ఈ పక్షోత్సవాలలో గర్భస్థ దశ నుంచి 2 సంవత్సరాల వరకు ఉన్న గర్భిణులు, పుట్టిన పిల్లల సంరక్షణపై శ్రద్ధ వహించాలన్నారు. పిల్లల్లో ఊబకాయాన్ని తగ్గించటానికి ఆరోగ్యకరమైన జీవనశైలి అలవాటు చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు.



మమ్మల్నీ గమనించుకోండి!



నగరంలోని ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కుక్కలు, కోతుల సంచారం ఎక్కువైంది. క్యాజువాలిటీతోపాటు వార్డుల్లోనూ ఇవి యథేచ్ఛగా తిరిగేస్తు న్నాయి. వానరాలైతే, రోగుల కోసం వారి బంధువులు తీసుకొచ్చిన తినుబండారాలు, పండ్లు, ఇతర ఆహార పదార్థాలను లాక్కెళ్లిపోతున్నాయి. మమ్మల్నీ కాస్త గమనించుకోండి అన్నట్లు శునకాలు వార్డుల్లో గేటు వద్దే కాపలా కాస్తున్నాయి. కుక్కలు, కోతుల సంచారాన్ని అరికట్టాలని సందర్శకులు కోరుతున్నారు.

ఫొటోలు : స్టాఫ్ ఫొటోగ్రాఫర్

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5

తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 9 ఏప్రిల్ 2025

ఇవీ జగనన్న కట్టిన ఊర్లు



రేణిగుంట జీవకోనలో ఇళ్ల పరిస్థితి

పునాదుల దశలో కొన్ని. గోడల వరకు మరికొన్ని. స్లాబులు అయినవి ఇంకొన్ని. మొదలు కాని ఇళ్లు మరెన్నో? పూర్తయింది మాత్రం అతి స్వల్పం. మౌలిక వసతుల్లేక.. లే అవుట్లలో చెట్లు, ముళ్ల పొదలు పెరిగిపోయి, అక్కడక్కడ నివాస మున్న వారు బిక్కుబిక్కుమంటు న్నారు. ఇంకొన్ని లేఅవుట్లయితే చిట్టడివిని తలపిస్తున్నాయి.

మేం ఇళ్లు కాదు.. ఊర్లే నిర్మిస్తున్నాం.. అంటూ సీఎంగా జగన్ చేసిన ప్రకటన. ఇప్పుడు క్షేత్రాయిలో ఆ ఊర్లు ఎలా ఉన్నాయనేది 'ఆంధ్రజ్యోతి బృందం' పరిశీలించింది. పేదల సొంతింటి కలను భగ్నం చేసిన నాటి ప్రభుత్వ తీరు, ఆయా లేఅవుట్ల సచిత్ర కథనం.. 6లో

ఇంటర్ విద్యార్థులకు సకాలంలో పుస్తకాలు

- 8,293 టెక్స్..
 1,25,820 నోట్ బుక్స్ సరఫరా



ఎస్వీ జూనియర్ కళాశాలలో పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఆర్ఐవో జీవీ ప్రభాకరరెడ్డి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు సకాలంలో ఉచితంగా పుస్తకాలను అందజేస్తామని కూటమి ప్రభుత్వం చెప్పినట్టుగానే.. ఈ విద్యాసంవత్సరం అందజేసింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో విద్యా సంవత్సరం గడిచిపోయినా పుస్తకాలు సరఫరా చేయక విద్యార్థులు ఇబ్బంది పడేవారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్.. కాలేజీలు ప్రారంభమయ్యే సరికే పుస్తకాలు అందించారు. సాధారణంగా జూన్‌లో జూనియర్ కళాశాలలు ప్రారంభమయ్యేవి. కూటమి ప్రభుత్వం విద్యా విధానంలో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఏప్రిల్ ఒకటి నుంచే ఇంటర్ ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. అంటే.. రెండు నెలలు ముందే తరగతులు ప్రారంభమైనా ఏమాత్రం ఆలస్యం లేకుండా ప్రభుత్వం టెక్స్, నోట్ పుస్తకాలను సరఫరా చేసింది. జిల్లాలో 21 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1,216 మంది ద్వితీయ సంవత్సరం ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఉన్నారు. వీరికి 8,293 పాఠ్య పుస్తకాలను మంగళవారం ఆర్ఐవో జీవీ ప్రభాకరరెడ్డి అందజేశారు. సుమారు 1400 మంది తెలుగు మీడియం విద్యార్థులకు మరో వారం, పది రోజుల్లో పుస్తకాలను పంపిణీ చేయనున్నారు.

61 కళాశాలలకు 1,25,820 నోటుపుస్తకాలు

21 ప్రభుత్వ జూనియర్ కళాశాలలతోపాటు ఏపీ మోడల్ స్కూల్స్ 5, ఏపీఆర్‌జేసీ 1, కేజీబీవీ 5, హైస్కూల్ ప్లస్ 29 కలుపుకొని.. అన్ని ప్రభుత్వ యాజమాన్య కళాశాలలు 61 ఉన్నాయి. వీటిలోని విద్యార్థులకు 1,25,820 నోటు పుస్తకాలను అందజేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమయ్యే నాటికి ఎన్‌సీఈఆర్టీ సిలబస్‌తో కూడిన పుస్తకాలను సరఫరా చేసేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోందని ఆర్ఐవో తెలిపారు.

'లాసెట్'కు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ఏపీ లాసెట్- 2025 కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మూడు, ఐదేళ్ల ఎల్ఎల్‌బీతో పాటు రెండేళ్ల ఎల్ఎల్ఎం కోర్సులో చేరేందుకు ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 27వ తేదీ దరఖాస్తుకు చివరి గడువు. వివరాలకోసం 'ఏపీలాసెట్' వెబ్‌సైట్ చూడాలని లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ సీతాకుమారి తెలిపారు.

నేడు రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ అధికారుల సదస్సు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి అతిథి గృహంలో బుధవారం రాష్ట్ర స్థాయి ఎక్సైజ్ అధికారుల సదస్సు జరగనుంది. ఈ సదస్సుకు మంత్రి కొల్లు రవీంద్ర, ఎక్సైజ్ ప్రధాన కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, డైరెక్టర్ నిషాంత్ కుమార్, అన్ని జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, సూపరింటెండెంట్లు, ఏఈఎస్‌లు, సీఐలు, అధికారులు హాజరుకానున్నారు. నవోదయం-2 అమలు, పొరుగు రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రాకుండా అరికట్టడం, బెల్టు షాపులు కనిపించకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించనున్నారు. గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడంపైనా చర్చించనున్నారు.

త్వరలోనే అన్ని నామినేటెడ్ పదవుల భర్తీ

- తమది కార్యకర్తల పార్టీ అన్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా



తిరుపతి, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): స్టేట్ యూనిట్‌గా కొన్ని.. జిల్లా యూనిట్‌గా మరికొన్ని తీసుకుని త్వరలోనే అన్ని నామినేటెడ్ పదవుల భర్తీ ఉంటుందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. కార్యకర్తల పార్టీగా టీడీపీ ఉంటుందన్నారు. తిరుపతిలోని పార్లమెంటు టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మంత్రులు, రాష్ట్ర స్థాయి పదవులు పొందినవారు సమయం ఉన్నప్పుడు పార్లమెంటు కార్యాలయాలకు వెళ్లాల్సి వుంటుందన్నారు. అందులోభాగంగా తాను తిరుపతికి వచ్చినట్లు చెప్పారు. తిరుపతిలో, తిరుమలలో గత ఐదేళ్లుగా వైసీపీ నాయకులు ఎంతటి దారుణాలు చేశారో అందరికీ తెలిసిందేనన్నారు. ఇప్పుడు తిరుమల ఎలా ఉందో తాను ప్రత్యక్షంగా చూశానన్నారు. గత పాలకులు మాస్టర్ ప్లాన్ రోడ్ల పేరిట ఇష్టానుసారంగా టీడీఆర్ బాండ్లు తీసుకున్నారని, వీటిపై దర్యాప్తు చేసి బాధ్యుల్ని శిక్షిస్తామన్నారు. వైసీపీ నాయకులతో అంటకాగే అధికారులకు ఉద్వాసన ఉంటుందని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు సుగుణమ్మ, నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ, రవి నాయుడు, జేబీ శ్రీనివాస్, శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, కృష్ణ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, ఆర్సీ శ్రీనివాస్, సుబ్బు యాదవ్, కొట్టే హేమంత్ రాయల్, సుబ్రమణ్యం, యశ్వంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం. బంగారం, వెండి, చర, స్థిరాస్తులేమో రూ.85 కోట్లకుపైగా ఉన్నట్లు అంచనా. ఇలా ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారంటూ ఆయనపై ఫిర్యాదులొచ్చాయి. దీంతో చంద్రగిరి పంచాయతీ పూర్వ కార్యదర్శి మహేశ్వరయ్య ఇంటితో పాటు ఐదుచోట్ల ఏకకాలంగా ఏసీబీ తనిఖీలు చేపట్టింది. రూ.కోట్ల ఆస్తులకు సంబంధించి పత్రాలను అధికారులు సీజ్ చేసినట్లు సమాచారం.

\- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

మహేశ్వరయ్య మామూలోడు కాదు!

- ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారని ఆరోపణలు



పేరూరులోని ఇంట్లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

ఏకకాలంలో ఐదు ప్రాంతాల్లో ఏసీబీ తనిఖీలు

రూ.85 కోట్ల ఆస్తులను గుర్తించిన అధికారులు

చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా గతంలో లంచం తీసుకుంటూ పట్టుబడి.. సస్పెండైన వైనం



మహేశ్వరయ్య



అధికారులు సీజ్ చేసిన వాహనాలు

అప్పుడు లంచం తీసుకుంటూ..

ఇటీవల చంద్రగిరి పంచాయతీ కార్యదర్శిగా లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన మహేశ్వరయ్య.. కుప్పం, పలమనేరు, పుంగనూరుతో పాటు వివిధ ప్రాంతాల్లో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. పని చేసిన ప్రతిచోటా ఆయనపై ఆరోపణలు రావడం గమనార్హం. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక ప్రజా ప్రతినిధి అండదండలతో చంద్రగిరికి వచ్చిన ఆయన నాలుగేళ్లలో వారి కనుసన్నల్లో ఇష్టారాజ్యంగా సంపాదించారన్న విమర్శలున్నాయి. పంచాయతీలో ఏ పని కావాలన్నా..బిల్లులు మంజూరు కావాలన్నా.. తనకేంటని అడగతారనే ఆరోపణలు వచ్చాయి. ఆ క్రమంలో చిన్నగొట్టిగల్లుకు చెందిన దినేష్‌రెడ్డి సచివాలయ భవనం నిర్మించారు. దీనికి బిల్లులు మంజూరు చేయడానికి దాదాపు రూ.లక్ష డిమాండ్ చేసినట్లు సమాచారం. అంత ఇచ్చుకోలేక దినేష్‌రెడ్డి ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. ఆ తర్వాత మహేశ్వరయ్యకు దినేష్ రెడ్డి రూ.50 వేలు లంచంగా ఇస్తుండగా ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేయడంతో.. ప్రభుత్వం ఆయన్ను సస్పెండు చేసింది. ఇప్పుడాయన బెయిల్‌పై బయటకు వచ్చారు.

ఇప్పుడు ఆదాయానికి మించి ఆస్తున్నాయని..

తాజాగా.. మహేశ్వరయ్యకు ఆదాయానికి మించిన ఆస్తులున్నాయంటూ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. సామాన్య కుటుంబంలో పుట్టిన ఈయన అనతికాలంలోనే రూ.కోట్ల ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలు వచ్చాయి. దీంతో మంగళవారం ఏసీబీ అధికారులు సోదాలు చేపట్టారు. తిరుపతి, కడప జిల్లాలకు చెందిన ఏసీబీ అధికారులు బృందాలుగా విడిపోయి తిరుపతి రూరల్ పరిధిలోని పేరూరు, చిత్తూరు జిల్లా పలమనేరు, గంగవరం, కడప జిల్లా బద్వేలు, బెంగళూరు, హైదరాబాదులో ఏక కాలంలో సోదాలు జరిపారు. ఈ సోదాలు బుధవారం కూడా కొనసాగనున్నాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు.. పేరూరులోని ఆయన ఇంటి నుంచి కిలో బంగారం, వెండి వస్తువులు, దాదాపు రూ.మూడు లక్షల నగదు, రూ.35 లక్షల విలువ చేసే బ్యాంకు టర్మ్ డిపాజిట్లు, రెండు కార్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. పేరూరులో దాదాపు రూ.ఐదారు కోట్ల విలువైన ప్లాట్లు ఉన్నాయి. దాదాపు రూ.85 కోట్ల చర, స్థిరాస్తులు ఉన్నట్లు గుర్తించారు. మహేశ్వరయ్య కూడబెట్టిన అక్రమాస్తుల్లో దాదాపు 60 నుంచి 70 శాతం బినామీల పేరిట పెట్టినట్లు ఏసీబీ గుర్తించింది. ప్రధానంగా బెంగళూరులో దాదాపు రూ.10 కోట్ల విలువ చేసే అపార్టుమెంటు ఉన్నట్లు.. పేరూరులోని ఆయన ఇంటి వద్ద డాక్యుమెంట్లు లభించినట్లు తెలిసింది. పలమనేరులో మూడంతస్తుల ఇల్లు, ఒక ఫాం హౌస్ ఉంది. గంగవరంలో ప్లాట్లు, ఒక ఇల్లు ఉన్నాయి. బద్వేలులోనూ వివిధ పేర్లతో ఆస్తులు కూడబెట్టినట్లు తెలిసింది. అక్కడ కొన్ని కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అతడి అత్త, మామ ఇంట్లో సోదాలు చేస్తున్న తనిఖీ బృందాలు కొన్ని విలువైన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. గంగవరంలో వ్యవసాయ భూములు ఉన్నట్లు రికార్డుల ద్వారా బయట పడింది. వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు, లాకర్లు ఉన్నట్లు గుర్తించారు. వీటికోసం ఆయా బ్యాంకుల మేనేజర్లకు లేఖలు రాయనున్నట్లు తెలిసింది.

గంగవరం ఫాంహౌస్‌లో తనిఖీలు

గంగవరం, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండలం కూర్నిపల్లె సమీపంలోని మహేశ్వరయ్యకు చెందిన మామిడి తోపు, ఫాంహౌస్‌లో మంగళవారం ఏసీబీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఫాంహౌస్‌లోని గదులు, ప్లైవుడ్ ర్యాక్స్, పలు ప్రదేశాలలో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో ఏవైనా రికార్డులు లభించాయా లేదా అన్నది వెల్లడించలేదు. తిరుపతి ఏసీబీ ఏఎస్పీ విమలకుమారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టామని అధికారులు చెప్పారు.



ఫామ్‌హౌస్‌లో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

అభివృద్ధే లక్ష్యంగా..

- వేగవంతంగా చర్యలు తీసుకుంటున్నాం
- జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడి



ఎమ్మెల్యేలు, అధికారులు, టీడీపీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

తిరుపతి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రాభివృద్ధే లక్ష్యంగా.. వేగంగా చర్యలు తీసుకుంటున్నామని ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ వెల్లడించారు. అందులో భాగంగా శ్రీసిటీ విస్తరణకు అదనంగా 2500 ఎకరాలను కేటాయించడానికి భూసేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోందన్నారు. తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు తిరుమల పర్వత పాదాల చెంత నుంచి ఒబెరాయ్ తదితర హోటళ్లను దూరంగా తరలించేందుకు ప్రత్యామ్నాయ భూములు కేటాయిస్తున్నామన్నారు. కొత్తగా లులూ, మహీంద్రా, రహేజా, అట్మోస్ఫియర్ తదితర సంస్థలు జిల్లాకు వస్తున్నాయని వివరించారు. నాయుడుపేట వద్ద నూతన పరిశ్రమల ఏర్పాటుకు ఏపీఐఐసీ భూముల కేటాయింపులో అడ్డంకులను తొలగిస్తున్నామని వివరించారు. క్రిస్ సిటీలో రూ.1500 కోట్ల పనులు త్వరగా పూర్తి చేసేలా సమీక్షిస్తున్నామన్నారు. సాగరమాల రోడ్డు, రేణిగుంట-కడప, తిరుపతి-మదనపల్లె రోడ్డు వంటి రూ.6 వేల కోట్ల పనులను ఏడాదిలోపు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. నడికుడి-శ్రీకాళహస్తి రైలు మార్గానికి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేశామని, ఇక మిగిలింది రైల్వే పనులేనని స్పష్టం చేశారు. శాప్ ఛైర్మన్ రవినాయుడు అభ్యర్థన మేరకు తిరుపతి కలెక్టరేట్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ స్పోర్ట్స్ కాంప్లెక్సు నిర్మాణానికి 34 ఎకరాలను ప్రభుత్వం కేటాయించిందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా ఇక్కడ క్రీడా ప్రాంగణం నిర్మిస్తామన్నారు.

'శెట్టిపల్లె' భూ వివాదానికి శాశ్వత పరిష్కారం

తిరుపతిలోని శెట్టిపల్లె భూముల వివాదానికి త్వరలో శాశ్వత పరిష్కారం చూపిస్తామని మంత్రి సత్యప్రసాద్ ప్రకటించారు. దశాబ్దాలుగా ఈ సమస్యకు పరిష్కారం దొరకలేదన్నారు. తమ ప్రభుత్వం రాగానే దీనిపై దృష్టి పెట్టిందని, జిల్లా అధికారులు నెలల తరబడీ కసరత్తు చేసి తుది పరిష్కారం దిశగా నివేదిక సిద్ధం చేశారన్నారు. కలెక్టర్, జేసీ, మున్సిపల్ కమిషనర్ ఇటీవల అమరావతికి వచ్చి ప్రభుత్వానికి నివేదించారన్నారు. త్వరలో శెట్టిపల్లి వాసులు శుభవార్త వింటారని, అక్కడ భూముల అనుభవదారులకు హక్కులు కల్పించడంతో పాటు మోడల్ టౌన్‌షిప్ నిర్మిస్తామన్నారు.

ఓటేరు చెరువుపై లోతుగా పరిశీలిస్తున్నాం

తిరుపతి రూరల్ మండలంలోని ఓటేరు చెరువు భూముల వ్యవహారాన్ని లోతుగా పరిశీలిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ఈ చెరువు భూములు పట్టా భూములని తొలుత రికార్డుల్లో నమోదైందని, తర్వాత చెరువని నమోదైందని, ఇలా భూముల స్వభావం రెవెన్యూ రికార్డుల్లో మార్పుచేర్పులకు గురైందని వివరించారు. ఈ వివాదం కోర్టులో ఉన్నందున ఎక్కువ మాట్లాడలేమన్నారు. రెవెన్యూ రికార్డులను కలెక్టర్ పరిశీలిస్తున్నారని, దానికనుగుణంగా చర్యలు తీసుకుంటామన్నారు.

తిరుపతి డీసీ తీరుపై విచారణ

తిరుపతి కార్పొరేషన్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్ టీడీఆర్ బాండ్ల వ్యవహారంలో విచారణ సవ్యంగా సాగకుండా అడ్డుపడుతున్నారని ఫిర్యాదు వచ్చిందని మంత్రి వెల్లడించారు. వైసీపీ నాయకులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని, ఇదివరకే ప్రభుత్వం బదిలీ చేసినా ఇంకా అక్కడే కొనసాగుతున్నారనీ తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారించి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

వినాయకసాగర్‌లో నిరసనలపై చట్టపరంగా చర్యలు

ఇటీవల తిరుపతి వినాయకసాగర్ పార్కులో వైసీపీ శ్రేణులు అరగంట పాటు నాటకం ప్రదర్శించి సీఎంను, ప్రభుత్వాన్ని కించపరిచిన విషయమై చట్టపరంగా చర్యలుంటాయని మంత్రి సత్యప్రసాద్ తెలిపారు. దానిపై ఎస్పీకి కమిషనరు ఫిర్యాదు చేశారన్నారు. ఎవరి మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

జర్నలిస్టులకు ఇళ్ళ స్థలాలిస్తాం!

తిరుపతిలో జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ళ స్థలాలు కేటాయిస్తుందని మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఇదివరకే జర్నలిస్టులు వినతిపత్రం ఇచ్చారన్నారు. 700 మంది దాకా ఉన్నారని, అందులో యూట్యూబ్ ఛానెళ్ళ ప్రతినిధులూ చాలా మంది వున్నారన్నారు. వడపోసి అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేస్తామన్నారు. మంత్రితో పాటు సమావేశంలో కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభమ్ బన్సాల్, కమిషనర్ మౌర్య, చంద్రగిరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట ఎమ్మెల్యేలు పులివర్తి నానీ, బొజ్జల సుధీర్‌రెడ్డి, విజయశ్రీ, ఏపీ యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహ యాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, టీడీపీ మీడియా కో ఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, నేతలు ఊకా విజయ్‌కుమార్, కోడూరు బాలసుబ్రమణ్యం, మబ్బు దేవనారాయణరెడ్డి, పులిగోరు మురళి,ఊట్ల సురేంద్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

'టీడీఆర్'పై సమగ్ర విచారణ చేపట్టండి

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని 'టీడీఆర్' కుంభకోణంపై సమగ్ర విచారణ చేపట్టాలని పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహయాదవ్, శాప్ ఛైర్మన్ రవినాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, విజయకుమార్, పులుగోరు మురళీకృష్ణారెడ్డి, జేబీ శ్రీనివాస్, శ్రీధర్‌వర్మ, హేమంత్ రాయల్ తదితరులు మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను కోరారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఇన్‌ఛార్జి మంత్రి నిర్వహించిన గ్రీవెన్స్‌కు ప్రజలతో పాటు టీడీపీ శ్రేణుల నుంచీ ఫిర్యాదులు వెల్లువెత్తాయి. నగరపాలక సంస్థ కార్యాలయంలో 2019-24 మధ్యలో జరిగిన అవినీతిపై విచారణకు ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటికీ స్పందనలేదన్నారు. మున్సిపాలిటీ, తుడాలో పాత అధికారులే కొనసాగుతున్నారని, అక్కడ ప్రక్షాళన చేయాలన్నారు. టీడీఆర్ బాండ్ల అక్రమాలపై చర్యలు తీసుకోవడానికి జాప్యం చేస్తున్నారని, దీనిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. తిరుమల స్థానికుల సమస్యలను పరిష్కరించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోడూరు బాలసుబ్రహ్మణ్యం, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, మబ్బు దేవనారాయణరెడ్డి, బుల్లెట్ రమణ తదితరులు విజ్ఞప్తి చేశారు. తిరుపతి గంగ జాతర నిర్వహణకు కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

వేసవిలో తాగునీటి సమస్య, జిల్లా అభివృద్ధిపైన, పీజీఆర్ఎస్ అర్జీలపైన జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించామని మంత్రి వివరించారు. వేసవిలో ఉష్ణోగ్రతలు, వడగాడ్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందన్నారు. ఆ దృష్ట్యా తాగునీటి సమస్య తలెత్తకుండా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. పీజీఆర్ఎస్‌కు వచ్చే ప్రతి అర్జీనీ పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు పరిష్కరించేందుకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. రెవెన్యూ సదస్సుల్లో.. రీ సర్వేలో వచ్చిన అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. పీ4 సర్వేలో వెల్లడైన 20 శాతం మంది పేదలకు సాయం అందేలా ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు, దాతలను ఒప్పించాలని కోరారు.

అవిశ్వాస తీర్మానంపై సమావేశాన్ని ప్రశాంతంగా నిర్వహిస్తాం

- గూడూరు సబ్ కలెక్టర్ రాఘువేంద్ర మీనా

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మున్సిపల్ ఛైర్‌పర్సన్‌పై బుధవారం జరిగే అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహిస్తామని గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా అన్నారు. మంగళవారం డీఎస్పీతో కలిసి ఆయన మున్సిపల్ కార్యాలయాన్ని పరిశీలించారు. కార్యాలయం వద్ద 144 సెక్షన్.. సీసీ కెమెరాల పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఉదయం 10.30 గంటలకు అవిశ్వాస తీర్మానం ఉంటుందన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. 40 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గూడూరు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. ఇందులో 10 మంది సివిల్ డ్రెస్‌లో ఉంటారన్నారు. మున్సిపల్ కమిషనరు వెంకటరామిరెడ్డి, సీఐ ఏవీ రమణ, ఎస్ఐ సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.



మున్సిపాలిటీ హాలు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా



నచ్చే కథలు వస్తే మళ్లీ నటిస్తా

● హీరోయిన్ రంభ

'నచ్చే కథలు వస్తే తప్పకుండా మళ్లీ సినిమాల్లో నటిస్తా' అని క్లారిటీ ఇచ్చారు నటి రంభ. పెళ్లిరోజు సందర్భంగా భర్త ఇంద్రకుమార్ పద్మనాథన్‌తో కలిసి మంగళవారం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం ఆమె ఆలయం ముందు మీడియాతో మాటాడుతూ, వివాహమై 15 ఏళ్లైన సందర్భంగా శ్రీవారి ఆశీస్సులు తీసుకునేందుకు వచ్చామన్నారు. 'సినిమాల్లోనే పుట్టిపెరిగాం. సినిమానే జీవితం. మంచి పాత్రలు వస్తే తప్పకుండా నటిస్తాను' అని రంభ చెప్పారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

తిరుమలలో రవిశాస్త్రి

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. క్రికెటర్ రవిశాస్త్రి, రేమాండ్స్ గ్రూప్స్ సీఎండీ గౌతమ్ హరి సింఘానియా, టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, భారతీయ మాస్టర్ హ్యాండ్లూమ్ డిజైనర్ పద్మశ్రీ గజం అంజయ్య, ఫైర్ సర్వీస్, సివిల్ డిఫెన్స్ డీజీ వివేక్ శ్రీవాత్సవ ఉన్నారు.



గౌతమ్ హరి సింఘానియా, రవిశాస్త్రి ←

సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 8 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం : రూ.4.16 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 66,503

తలనీలాలు సమర్పించినవారు : 23,941



- వైసీపీ హయాంలో మంజూరైన 65 వేల ఇళ్లలో పూర్తయింది 26 వేలే
- పునాదుల దశ దాటని 22 వేల ఇళ్లు
- 574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తి కాని వైనం
- ఎక్కడా కనిపించని మౌలిక వసతులు

జిల్లాలో వేలాది మంది పేదల సొంతింటి కలను గత వైసీపీ ప్రభుత్వం భగ్నం చేసింది. ఐదేళ్లలో సుమారు 65 వేల ఇళ్లు మంజూరు కాగా అందులో 26 వేలు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మరో 22 వేలు పునాదుల దశ దాటలేదు. తొమ్మిది వేల ఇళ్ల నిర్మాణం మొదలే కాలేదు. మిగిలినవి వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 574 లే అవుట్లను ఏర్పాటు చేయాల్సి ఉండగా కనీసం ఒక్కటంటే ఒక్కటీ పూర్తి కాలేదు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి





ఊరందూరులో నాటి సీఎం జగన్ శంకుస్థాపన చేసిన శిలాఫలకం

ఊరందూరు లే అవుట్‌లో ఎటు చూసినా అసంపూర్తిగా కనిపిస్తున్న పక్కా ఇళ్లు



నీళ్ల లీకేజీతో బురదమయంగా మారిన రోడ్డు

పేదల సొంతింటి కల భగ్నం

జిల్లాలో 2019-24 నడుమ పీఎం ఆవాస్ యోజన కింద 64,895 పక్కా ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది. ఐదేళ్లు గడిచేటప్పటికి కేవలం 26,855 ఇళ్లు మాత్రమే దాదాపు నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. వాటిలో కూడా చాలావరకూ ఫినిషింగ్ పనులు పెండింగ్ ఉన్నాయి. కొన్నింటిలోనే లబ్ధిదారులు నివాసం ఉంటున్నారు. 8,952 ఇళ్ల నిర్మాణం అసలు మొదలే కాలేదు.

574 లే అవుట్లలో ఒక్కటీ పూర్తికాని వైనం

జిల్లా వ్యాప్తంగా గత ప్రభుత్వం 574 లే అవుట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించి భూములు కేటాయించింది. అందులో 49,022 ఇళ్లు మంజూరు చేసింది. 7,843 ఇళ్ల నిర్మాణ పనులు మొదలే పెట్టలేదు. కేవలం 8,991 ఇళ్లు మాత్రమే నిర్మాణం పూర్తి చేసుకున్నాయి. మిగతా ఇళ్లు వివిధ దశల్లో ఆగిపోయి ఉన్నాయి. వందశాతం లే అవుట్లు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని లే అవుట్లు గ్రామాలకు మరీ దూరంగా, అనువుగాని చోట్ల కేటాయించడంతో లబ్ధిదారులు అడుగు కూడా పెట్టలేదు. ఆయాచోట్ల ముళ్లకంపలు పెరిగిపోయాయి. ఏ లే అవుట్ లోనూ మౌలిక సదుపాయాలు కల్పించలేదు. మట్టి రోడ్లు, అరకొర విద్యుత్ స్తంభాల ఏర్పాటు తప్ప ఇతర సదుపాయాలు కనిపించడం లేదు.

జగన్ శంకుస్థాపన చేసిన లే అవుట్ తీరిలా..

పేదలందరికీ జగనన్న ఇళ్ల పథకాన్ని 2020 డిసెంబరు 28న అప్పటి సీఎం జగన్ శ్రీకాళహస్తి మండలం ఊరందూరు సమీపంలో ప్రారంభించారు. ఆ సందర్భంగా శ్రీకాళహస్తి పట్టణ పేదల ఇళ్లకు ఊరందూరు వద్ద లే అవుట్‌కు శంకుస్థాపన చేశారు. 6,836 మందికి ఇళ్లు కట్టిస్తామని ప్రకటించారు. కానీ 5,086 మందికే పట్టాలిచ్చారు. అందులో 3,428 మందికే పక్కా ఇళ్లు మంజూరు చేశారు. మౌఖిక ప్రకటన ఆచరణకు వచ్చేసరికి 3,200 ఇళ్లు తగ్గిపోయాయి. మంజూరైన వాటిలోనూ 2,642 ఇళ్ల నిర్మాణమే మొదలైంది. వాటిలో 746 మాత్రమే పూర్తయ్యాయి. ఆ లబ్ధిదారుల్లోనూ కొందరే నివాసం ఉంటున్నారు. మౌలిక సదుపాయాలు లేవు. సీసీ రోడ్లు, డ్రైనేజీ కాలువలు లేవు. కొన్ని వీధుల్లో ముళ్ల పొదలు పెరిగిపోయాయి. జగన్ హామీ ఇచ్చిన శ్రీకాళహస్తి శాటిలైట్ టౌన్‌షిప్ దుస్థితిలో కొట్టుమిట్టాడుతోంది.

రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం!



కాలనీలో కనీస సౌకర్యాలు లేవు. అక్కడక్కడా పెట్టిన కొళాయిల నుంచీ తాగునీరు తెచ్చుకుంటున్నాం. తాగునీటి పైపులన్నీ పగిలిపోయి నీరంతా రోడ్లపైకి వస్తోంది. దాంతో మట్టి రోడ్లు బురదగా మారాయి. కాలనీలో కాపురాలు తక్కువ. ఎక్కడ చూసినా సగంలో ఆపేసిన ఇళ్లే. రాత్రయితే వాటిలోకి గంజాయి, మద్యం తాగేవారు వస్తున్నారు. ఆకతాయిల వల్ల రాత్రిళ్లు బిక్కుబిక్కుమంటూ బతుకుతున్నాం.

- గంగ, జగనన్న కాలనీ, ఊరందూరు

మంగళంపాడులో అడుగుపెట్టని లబ్ధిదారులు



చిట్టడవిలా మారిన మంగళంపాడు జగనన్న లే అవుట్

సూళ్లూరుపేట మండలం మంగళంపాడులోని ఎస్సీ పేదల కోసం గత ప్రభుత్వం కిలోమీటరు దూరంలో లేఅవుట్ ఏర్పాటు చేసింది. 44 మందికి పట్టాలు మంజూరు చేసింది. ఇళ్ల స్థలాలు కేటాయించింది. ఇళ్ల నిర్మాణానికి ఎలాంటి మౌలిక వసతులూ ఏర్పాటు చేయకపోవడంతో లబ్ధిదారులు ఆ లేఅవుట్‌లో ఇంతవరకూ అడుగు కూడా పెట్టలేదు. ముళ్లకంపలు, పొదలూ పెరిగిపోయి చిట్టడివిని తలపిస్తోంది.

గూడూరు: రామలింగయ్య కాలనీ



గూడూరు మున్సిపాలిటీ రామలింగయ్య కాలనీలోని జగనన్న లే అవుట్‌లో 202 మందికి పక్కా ఇళ్లు మంజూరు చేశారు. 57 మాత్రమే నిర్మాణం పూర్తయ్యాయి. 65 పునాదుల దశలో ఆగిపోయాయి. మరో 83 బేస్‌మెంట్ దాటి వివిధ దశల్లో నిలిచిపోయాయి. మిగిలిన 71 అసలు పనులే మొదలు కాలేదు. సిమెంటు రోడ్లు, కాలువలు కనిపించవు. మొండిగోడలు, పునాదులకే పరిమితమైన ఇళ్లతో కాలనీ శిథిల వాటికలా కనిపిస్తోంది.

ముళ్లకంపల మధ్య కాపురముంటున్నాం!



చెన్నూరు రామలింగయ్య కాలనీ గూడూరు మున్సిపాలిటీలో ఉందన్న మాటే గానీ సౌకర్యాలూ లేవు. వర్షాకాలంలో మట్టి రోడ్లన్నీ బురదతో నిండిపోతున్నాయి. ఏ వీధిలో చూసినా ముళ్ల కంపలు, పొదలే. వాటి మధ్యే నివాసాలుంటున్నాం. గత ప్రభుత్వం ఇచ్చిన రూ.1.80 లక్షలు ఇంటి నిర్మాణానికి సరిపోలేదు. స్థోమత లేని చాలా మంది ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేక మధ్యలోనే వదిలిపెట్టేశారు.

- జిలానీ బాషా, రామలింగయ్య కాలనీ

బ్యాండ్‌పాలెంలో స్థలాలు చూపని వైనం

వెంకటగిరి మండలం సోమసానిపల్లి పంచాయతీ బ్యాండ్‌పాలెంలోని 18 మంది పేదలకు గత ప్రభుత్వం ఇళ్ల పట్టాలు.. ఇళ్లూ మంజూరు చేసింది. ఆ స్థలాలు ఎక్కడనేది మాత్రం చూపలేదు. అధికారులు, నాయకుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయిన లబ్ధిదారులు ఆశలు వదిలేసుకున్నారు.

'చెన్నేరి'.. చేదు నిజాలు

సత్యవేడు మండలం చెన్నేరిలో 53 మంది పేదలకు గత వైసీపీ ప్రభుత్వం పక్కా ఇళ్లు మంజూరు చేసింది. నీటి సరఫరా, విద్యుత్, రోడ్లు వంటి కనీస సదుపాయాలు లేకపోవడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయలేకపోయారు. కాలనీలో 53 ఇళ్లకు గానూ ఒక్కటీ పూర్తి కాలేదు.

సత్యవేడు జగనన్న కాలనీది అదే కథ!

సత్యవేడులోని 350 మంది నిరుపేదలకు గత ప్రభుత్వం పట్టాలు.. ఇళ్లు మంజూరు చేసింది.అందులో200 మంది పనులు మొదలు పెట్టారు. ఐదేళ్లలో కేవలం 50 మాత్రమే పూర్త య్యాయి. వివిధ దశల్లో 150 నిలిచిపోగా మరో 150 ఇంతవరకూ మొదలే కాలేదు.

గిరిజనులకు మిగిలింది గుడిసెలే!

సూళ్లూరుపేట మండలం మంగళంపాడు ఆత్రేయ గ్రామానికి చెందిన గిరిజనుల కోసం గత ప్రభుత్వం జగనన్న ఇళ్ల పథకం కింద కాలనీ మంజూరు చేసింది. గ్రామానికి చేరువలో లే అవుట్ ఏర్పాటు చేయాలని భూమి కేటాయించింది. 33 మందికి పట్టాలు మంజూరు చేశారు. అయితే ఇళ్ల నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో ప్రస్తుతం అదే లే అవుట్‌లో లబ్ధిదారులైన గిరిజనులు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారు.



రేకుల షెడ్డు వేసుకున్న లబ్ధిదారు



సూళ్లూరుపేట మండలం కేసీఎన్ గుంట పంచాయతీ దావాదిగుంట గ్రామంలో 13 మంది పేద ఎస్సీలకు పక్కా ఇళ్లు మంజూరు చేసింది గత ప్రభుత్వం. అంతా నిరుపేదలు కావడంతో పది మంది నిర్మాణాల జోలికే పోలేదు. ఇద్దరు మాత్రమే స్లాబ్ దాకా పనులు పూర్తి చేసి ఫినిషింగ్ చేయలేక వదిలిపెట్టేశారు.ఓ లబ్ధిదారుడు తనకు కేటాయించిన స్థలంలో రేకులతో తాత్కాలికంగా షెడ్డు వేసుకుని నివాసముంటున్నాడు.



తిరుపతి పేదలకూ తప్పని నిరాశ


తిరుపతి నగర పరిధిలోని పేదలకు ఏర్పేడు, చంద్రగిరి, వడమాలపేట, రేణిగుంట మండలాల్లో ఆరు లే అవుట్లు మంజూరు చేసింది. రేణిగుంట మండలం జీపాలెం గ్రామంలో 34 ఎకరాల లే అవుట్‌లో 1,753 పక్కా ఇళ్లు మంజూరు చేసింది. ఇప్పటికీ పది శాతం ఇళ్లు కూడా పూర్తి కాలేదు. ఎలాంటి సదుపాయాలూ కల్పించలేదు.

రేణిగుంట జీపాలెంలో ఇళ్ల పరిస్థితి



ఒకరి మృతికి కారణమైన నిందితుడి అరెస్టు

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి మండలం కోటంబేడుకు చెందిన తాడి వెంకటరమణయ్య మృతికి కారణమైన కొండా శివయ్యని అరెస్టు చేసినట్లు సీఐ రమణ తెలిపారు. వెంకటగిరి పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. సీఐ కథనం మేరకు.. గత నెల 30వ తేదీన తాడి వెంకటరమణయ్య, కొండా శివయ్య వేటకు వెళ్లారు. తిరిగి మోటర్ సైకిల్‌పై వస్తుండగా నాటు తుపాకీ పేలడంతో వెంకటరమణయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. శివయ్య భయంతో పక్కనే ఉన్న కాలువలో మృతదేహాన్ని పడేశాడు. మృతదేహం నీళ్లలో తేలుతుండడంతో కాలువలో నుంచి బయటకు లాగి పక్కనే ఉన్న ముళ్ల పొదల్లో పడేసి వెళ్లిపోయాడు. అప్పట్నుంచి తప్పించుకుని తిరుగుతున్న శివయ్యను మంగళవారం అరెస్టు చేశామని, ఆయన వద్ద ఒక నాటు తుపాకీ, 114 గ్రాముల నల్లమందు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నామని సీఐ వివరించారు. నిందితుడిని బుధవారం కోర్టులో హాజరుపరుస్తామన్నారు. కార్యక్రమంలో బాలాయపల్లి ఎస్ఐ గోపి, సిబ్బంది పాల్గొన్నారు.



దైవచింతన పెంపొందించుకోవాలి

● కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

రామచంద్రాపురం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ దైవచింతన పెంపొందించుకోవాలని కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి అన్నారు. రామచంద్రాపురం మండలం కుప్పంబాదురు సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఆయనకు ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురూజీ శిష్య బృందం పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆశ్రమ ప్రాంగణంలో మొక్కను నాటి నీరు పోశారు. ఎన్టీఆర్ ట్రస్టు నిర్వహించిన రక్తదాన శిబిరంలో వందమంది రక్తదానం చేశారు. స్వామిజీ ఆశ్రమంలో సీతారామ సమేత రామలక్ష్మణ, హనుమంత విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తిరుమలలో తమిళనాడువాసి అదృశ్యం



శ్రీను షా (ఫైల్ ఫొటో)

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమల వచ్చిన తమిళనాడు భక్తుడు కనిపించకుండాపోయాడు. పోలీసుల వివరాల మేరకు.. చెన్నైకు చెందిన ఆర్ శ్రీను షా(53) ఈనెల 5న శ్రీవారి దర్శనం కోసం కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వచ్చాడు. వెంగమాంబ అన్నప్రసాదభవనంలో అన్నప్రసాదాలు స్వీకరించాక చెప్పులు వేసుకుని వస్తాని వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో అతని సోదరుడు కుబేర్ షా తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాలు తెలిసిన వారు 94407 96769 నంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.


సదరన్ డిస్కం కాంట్రాక్టు కార్మికుల దీక్ష విరమణ



సీఎండీతో చర్చలు జరుపుతున్న సీఐటీయూ నాయకులు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారం కోసం 15 రోజులుగా డిస్కం కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యల పట్ల సదరన్ డిస్కం సీఎండీ సంతోషరావు సానుకూలంగా స్పందించారు. సదరన్ డిస్కం కార్యాలయం ఎదుట సోమవారం జరిగిన మహాధర్నా సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీ మేరకు మంగళవారం సీఎండీతో చర్చలు ఏర్పాటు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి మాట్లాడుతూ గతంలో అధికారులు ఇచ్చిన హామీలు అమలు, వేతనాలు పెంపు, ఇతర అంశాలను సీఎండీ దృష్టికి తెచ్చారు. తమ పరిధిలో వున్న సమ్యలను పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని సీఎండీ హామీ ఇచ్చారు. దీంతో రిలే దీక్షలను బుధవారం విరమించుకున్నామని సంఘం నాయకులు కుమార్ తెలిపారు. అధికారులు డైరెక్టర్లు వై.లక్ష్మీనరసయ్య, పఠాన్ అయూబ్ ఖాన్, సీజీఎం హెచ్‌ఆర్‌డీ రమణాదేవి, కార్మిక సంఘాల నాయకులు శివప్రసాద్ రెడ్డి, రవికుమార్, జలీల్‌బాషా, హంసేన్‌పీరాం పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోలీసు బ్యాడ్మింటన్ పోటీలకు తిరుమల కానిస్టేబుల్ ఎంపిక



వాసుదేవ రావు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): కేరళలో ఈ నెల 11 నుంచి 15వ తేది వరకు జరగనున్న ఆలిండియా పోలీసు బ్యాడ్మింటన్ పోటీలకు తిరుమల వన్‌టౌన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న వాసుదేవ రావు ఎంపికయ్యారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఈయన.. కానిస్టేబుల్‌గా తిరుపతి జిల్లాలో నియమితులయ్యారు. తొలినుంచీ ఆటలపై ఈయనకు ఆసక్తి ఉంది. గత ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు విజయవాడలో జరిగిన పోలీసు బ్యాడ్మింటన్ సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొని సింగిల్స్ విభాగంలో ప్రతిభ చూపారు. ఈ క్రమంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈయనకు జిల్లా పోలీసు శాఖ అభినందనలు తెలిపింది.

జగన్ మెప్పుకోసమే నేదురుమల్లి 'అవిశ్వాస డ్రామా'

● వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల విమర్శ

వెంకటగిరి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో 35 వేల ఓట్లతో ఓడిపోయిన నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి.. అధిష్ఠానం వద్ద తిరిగి మార్కులు పొందేందుకే అవిశ్వాస డ్రామా ఆడుతున్నారని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియపై బుధవారం అవిశ్వాస తీర్మానం పెడుతున్న నేపథ్యంలో ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.'పలువురు వైసీపీ కౌన్సిలర్లు నా వద్దకు వచ్చినా స్వాగతించలేదు. తొలినుంచీ వైసీపీలో గ్రూపు తగాదాలు ఉన్నాయి.వీటిలో ఓ వర్గాన్ని దెబ్బతీయాలని నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అవిశ్వాస డ్రామా ఆడుతూ.. దానిని టీడీపీకి అంటగట్టాలని ప్రయత్నించడం దారుణం. గతంలో ఆనం రామనారాయణరెడ్డి సహకారంతో నక్కా భానుప్రియ చైర్‌పర్సన్ అయ్యారనే అక్కసుతో ఆమెను వైసీపీ కార్యక్రమాలకు దూరంగా ఉంచారు. ఇప్పుడు వైసీపీ కౌన్సిలర్ల మధ్యనే విభేదాలు సృష్టించి చైర్‌పర్సన్‌ను బెదిరించి ఆయనకు అనుకూలంగా మలచుకునే క్రమంలోనే ఈ తతంగాన్ని కొనసాగించారు. ఏదిఏమైనా అవిశ్వాస తీర్మానంలో మెజారిటీ కౌన్సిలర్లు తీసుకోనే నిర్ణయాన్ని టీడీపీ స్వాగతిస్తుంది' అని ఆ ప్రకటనలో కురుగొండ్ల పేర్కొన్నారు..

కోదండరాముడికి ధ్వజారోహణ పూజ



సీతారాముల మాఢవీధి ఉత్సవం

గూడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి మాడవీధి ఉత్సవం జరిపారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గరుడ చిత్రపటానికి పూజలు నిర్వహించి, ధ్వజస్థంభానికి అభిషేకం చేశారు. గరుడ చిత్రపటాన్ని ధ్వజస్థంభంపై ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని శాస్త్రోపేతంగా నిర్వహించారు. భక్తులు కొడి ముద్దలను పట్టుకునేందుకు పోటీ పడ్డారు. రాత్రికి స్వామివారిని శేష వాహనంపై అలంకరించి గ్రామోత్సవం జరిపారు. డాక్టర్ మైథిలి, రమణ బాబు, డాక్టర్ నరసారెడ్డి, సుష్మా కుటుంబసభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

డీఆర్‌డీఏ ఏపీడీ క్షేత్రస్థాయి పరిశీలన



వెలుగు సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడి ప్రభావతి

దొరవారిసత్రం, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రం వెలుగు కార్యాలయాన్ని డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ ప్రభావతి మంగళవారం పరిశీలించారు. క్షేత్రస్థాయిలో పరిశీలన నిమిత్తం విచ్చేసిన ఆమె కార్యాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. వార్షిక రుణ, జీవనోపాధి ప్రణాళికలపై సమీక్షించారు. ఏకొల్లు గ్రామానికి వెళ్లి మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం అయ్యారు. రుణాల వినియోగం, కుటుంబాల ప్రగతిపై ఆరా తీశారు. ఆమె వెంట జిల్లా జీవనోపాధులు ప్రాజెక్టు మేనేజర్ ధనంజయ్యరెడ్డి, డీపీఎం విజయ్‌కుమార్, ఏపీఎం మునిరాజయ్య తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమక్షంలోనే రీ సర్వే

చిట్టమూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్షంలోనే రీ సర్వే చేయాలని తహసీల్దార్ సతీష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో నార్తువర్తూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రీ సర్వే ద్వారానే భూ సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. గతంలో 21 గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, పలు అవక తవకలు జరిగడంతో ప్రభుత్వం మళ్లీ రీ సర్వే చేపట్టాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేష్, వీఆర్వో శివ పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలి



కట్టెల పొయ్యిపై వంట చేస్తూ సీపీఎం నాయకుల నిరసన

నాయుడుపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సీపీఎం నాయకుడు శివకవి ముకుంద డిమాండ్ చేశారు. మంగళవారం నాయుడుపేట సీఐటీయూ కార్యాలయం వద్ద పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా కట్టెల పొయ్యి వెలిగించి వంటవార్పు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరలు పెంచుతూ పేదల నడ్డి విరుస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరయ్య, అంకయ్య, వెంకటేశ్వర్లు, రవి, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో మంటలు



డంపింగ్ యార్డులో వ్యాపించిన మంటలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని హోలిక్రాస్ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న డంపింగ్ యార్డులో మంగళవారం మంటలు చెలరేగాయి. గుర్తు తెలియని వ్యక్తులు డపింగ్ యార్డులో చెత్తకు నిప్పు పెట్టడంతో మంటలు వ్యాపించాయి. జాతీయ రహదారిపై దట్టంగా పొగ కమ్ముకోవడంతో కాకుండా పట్టణంలోకి పొగ వ్యాపించడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మున్సిపాలిటీ అధికారులు డంపింగ్‌యార్డు వద్దకెళ్లి పరిశీలించారు. అగ్నిమాపక వాహనాలను రప్పించి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వలస కార్మికుడి ఆత్మహత్య

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): వలస కార్మికుడు సన్నికుమార్(26) రైలు పట్టాలపై నిలబడి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన సోమవారం అర్ధరాత్రి శ్రీకాళహస్తి మండలంలోని రాచగున్నేరి వద్ద చోటు చేసుకుంది. బిహార్ రాష్ట్రానికి చెందిన సన్నికుమార్ రాచగున్నేరిలోని ఓ ప్రైవేటు కర్మాగారంలో కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. సోమవారం రాత్రి రాచగున్నేరి సమీపంలోని రైలుపట్టాలపై నిలబడ్డాడు. తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వైపుగా వెళ్లే రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే హెడ్‌కానిస్టేబుల్ నరసింహులు ఘటనా స్థలానికి చేరుకుని మంగళవారం శవానికి పంచనామా నిర్వహించారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

క్రికెట్ జట్ల మధ్య ఘర్షణ

రేణిగుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): క్రికెట్ ఆడుతుండగా చిన్న వివాదం కాస్తా రెండు టీముల క్రీడాకారులు ఒకరిపై మరొకరు పరస్పరం దాడులు చేసుకునే వరకు దారితీసింది. స్థానికుల కథనం మేరకు మండల పరిధిలోని ఎస్‌యూ పురంలో యువకులు సోమవారం క్రికెట్ ఆడుతుండగా చిన్నపాటి వివాదం ఘర్షణకు దారితీసింది. ఇదే సమయంలో సర్ధి చెప్పేందుకు స్థానికంగా ఉన్న ఒక వృద్ధుడు ప్రయత్నించగా అతడిని కిందకు తోసివేయడంతో తలకు గాయమైంది. దీంతో తిరిగి రాత్రి గ్రామంలో ఇరు టీముల సభ్యులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఇరు టీం సభ్యులు ఒకరిపై మరొకరు అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

ఏప్రిల్ 13న గురుకులం ప్రవేశ పరీక్షలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి ఏప్రిల్ 13న పరీక్షలు నిర్వహించనున్నట్లు ఎల్‌ఏ సాగరం లోని బాలుర గురుకుల, పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ దాదాపీర్ తెలిపారు. ఏప్రిల్ 13వ తేదీ ఆదివారం ఉదయం 10నుంచి 12 గంటల వరకు 5వ తరగతి, మధ్యాహ్నం 2నుంచి 4.30 గంటల వరకు ఇంటర్ ప్రవేశ పరీక్షలు జరుగుతాయన్నారు.

ఇద్దరు డిగ్రీ విద్యార్థుల డీబార్

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రెండవ సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు ప్రిన్సిపాల్ మధుసూదన్‌వర్మ తెలిపారు.

రైతుల సమక్ష్యంలోనే రీ సర్వే

చిట్టమూరు, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): రైతుల సమక్ష్యంలేనే రీ సర్వే చేయాలని తహసీల్దార్ శతీష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం రీ సర్వే డీటీ నిరంజన్ కుమార్ ఆధ్వర్యంలో నార్తువర్తూరు గ్రామంలో రైతులకు అవగాహన కల్పించారు. రీ సర్వే ద్వారానే భూ సమస్యల పరిష్కారం జరుగుతుందన్నారు. గతంలో 21 గ్రామాల్లో రీ సర్వే జరిగిందని, పలు అవక తవకలు జరిగడంతో ప్రభుత్వం మళ్లీ రీ సర్వే చేపట్టాలని ఆదేశించిందన్నారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ వెంకటేష్, వీఆర్వో శివ పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో ఫుడ్ పాయిజన్

- ఆరుగురు చిన్నారులకు అస్వస్థత
- నాయుడుపేట సీహెచ్‌సీలో చికిత్స



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

పెళ్లకూరు, నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలంలోని కానూరు దళితవాడ అంగన్వాడీ కేంద్రంలో పులిహోర తిన్న ఆరుగురు చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. మంగళవారం కానూరు దళితవాడలోని అంగన్వాడీ కేంద్రానికి ఏడుగురు చిన్నారులు హాజరయ్యారు. ఎండలు అధికంగా ఉండడంతో మధ్యాహ్నం భోజనానికి ముందే ఇద్దరు చిన్నారులను తల్లిదండ్రులు ఇళ్లకు తీసుకెళ్లారు. అంగన్వాడీ వర్కర్ శ్రీదేవి నాయుడుపేటలో జరిగిన సెక్టార్ మీటింగ్‌కు వెళ్లారు. అంగన్వాడీ కేంద్రంలో ఉన్న గురువర్షిత్, గురవయ్య, జోషన్, జస్వన్, నానితో పాటు ఓజిలి మండలం కురుగొండకు చెందిన మరో చిన్నారి శాన్వికకు రోజువారి మెనూలో భాగంగా ఆయా రాఘమ్మ నిమ్మరసంతో పులిహోర చేసి వడ్డించారు. తిని ఇళ్లకు వెళ్లిన చిన్నారులు కొద్దిసేపటికే వాంతులు చేసుకుని అస్వస్థతకు గురయ్యారు. ఆందోళన చెందిన తల్లిదండ్రులు వెంటనే చిన్నారులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. సూళ్లూరుపేట టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, పెళ్లకూరు మండల టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్య, నాయకులు పాలచ్చూరు నరేంద్రయాదవ్ తదితరులు చిన్నారులను పరామర్శించారు. నాయుడుపేట ఐసీడీఎస్ సీడీపీవో కొండ్రెడ్డి ఉమామహేశ్వరి, సూపర్‌వైజర్ సాయిలక్ష్మి, నాయుడుపేట సీఐ సంగమేశ్వరరావు, ఎస్‌ఐలు నాగరాజు, ఆదిలక్ష్మి ఆస్పత్రికి చేరుకుని చినారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని సీడీపీవో ఉమామహేశ్వరి చెప్పారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయశ్రీ ఆస్పత్రికి వెళ్లి చిన్నారులను, వారి తల్లిదండ్రులను పరామర్శించారు. సీహెచ్‌సీ సూపరింటెండెంట్ చంద్రకళతో మాట్లాడి చిన్నారుల ఆరోగ్యం గురించి చర్చించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, తెలుగు యువత జిల్లా ఉపాధ్యక్షుడు అవధానం సుధీర్, గూడూరు సుధీర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రూ.161 కోట్లతో తిమ్మాజికండ్రిగ - పండ్లూరు రోడ్డు విస్తరణ



పండ్లూరు రైల్వే గేట్ వద్ద ఆర్అండ్‌బీ రోడ్డును పరిశీలిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

ఓజిలి, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): విశాఖ - చెన్నై పారిశ్రామిక ప్రాంత అభివృద్ధిలో భాగంగా నాయుడుపేట మండలం తిమ్మాజికండ్రిగ నుంచి ఓజిలి మండలం గ్రద్దగుంట, కొత్తపేట, పున్నేపల్లి గ్రామాల మీదుగా పండ్లూరు వద్ద జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ రోడ్డును మంగళవారం సూళ్లూరుపేట ఆర్డీవో కిరణ్మయి, ఆర్అండ్‌బీ అధికారులు పరిశీలించారు. 45 మీటర్ల వెడల్పుతో 8.7 కిలోమీటర్ల దూరం విస్తరించాలని నిర్ణయించారు. ఆసియా డెవలెప్‌మెంట్ బ్యాంక్ (ఏడీబీ) నిధులు రూ.161 కోట్లు వెచ్చించేలా ప్రణాళిక రూపొందించారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా ఏడు గ్రామాల పరిధిలో 68.16 ఎకరాల వ్యవసాయ భూములకు, ఓజిలి మండలంలోని లక్ష్మీపురం, పాపిరెడ్డికండ్రిగ, కొత్తపేట గ్రామాల పరిధిలో ఇళ్లు కోల్పోతున్న 29 మంది నష్టపరిహారం చెల్లించనున్నట్లు ఆర్డీవో తెలిపారు. భూసేకరణలో పొలాలు, ఇళ్లు కోల్పోతున్న వారి వివరాలను సామాజిక నిపుణుడు దేవరాజు ఆర్డీవో కిరణ్మయికి వివరించారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ ఈఈ పరమేశ్వరి, ఓజిలి, నాయుడుపేట తహసీల్దార్లు పద్మావతి, రాజేంద్ర, ఆర్అండ్‌బీ ఏఈ చిన్నరాయుడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయండి: విజయశ్రీ



ఎస్పీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజును కోరారు. మంగళవారం ఎస్పీని ఆయన కార్యాలయంలో కలిసిన ఎమ్మెల్యే పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సూళ్లూరుపేట, నాయుడుపేట పట్టణాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా గంజాయి రహిత పట్టణాలుగా తీర్చిదిద్దాలని కోరారు. ఇందుకు ఎస్పీ సానుకూలంగా స్పందించారు. అలాగే జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిసిన ఎమ్మెల్యే నియోజకవర్గంలో సమస్యలపై చర్చించారు.

పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంతం ఆధునికీకరణ



పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్

నాయుడుపేట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహ ప్రాంతాన్ని ఆధునికీకరిస్తామని మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా అన్నారు. మంగళవారం ఆర్యవైశ్యసంఘ జిల్లా అధ్యక్షుడు గూడూరు కిషోర్, ప్రధాన కార్యదర్శి గాదంశెట్టి నాగరాజుతో కలిసి అమరజీవి పొట్టి శ్రీరాముల విగ్రహ ప్రాంతాన్ని కమిషనర్ పరిశీలించారు. ఆర్టీసీ ప్రాంగణం ప్రహరీ కూలిపోవడం, ఆ ప్రాంతంలో ప్రధాన డ్రైనేజీ కాలువపై బండలు లేకపోవడాన్ని గుర్తించారు. కౌన్సిల్ ఆమోదంతో త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు బాబు, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాముడికి శయన సేవ



శయన సేవలో శ్రీరాముడు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 8(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న శ్రీరామనవమి వసంతోత్సవాలు మంగళవారం ముగిశాయి. చివరిరోజు శ్రీరాముడికి శయనసేవ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు వాకచర్ల రమేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ రూట్ల పరిశీలన

వాకాడు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట చెంగాళమ్మ, మల్లాంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, కసుపూరు ముత్యాలమ్మ పుణ్యక్షేత్రాలకు తిరుపతి నుంచి ఆర్టీసీ బస్సులను నడిపేందుకు రూట్లను పరిశీలించినట్లు రీజనల్ మేనేజర్ నరసింహరావు తెలిపారు. మంగళవారం ఆయన వాకాడు ఆర్టీసీ డిపోను సందర్శించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం డిపో మేనేజర్ పెంచలయ్య, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.

కోట పోలీస్‌స్టేషన్‌లో మాక్‌డ్రిల్



పోలీసులకు సూచనలిస్తున్న సీఐ హుస్సేన్‌బాషా

కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాల పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు. వాకాడు సీఐ హుస్సేన్‌బాషా మెరైన్ ఎస్ఐ నాగసౌమ్య ఆధ్వర్యంలో ఆయా మండలాల ఎస్‌ఐలు పవన్‌కుమార్, నాగబాబు, చిన్నజయరామయ్యతో పాటు పోలీసులు కవాతు నిర్వహించారు. వాకాడు మండలం దుగరాజపట్నం సముద్రతీరం మొదలుకొని కోట మండలం వరకు నిఘా పెంచాలని సీఐ హుస్సేన్‌బాషా అన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

రేణిగుంట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాలు చోరీ చేస్తున్న దొంగను అరెస్టు చేసి గాజులమండ్యం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. రాహూరు మండలం అఖిలవలస గ్రామానికి చెందిన ప్రసాద్ తిరుపతి - రేణిగుంట మార్గంలోని పారిశ్రామికవాడలోని ఓ కంపెనీలో పనిచేస్తున్నాడు. మంగళవారం ద్విచక్రవాహనాన్ని చోరీ చేస్తుండగా స్థానికులు గుర్తించి పోలీసులకు అప్పగించారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

తడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): తడ మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ కొళవి రఘురెడ్డి ఆధ్వర్యంలో ఉపాధి పనులకు సంబంధించి సోషల్ ఆడిట్ నిర్వహించారు. డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీడీ ప్రేమ్‌కుమార్, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి బి.గణేష్ రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయకుమార్, ఏపీవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా వితరణ

తడ, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని సుందరపురం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు మహారాల రత్నయ్య, దామోదర్ తమ తల్లిదండ్రులు చెంగయ్య, మాతమ్మ జ్ఞాపకార్థం మంగళవారం బీరువాను విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ లక్ష్మయ్య, ప్రధానోపాధ్యాయుడు గంగాధరం, అనురాధ, సీఆర్‌పీ మునస్వామి తదితరులు పాల్గొన్నారు.

రోహ్‌తక్ వర్క్‌షాప్‌లో పెళ్లకూరు జడ్పీటీసీ



వర్క్‌షాపులో ప్రజాప్రతినిధులతో నన్నం ప్రిస్కిల్లా

పెళ్లకూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): సమర్థవంతమైన పంచాయతీ పాలనలో నాయకత్వ నిర్వహణ, నైపుణ్యాభివృద్ధిపై హర్యానాలోని రోహ్‌తక్ యూనివర్సిటీలో జరుగుతున్న వర్క్‌షాప్‌లో పెళ్లకూరు జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా పాల్గొన్నారు. రోహ్‌తక్ యూనివర్సిటీలో ఈ నెల 7నుంచి 11వ తేదీ వరకు దేశంలోని స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులకు వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ఇందులో ఉమ్మడి నెల్లూరు జిల్లా నుంచి పెళ్లకూరు జడ్పీటీసీ ప్రిస్కిల్లా హాజరయ్యారు.

వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరభద్రస్వామి ఆలయంలో మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నదానం చేశారు.

సంగమేశ్వరుడి గ్రామోత్సవం



కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లు ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు కొబ్బరికాయలుకొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా పోషణ్ పక్వాడా



యాప్ డౌన్‌లోడ్ చేసే విధానాన్ని చూపుతున్న సీడీపీవో మునికుమారి

కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): అన్ని అంగన్వాడీ కేంద్రాల్లో ఈ నెల 8నుంచి 22వ తేదీ వరకు పోషణ్ పక్వాడా పక్షోత్సవాలు ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని సీడీపీవో మునికుమారి కోరారు. కోట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పోషణ్ పక్వాడా కార్యక్రమాలపై వాకాడు, చిట్టమూరు, కోట మండలాల అంగన్వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి అంగన్వాడీ కేంద్రంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి రెండేళ్ల లోపు శిశువుకు పోషకాహారం ఇచ్చే విషయమై తల్లికి అవగాహన కల్పించాలన్నారు. ఉబకాయం ఉన్న పిల్లలు పోషకాహారంతో పాటు మిటమిన్లు ఉన్న ఆహారాన్ని తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల నిర్వహణలో నిర్లక్ష్యం చేసే అంగన్వాడీ వర్కర్లపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని సీడీపీవో హెచ్చరించారు. సమావేశంలో సూపర్ వైజర్లు సరిత, కృష్ణమ్మ, శేషమ్మ, రత్నమ్మ, తదితరులు ఉన్నారు.

కమనీయం సీతారాముల కల్యాణం



కోదండరామస్వామి కల్యాణం చేస్తున్న వేదపండితులు

కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడులో నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సీతా సమేత కోదండరామస్వామి కల్యాణం కన్నులపండువగా నిర్వహించారు. వేదపండితులు భక్త జనసందోహం నడుమ సీతారాముల కల్యాణాన్ని జరిపించారు. కల్యాణం అనంతరం తలంబ్రాలు కోసం భక్తులు పోటీపడ్డారు.

కోట మండల బీజేపీ అధ్యక్షుడిగా సురేష్



పులి సురేష్‌ను అభినందిస్తున్న బీజేపీ నాయకులు

కోట, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కోట మండల బీజేపీ అధ్యక్షుడిగా పులి సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సురేష్‌ను బీజేపీ నాయకులు పూల మాలలు శాలువాలతో అభినందించారు. ఎన్నికల అధికారి వ్యవహరించిన డాక్టర్ శ్రీహరి నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన పులి సురేష్ చేత ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పనబాక కోటేశ్వరరావు, గిరిధర్‌రెడ్డి, వెంకయ్యగౌడ్, సారంగం రమేష్, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి



మసీదు వద్ద నిరసన తెలుపుతున్న ముస్లిం నాయకులు

గూడూరు, ఏప్రిల్ 8 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని ముస్లిం నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక దర్గావీధిలోని నూర్ మసీదు వద్ద ముస్లింలు వక్ఫ్ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ముస్లింల పట్ల కక్షపూరితంగా వ్యవహరిస్తూ అణగదొక్కేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రానున్న రోజులలో పౌరసత్వ బిల్లు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తోందని, ఇదే జరిగితే ముస్లింల మనుగడ కష్టతరంగా మారుతుందన్నారు. ముస్లింల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కార్యక్రమంలో మగ్ధూమ్, గౌస్‌బాషా, మహబూబ్‌బాషా, సలీం, సంధానీ, బాబు, జునైద్, అల్లాభక్షు పాల్గొన్నారు.

పీఏసీ5 పనులపై అదనపు ఈవో సమీక్ష

తిరుమల, ఏప్రిల్8(ఆంధ్రజ్యోతి): తిరుమలలో కొత్తగా నిర్మిస్తున్న యాత్రికుల వసతి సముదాయం(పీఏసీ5) పనులను మంగళవారం టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి పరిశీలించారు. కల్యాణకట్ట, డైనింగ్‌హాల్, లాకర్ల ఏర్పాటు, మరుగుదొడ్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకుముందు అన్నమయ్య భవనంలో పీఏసీ5 నిర్మాణ పనుల పురోగతిపై సమీక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు డిప్యూటీఈవోలు రాజేంద్ర, హరీంద్రనాథ్, వెంకటయ్య, ఈఈలు వేణుగోపాల్, సుధాకర్, డీఈ చంద్రశేఖర్ తదితరులు అదనపు ఈవోతో పాటు పాల్గొన్నారు.